ఆదివాణి
గత వారం విశేషాల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

కాంగ్రెస్‌లో చీలికకు ఎన్డీయె కుట్రలు: ఖర్గే 3

భర్తను నేనే హత్య చేయించా: సోనమ్ 5

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-6-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 131 పేజీలు: 10+4 వెల: 6.50



బుధవారం హైదరాబాద్‌లో ఘోష్ కమిషన్ విచారణకు వెళ్తున్న మాజీ సిఎం కెసిఆర్

## అన్ని అనుమతులతోనే 'కాళేశ్వరం'

**జస్టిస్ ఘోష్ విచారణలో మాజీ సిఎం కెసిఆర్**

**51 నిమిషాలు.. 18 ప్రశ్నలకు సమాధానాలు**

మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం, నీటి లభ్యత లేనందునే ప్రాజెక్టు స్థలం మార్పు

**కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం మేరకే నిర్మాణం**



బుధవారం బిఆర్‌కె భవన్‌కు భారీగా తరలివచ్చిన బిఆర్ఎస్ కార్యకర్తలు

**హైదరాబాద్,జూన్ 11,ప్రభాతవార్త:** ప్రాణహిత- చేవెళ్ళ ప్రాజెక్టు తుమ్మడిహట్టివద్ద నిర్మాణంకు మహారాష్ట్రప్రభుత్వం అభ్యంతరం, నీటి లభ్యత లేకపోవడంతో మంత్రి వర్గ ఉపసంఘం కమిటి వేసి దాని సూచనలు, కేంద్రజల శక్తి మంత్రిత్వ శాఖ టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం, జూన్ 2018లో ప్రాజెక్ట్ నిర్మాణానికి అన్ని అనుమతులు తీసుకున్నామని, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలిపారు. కాళేశ్వరం వైఫల్యం పై వేసిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఎదుట తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బిఆర్ ఎస్ అధినేత కెసిఆర్ బుధవారం విచారణకు హాజరైనారు. బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో పిసిఘోష్ కమిషన్ సుమారు 51 నిమిషాల పాటు కెసిఆర్‌ను 18 రకాల ప్రశ్నలతో విచారించింది. 115వ సాక్షిగా ఆయన్ను విచారించింది.ఆయన వెంట హరీశ్ రావ్ ఉన్నారు.జస్టిస్ విచారణ మొదలు పెడుతూనే ఆనకట్టల నిర్మాణంపై నిర్ణయం ఎవరిది ప్రశ్నను కెసిఆర్ కు స్పందించారు. తుమ్మడిహట్టి వద్ద ప్రాణహిత-చెవెళ్ళ ప్రాజెక్టు నిర్మించకుండా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిపాదన ఎలా ముందుకు వచ్చిందని జస్టిస్ ప్రశ్నించారు. కాళేశ్వరం కార్పొరేషన్‌ఏర్పాటు చేయడం వెనుక మతలబేమిటని ఆయన అడిగినట్లు తెలిసింది. ఆనకట్టల నిర్మాణానికి ఎవరు నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించింది.బ్యారేజిలలో నీటిని నిల్వ చేయాలనే నిర్ణయం సాంకేతిక నిపుణుల అభిప్రాయం తీసుకొని చేశారా అని ఆరా తీసినట్లు తెలిసింది. ఎంత నీరు నిల్వ చేయాలన్నది ఇంజినీర్లు చూసుకుంటారని కెసిఆర్ చెప్పారు .బ్యారేజీల్లో నీటి నిల్వకోసం తాను అలాంటి ఆదేశాలు ఇవ్వలేదని,బ్యారేజీలు నీటిని ఎత్తిపోయడానికి >>2



## కెసిఆర్ కుటుంబ సభ్యులే తెలంగాణకు శత్రువులు

**వారికి కాంగ్రెస్‌లోకి 'నో ఎంట్రీ'**

రాష్ట్రంలో ప్రతి అభివృద్ధిని అడ్డుకొంటున్న కిషన్‌రెడ్డి

కెటిఆర్ సూచనతోనే మెట్రోకు కిషన్‌రెడ్డి అడ్డుపుల్ల

ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్11:** తానున్నంత వరకూ కాంగ్రెస్‌లోకి కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా చెప్పారు. రాష్ట్రానికి కేసీఆర్ కుటుంబమే ప్రధాన శత్రువు అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరిగిన మంత్రివర్గ విస్తరణపై దిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ నిర్వహించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.తాను ఢిల్లీకి వచ్చింది తెలంగాణ, కర్ణాటకలో విజయవంతమైన కులగణన వివరాలు పంచుకోవడానికి తెలియజేశారు. కర్ణాటక కులగణనపై మాత్రమే అధిష్ఠానం వద్ద చర్చలు జరిగాయన్నారు. తాను అధికారంలో ఉన్నంత వరకూ కెసిఆర్ కుటుంబానికి కాంగ్రెస్ లో నో ఎంట్రీ బోర్డు >>2



## కొత్త మంత్రులకు శాఖలు

**వివేక్ వెంకటస్వామి: కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ, ఫ్యాక్టరీ, భూగర్భ గనులు**

**అడ్లూరి లక్ష్మణ్‌కుమార్: ఎస్సీ సంక్షేమం, గిరిజన సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, వికలాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం**

**వాకటి శ్రీహరి: పశు సంవర్ధక శాఖ, డెయిరీ అభివృద్ధి, మత్స్య శాఖ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్11:** కేబినెట్ విస్తరణలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్,వాకటి శ్రీహరిలకు బుధవారం రాత్రి 10 గంటలకు శాఖల కేటాయింపు జరగనుంది. నూతనంగా మంత్రులకు ఎవరికి ఏ శాఖ కేటాయించనున్నారు అనే విషయం ఏర్పడిన ఉత్కంఠ ముగిసింది. >>2

**కాళేశ్వరంలో మరో అవినీతి తిమింగలం:**

## ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ ఇళ్లలో ఎసిబి సోదాలు

2

**వెయ్యికోట్ల ఆస్తులున్నట్లు గుర్తింపు**

**జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు**



## రాష్ట్రానికి యుకె పెట్టుబడులు

**'స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా తెలంగాణ**

సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో యువతకు శిక్షణ

**2030 నాటికి 10వేల మందికి తర్ఫీదు ఇవ్వనున్న స్ప్రింగ్ సెమీ కండక్టర్స్**

ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్11:** స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్్‌గా తెలంగాణను మార్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్న యూకేకు చెందిన సెమీ కండక్టర్ దిగ్గజ సంస్థ ఆర్మ్ హోల్డింగ్స్ సంస్థ ప్రతినిధులతో ఆయన బుధవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో భేటీ అయ్యారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా వివరించారు.`సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్ లో దిగ్గజ సంస్థగా ఉన్న ఆర్మ్ హోల్డింగ్స్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించడం మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. తెలంగాణ రైజింగ్ లో భాగస్వామ్యయ్యేందుకు ముందుకొచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. పరిశ్రమ ఏర్పాటులో అన్ని రకాలుగా అండగా ఉంటాం అని హామీ ఇచ్చారు.`మాకున్న పెద్ద ఆస్తి యువత. వారిలో ప్రతిభకు కొదువ లేదు. కొంచెం సానబెడితే మెరికల్లా తయారవుతారు. పరిశ్రమలకు అవసరమైన రెడిమేడ్ మానవ వనరులను అందించే బాధ్యతను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా మా ప్రభుత్వం తీసుకుంద్ధి అని వివరించారు. `సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్ లో ఉన్న డిమాండ్ కు అనుగుణంగా తెలంగాణ యువతను తీర్చి దిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రయాణంలో మీరు కూడా భాగస్వామ్యం కావాలన్నది మా ఆకాంక్ష. 10వేల మంది యువత శిక్షణనిచ్చే బాధ్యతను తీసుకోవాల్ధి అని సమావేశానికి హాజరైన మలేషియాకు చెందిన దిగ్గజ సంస్థ "స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ సీఈవో కెన్ కూను కోరారు. తెలంగాణను స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్ గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం. మా వంతుగా ఇక్కడి యువతను సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్ లో అత్యుత్తమ మానవ వనరులుగా తీర్చి దిద్దేలా ప్రత్యేక కరిక్యులమ్ ను రూపొందిస్తాం. విద్యా సంస్థల సహకారంతో ఆరు నెలలు ఇక్కడ శిక్షణ... మిగిలిన కాలం తైవాన్, >>2



## గాలి జనార్దన్ రెడ్డికి బెయిలు మంజూరు

**మరో ముగ్గురికి కూడా..**

**ఓబులాపురం మైనింగ్ కేసు**

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** ఓబులాపురం గనుల అక్రమ మైనింగ్ కేసులో సిబిఐ కోర్టు తీర్పు అనుసారం జైలు శిక్ష అనుభవిస్తున్న కర్నాటక బిజెపి ఎంఎల్ఎ గాలి జనార్ధన్ రెడ్డితో పాటు మరో ముగ్గురికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి సిబిఐ కోర్టు తీర్పును హైకోర్టు బుధవారం సస్పెండ్ చేసింది. దీంతో పాటు నలుగురు నిందితులకు బెయిల్ మంజూరుచేసింది. ఉమ్మడిఎపి హయాంలో సంచలనం రేపిన ఓబులాపురం గనుల అక్రమ మైనింగ్ కేసులో కర్నాటక బిజెపి నేత గాలి జనార్ధన్ రెడ్డి ఆయన సోదరుడు గాలి శ్రీనివాస్ రెడ్డి, వీరి పిఎ అలీ ఖాన్, నాటి ఎపి గనుల శాఖ కార్యదర్శి విడి రాజగోపాల్‌కు హైకోర్టులో ఊరట దక్కింది. 2011 నాటి ఈ కేసులో గత మే నెల ఆరవ తేదీన నాంపల్లి సిబిఐ కోర్టు సంచలన తీర్పు ఇవ్వడం తెలిసిందే. నలుగురు నిందితులకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు భారీగా జరిమానా విధించడం విదితమే. అనంతరం నలుగురు నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించారు. తమకు జైల్లో ప్రత్యేక వసతులు కావాలని గాలి సోదరులు కోర్టును ఆశ్రయించగా న్యాయమూర్తి తిరస్కరించారు. దీని తరువాత గాలి జనార్ధన్ రెడ్డి ఆయన >>2

## మళ్లీ తొమ్మిది గంటలు ప్రశ్నలు

**ప్రభాకర్‌రావును క్షుణ్ణంగా విచారణ జరిపిన సిట్ అధికారులు**

**జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్లను ఎవరు ట్యాప్ చేయమన్నారు?**

శ్రవణ్ రావుకు సంబంధం ఏమిటి?

నలుగురు నిందితుల వాంగ్మూలం ఆధారంగా ప్రశ్నించిన అధికారులు.. 14న తదుపరి విచారణ



**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు రెండవ దఫా విచారణ బుధవారం ముగిసింది. అమెరికా నుంచి 15 నెలల తరువాత భారత్‌కు వచ్చిన ప్రభాకర్ రావును సోమవారం నాడు జూబ్లీహిల్స్ పోలీ సు స్టేషన్‌లోని ఎసిపి కార్యాలయంలో ఎనిమిది గంటల పాటు విచారించడం తెలిసిందే. ఈ కేసులో మంగళవారం నాడు విరామం ఇచ్చిన సిట్ అధికారులు బుధవారం నాడు ప్రభాకర్ రావును రెండవసారి తొమ్మిది గంటల పాటు విచారించారు. ఫోన్ ట్యాపింగ్ అంతా పై అధికారులకు తెలిసే జరిగిందంటున్నారు...? ఇందులో మీ ప్రమేయం ఏమీ లేదంటున్నారు...? పై అధికారుల ప్రమేయం లేదా ఆదేశాలకు సంబంధించి మీ వద్ద వున్న ఆధారాలు ఏమిటీ...? అని సిట్ అ ధికారులు ప్రభాకర్ రావును సూ టిగా ప్రశ్నించారని తెలిసింది. మీ ఆదేశాల మేరకే అప్పట్లో సెలబ్రటీలతో పాటు జడ్జిలు, జర్నలిస్టులు, రాజకీయ ప్రముఖుల ఫోన్‌లను ట్యాపింగ్ చేసినట్లు ఈ కేసులో అరెస్టయిన నలుగురు నిందితులు వాంగ్మూలం ఇవ్వగా దీనితో సంబంధం లేదని, ఒకవేళ తాను ఆదేశాలు ఇచ్చివుంటే చూపాలని కోరారు కదా...ఇప్పుడు పై అధికారులకు తెలిసే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని మీరంటున్నారు...? అప్పట్లో మీ పై అధికారులు మీకు ఎలాంటి ఆదేశాలు ఇచ్చారు...? ఒకవేళ ఆదేశిస్తే దీనికి సంబంధించిన పత్రాలు కానీ ఆధారాలు కానీ మీ వద్ద వున్నాయా...? ఒకవేళ మౌఖికంగా ఆదేశిస్తే ట్యాపింగ్ చేశారా...? ఇలా మౌఖిక ఆదేశాలు ఇచ్చిన పై అధికారులు ఎవరు...? అప్పటి డిజిపిలా...? లేదా నిఘా విభాగం అధిపతులా...? అని సిట్ అధికారులు ప్రభాకర్ రావును పదే పదే ప్రశ్నించగా ఈ ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వలేక మౌనం వహించారని తెలిసింది. మీడియా అధినేత శ్రవణ్ రావుకు ఫోన్ ట్యాపింగ్‌కు ఏమిటీ సంబంధం..? అతని పాత్ర ఇందులో ఏమిటీ...? జడ్జిలు, రాజకీయ నేతలు, సెలబ్రటీల ఫోన్‌లను ట్యాపింగ్ చేయమని మీ పై అధికారులు మీకు చెప్పారా...? లేదా మీడియా అధినేత శ్రవణ్ రావు చెప్పారా...? ఒకవేళ చెబితే ఏ అధికారాలతో వారు ఇలా చెప్పారు...? నిబంధనల ప్రకారం అసాంఘీక శక్తులు, నక్సలైట్ల ఫోన్‌లు మినహా ఇతరుల ఫోన్లను ట్యాపింగ్ చేయడం చట్ట విరుద్ధమని మీకు తెలియదా...? అని సిట్ అధికారులు ప్రభాకర్ రావును అడినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి వున్న నియమ నిబంధనలు ఏమిటీ...? ఇందుకు సంబంధించి సర్కారు ఏర్పాటు చేసిన రివ్యూ కమిటీలో ఎవరెవరు వుంటారు..? వీరిహోదాలు ఏమిటీ..? మీ హయాంలో వున్న రివ్యూ కమిటీలో వున్న సభ్యులు ఎవరు...? దీనికి వున్న విధి విధానాలు ఏమిటీ...? ఈ కమిటీ ఎవరి ఫోన్లను అయినా ట్యాపింగ్ చేయమని ఆదేశించిందా..?ఒకవేళ ఆదేశిస్తే మీ హయాంలో ఎంతమంది ఫోన్‌లను ట్యాపింగ్ చేయమని వుంది..? ఇందులో అసాంఘీక శక్తులు, నక్సలైట్ల ఫోన్‌లు కాకుండా మిగతా వారి ఫోన్‌లు >>2



## మంగ్లీ బర్త్‌డే పార్టీలో గంజాయి, విదేశీ మద్యం!

**దాడి చేసి కేసులు పెట్టిన పోలీసులు**

2

**ప్రభుత్వ స్కూళ్లలో ఇక**

## నర్సరీ, ఎల్‌కెజి

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్11:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లోనూ ఒకపై ప్రైమరీ విద్యను అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి చదువుకునే అవకాశం ఉండగా ప్రైవేట్ స్కూళ్లలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నడుస్తున్నాయి. చిన్నారులకు 3 ఏళ్లు నిండగానే తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని, దానివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని భావిస్తుంది. దీంతో తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైమరీ ఎడ్యుకేషన్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 210 పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. 2025-26 అకాడమిక్ ఇయర్‌కు సంబంధించి నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులకు(డీఈవోలకు) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## అట్టుడుకుతున్న లాస్ ఏంజెల్స్



**వలసదారుల అరెస్టుకు వ్యతిరేకంగా**

**లూటీలు, దహనాలు, నిరసనలు**

**కొన్ని ప్రాంతాల్లో పాక్షిక కర్ఫ్యూ**

**లాస్ ఏంజెల్స్, జూన్ 11:** అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన వలసదారుల అరెస్టులకు వ్యతిరేకంగా చెలరేగిన హింసాత్మక నిరసనలు, దహనాలు, లూటీల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం నుంచి పాక్షిక కర్ఫ్యూ విధిస్తున్నట్లు మేయర్ కారెన్ బాస్ ప్రకటించారు. ఈ పరిణామం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. లాస్ ఏంజెలెస్ డౌన్ టౌన్‌లోని కొన్ని ప్రాంతాల్లో నిన్నటి నుంచి పాక్షిక కర్ఫ్యూ అమల్లోకి వచ్చిందని మేయర్ కారెన్ బాస్ తెలిపారు. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ కర్ఫ్యూ అమల్లో ఉంటుందని, అవసరాన్ని బట్టి కొన్ని రోజుల పాటు కొనసాగవచ్చని ఆమె వివరించారు. అయితే, కర్ఫ్యూ ప్రాంతాల్లో నివసించే వారికి, అక్కడ పనిచేసే ఉద్యోగులకు దీని నుంచి మినహాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. గతవారం లాస్ ఏంజెలెస్‌లో రోజువారీ కూలీలు, కార్మికులపై ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ అధికారాలను ట్రంప్ ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. "మెరైన్లు ఇక్కడికి వచ్చాక ఏం చేస్తారని ప్రజలు నన్ను అడుగుతున్నారు. అది మంచి ప్రశ్నే, నాకూ ఎలాంటి సమాచారం లేదు" అని పాక్షిక కర్ఫ్యూ ప్రకటన సందర్భంగా విలేకరులతో అన్నారు.ఈ నిరసనలను శాంతికి, ప్రజాభద్రతకు ముప్పుగా అభివర్ణించిన ట్రంప్ ఆందోళనకారులను అణచివేయడానికి సైన్యాన్ని మోహరించాల్సి వస్తే అరుదుగా ఉపయోగించే వివాదాస్పద >>2



## 5 రోజులు భారీ వర్షాలు

**పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ**

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** రానున్న ఐదు రోజుల్లో తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. నేటి నుంచి ఐదు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలో ఉరుములు, మెరుపులులో కూడిన వర్షాలు కురుస్తాయని బుధవారం ఒక ప్రకటనలో వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. వర్షంతో పాటు పలు ప్రాంతాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ములుగు, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, >>2



ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూనె శ్రీధర్‌ను మలక్ పేట్‌లోని ఆయన నివాసానికి తీసుకొస్తున్న ఎసిబి అధికారులు

## కాళేశ్వరంలో మరో అవినీతి తిమింగలం: ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ ఇళ్లలో ఎసిబి సోదాలు

### వెయ్యికోట్ల ఆస్తులున్నట్లు గుర్తింపు

### జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు

**హైదరాబాద్,జూన్ 11,ప్రభాతవార్త:** తెలంగాణ నీటిపారుదలశాఖలో ఎగిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎస్ఆర్ఎస్‌పి ఐఅండ్‌సిఎడి డివిజన్ 8లో పని చేస్తున్న నూనెశ్రీధర్ రూ. ఆరువందల కోట్లపైగా ఆస్తులు పోగేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుల్లో రూ.3500కోట్ల దాక పనులు నూనె శ్రీధర్ పర్యవేక్షణలో జరిగాయి. నీటిపారుదలశాఖ కీలక నియామకాల్లో కూడా శ్రీధర్ పాత్ర ఉండటంతో రెండు చేతుల్లా కోట్లది అవినీతి సొత్తు సొంతం చేసుకొన్నారు. అంతెకాదు ప్రభుత్వంకు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారనే అబియోగం కూడా ఆయనపై ఉండటంతో బుధవారం ఉదయమే ఆయనను ఎసిబి కస్టడీకి తీసుకొంది. నూనెశ్రీధర్‌ను సాయంత్రం జుడిష్యల్ రిమాండ్‌కు ఎసిబి అధికారులు తరలించారు. అక్రమ ఆస్తుల కేసులో నూనెశ్రీధర్ నివాసంతోపాటు అతని సమీపబంధువులకు చెందిన 13 ప్రదేశాల్లో ఎసిబి అధికారులు సోదా చేసి ఆస్తుల చిట్టాను బయటపెట్టారు. నూనె శ్రీధర్‌కు తెల్లాపూర్‌లో అత్యంత ఖరీదైన విల్లా ఉంది. షేక్‌పేటలో కూడా ఖరీదైన ఒక అపార్టుమెంట్‌లోఫ్లాట్ కలిగి ఉన్నారు. కరీంనగర్‌లో మూడు ఫ్లాట్‌లు, అమిర్‌పేట్‌లో వాణిజ్యసముదాయం, హైదరాబాద్‌లో,వరంగల్‌లో కరీంనగర్‌లో ఒకటి చొప్పున ఖరీదైన మూడు విశాలమైన భవంతులు, హైదరాబాద్‌లో 19 ఓపెన్‌ప్లాట్లు,కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ పరిసరప్రాంతాల్లో 16 ఎకరాల వ్యవసాయభూమి, రెండు ఖరీదైన కార్లు, బంగారు ఆభరాలు,కళ్ళు జిగేల్ మనే వజ్రపు ఆభరాలు లెక్కకు మిక్కిలి ఎసిబి తనిఖీల్లో వెలుగులోకి వస్తున్నాయి. ఎసిబి అధికారులు ఇంకా నూనె శ్రీధర్ ఇంట్లో ఆయన సహచరుల ఇంట్లో తనిఖీలు చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆస్తుల విలువ తక్కువగా ఉన్నప్పటికి మార్కెట్ విలువ ప్రకారం ఇప్పటికే వెలుగులోకి చూసిన ఆస్తుల విలువ వెయ్యి కోట్ల మేరకు ఉంటుందని నీటిపారుదలశాఖ ఉద్యోగులు చర్చించుకొంటున్నారు.

## బెయిలు మంజూరు

>> సోదరుడు గాలి శ్రీనివాస్ రెడ్డి, వారి పిఎ అలీఖాన్‌లపై కర్నాటకలో వున్న కేసుల విచా రణ నిమిత్తం ముగ్గరిని బెంగళూరు పోలీసులు అక్కడి జైలుకు తరలించారు. ఈ ముగ్గురు ప్రస్తుతం బెంగళూరు జైలులో వున్నారు. విడి రాజగోపాల్ మాత్రమే చంచల్‌గూడ జైల్లో వున్నారు. అయితే ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో సిబిఐ కోర్టు తమకు విధించిన తీర్పును నలుగురు నిందితులు తెలంగాణ హైకోర్టు లో సవాల్ చేశారు. సిబిఐ కోర్టు తీర్పు ఏకపక్షంగా వుందని వారు వాదించారు. ఓబుళాపురం గనుల కేసులో గాలి జనార్ధన్ రెడ్డి సహా ఇతర నిందితులు మూడు న్నరేళ్లకు పైగా జైలు శిక్ష అనుభవించారని, ఈ సమయంలో బెయిల్ ఇవ్వాలని నిందితుల తరపు న్యాయవాది వాదించారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ కూడా అదే స్థాయిలో వాదనలు వినిపించి, నలుగురు నిందితులకు బెయిల్ ఇవ్వరాదని, సిబిఐ కోర్టు తీర్పును ఖరారు చేయాలని కోరారు. ఇరువర్గాల వాదనలు మంగళవారం నాడు ముగిశాయి. దీనిపై హైకోర్టు బుధవారం ఉదయం ఉత్తర్వులు ఇస్తూ ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో గాలి సోదరులతో పాటు మరో ఇద్దరు నిందితులకు సిబిఐ కోర్టు విధించిన తీర్పును సస్పెండ్ చేసింది. దీంతో పాటు నలుగురు నిందితులకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. నింది తులు తమ పాస్‌పోర్టులను పోలీసులకు అప్పగించాలని, దేశం విడిచి వెళ్లరాదని, పది లక్షల రూపాయల పూచీకత్తు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. నలు గురు నిందితులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసినా ఇందులో చంచల్‌గూడ జైల్లో వున్న విడి రాజగోపాల్ బెయిల్ పత్రాలు బుధవారం సాయంత్రం వరకు జై లు అధికారులకు అందలేదు. బెంగళూరు జైల్లో వున్న మిగతా ముగ్గరి గురించి తమకు సమాచారం లేదని చంచల్‌గూడ జైలు అధికారులు తెలిపారు.

## మళ్లీ తొమ్మిది గంటలు ప్రశ్నలు

>> ఎంతమందివి ట్యాపింగ్ చేశారు...? ఎస్ఐబి బాస్‌గా మీరు వున్న సమయంలో రాష్ట్రంలో జరి గిన హుజూరాబాద్, దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష నేతలు, వారి అనుచరుల వద్ద లభ్యమైన డబ్బులు ఫోన్ ట్యాపింగ్ వల్లే పట్టుకున్నామని ఈ కేసులో అరెస్టయిన ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావులు ఇచ్చిన వాంగ్మూలంపై మీ సమాధానం ఏమిటీ...? ఈ మూడు ఉప ఎన్నికల్లో ప్రతిపక్ష నేతలు, వారి అనుచరులు డబ్బులు తరలిస్తున్న విషమం మీకు ఫోన్ ట్యాపింగ్ వల్లే తెలిసిందని, ఈ కేసులో అరెస్టయిన నలుగురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలంపై మీ సమాధానం ఏమిటీ...? అని సిట్ అధికారులు ప్రభాకర్ రావును గుచ్చి గుచ్చి ప్రశ్నించగా ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన బదులిచ్చినట్లు తెలిసింది. కాగా సిట్ అధికారుల ప్రశ్నలలో కొన్నింటికి ప్రభాకర్ రావు తడబడి సమాధానాలు ఇచ్చినట్లుగా తెలిసింది. మరికొన్నింటికి మౌనం వహించినట్లు సమాచారం. అప్పట్లో నాలుగు వేలకు పైగా ఫోన్‌లను మీ హయాంలో ట్యాపింగ్‌కు గురైనట్లు ఆధారాలు వున్నాయి. ఈ నంబర్లన్నీ మీకు ఎవరు ఇచ్చారు...?. మీడియా అధినేత శ్రవణ్ రావు ప్రైవేటు వ్యక్తి...అతనితో ఎస్ఐబికి ఏమి టీ సంబంధం...? మీతో అతనికున్న అనుబంధం ఏమిటీ...? అని ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. విచారణలో భాగంగా ప్రభాకర్ రావు ఎస్ఐబి బాస్‌గా పనిచేసిన సమయంలో తన వద్ద వున్న రెండు సెల్‌ఫోన్లను సిట్ అధికారులకు అప్పగించారు. ఇందులోని సమాచారాన్ని పరిశీలించే నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పంపాలని సిట్ అధికారులు ని ర్ణయించారు.

కాగా విచారణలో భాగంగా ప్రభాకర్ రావు నుంచి కొన్ని ప్రశ్నలకు సిట్ అధికారులు రాతపూర్వక సమాధానాలు తీసుకున్నారని తెలిసింది. కాగా ఉదయం 11.20 గ ంటల సమయంలో సిట్ కార్యాలయానికి వచ్చిన ప్రభాకర్ రావు రాత్రి ఎనిమిదిన్నర గంటలకు విచారణ పూర్తవడంతో వెళ్లిపోయారు. ఈ నె ల 14వ తేదీన మరో సారి విచారణకు రావాలని ప్రభాకర్ రావును సిట్ అధి కారులు ఆదేశించారు. కాగా విచారణ తరువాత బయటకు వచ్చి న ప్రభాకర్ రావు మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు. విచారణ సందర్భంగా ఆయన వా ంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేశారు. ఇదంతా వీడి యో తీశారు. విచా రణ ప్రక్రియ అంతా పశ్చిమ మండల డిసిపి విజయ్ కుమార్ పర్యవేక్షణలో జర గగా జూబ్లీహిల్స్ ఎసిబి వెంకటగిరి తన బృందంతో పర్యవే క్షించారు.

## భారీ వర్షాలు

>> వనపర్తి, నారాయణపేట, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, సంగారెడ్డి, గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 12న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. 13వ తేదీన నిర్మల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. అలాగే, 14, 15 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది.

## 17 దాకా అంగన్వాడీ బాట

### చివరి రోజు సామూహిక అక్షరాభ్యాసాలు

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలను చేర్పించేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షమ శాఖ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. ఇప్పటి నుంచి 17 వరకు అమ్మ మాట–అంగన్వాడీ బాట పేరుతో పిల్లలను గుర్తించి, వారు కేంద్రాలకు వచ్చేల నిర్ణయిం చింది. ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. ప్రవేశాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అర్హత ఉన్న పిల్ల లందరూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించింది. కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరిస్తూ సిబ్బంది కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇక తొలి రోజు అంగన్వాడీ కేంద్రాలను అలంకరించాలి. తల్లిదండ్రులు, పిల్లలను స్వాగతించాలి. సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయాలి. సెల్ఫీ తీసుకోవడానికి ప్రోత్స హించాలి. అంగన్వాడీ లెవల్ మానిటరింగ్ సపోర్ట్ కమిటీ సభ్యుల ఇతర సంఘాలతో కలిసి గ్రామ స్థాయిలో సమావేశం నిర్వహించాలి. 11, 12న మూడేళ్లు నిండిన పిల్లలను గుర్తించి వారి ఇళ్లను సందర్శించి వారిని అంగన్వాడీల్లో చేర్పించాలి. అలాగే అంగన్వాడీ కేంద్రల్లో ప్రీ స్కూల్ విద్య పూర్తి చేసిన పిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికేట్ జారీ చేయాలి. వారిని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలి. ఇక 13 నుంచి 16వరకు బోధన సామగ్రిని అమర్చి అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించాలి. 17న సామూహిక అక్షరాభ్యాసం చేపట్టాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నిర్దేశించింది.

### వారం - వర్జ్యం

తేది : 12-06-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
కృ.పాడ్యమి మ.2.25
మూల రా.9.55
వర్జ్యం ఉ.8.04-9.46
దు.ఉ.9.58-10.50, మ.3.13-సా.4.05
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**వేషం:** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. దీర్ఘ కాలిక సమస్యలనుండి కొంతవరకు బయటపడతారు.

**వృషభం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ప్రయాణాలు.

**మిథునం:** మిత్రులతో అకారణంగా విభేదాలు ఏర్పడవచ్చు. వాహనాలు, స్థలాలు కొనుగోలు యత్నాలలో తొందరపాటు వద్దు.

**కర్కాటకం :** కాంట్రాక్టులు శ్రమానంతరం దక్కుతాయి, వృత్తి– వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**సింహం:** మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. దీర్ఘ కాలిక సమస్యల నుండి బయట పడతారు.

**కన్య :** ఏ పని తలపెట్టినా ఆటంకాలు ఎదురై చికాకు కలిగిస్తాయి. ఋణ వత్తిడులు కొంతవరకు తీరుతాయి.

**తుల :** బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. అంతర్గత శత్రువులు అధికమవుతారు.

**వృశ్చికం:** పూర్వపు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఋణ బాధలు కొంతవరకు తీరుతాయి.

**ధనుస్సు:** బంధువులను కలుసుకొని ఉల్లాసంగా గడుపుతారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**మకరం:** వాహనాలు, స్థలాల కొనుగోలు యత్నాలు నిదానంగా సాగుతాయి.

**కుంభం:** కొత్త కార్యక్రమాలను చేపట్టి సకాలంలో పూర్తిచేస్తారు. దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుతుంది.

**మీనం :** సన్నిహితుల నుండి వచ్చిన సమాచారం వల్ల ఆనందం కలుగు తుంది. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధికమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తెలంగాణకు శత్రువులు

>> ఉంటుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ సిఎం కెసిఆర్ కుటుంబ సభ్యులే తెలంగాణకు శత్రువులు అని విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం గురించి రెండు,మూడు రోజుల్లో ప్రెస్‌మీట్ పెడతామని,ఈ ప్రాజెక్టుకు సంబంధించి కీలక డాక్యుమెంట్లు బయటపెడతానని చెప్పారు.తెలంగాణకు సంబంధించి కేంద్రంలో అన్నింటికీ అడ్డుపడుతున్నది కిషన్‌రెడ్డి అని ఆరోపించారు. ఏ ఒక్క ప్రాజెక్టుకు కిషన్‌రెడ్డి నిధులు సాధించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఒక ప్రాజెక్టు కూడా తీసుకురాలేదని విమర్శించారు.

తెలంగాణ అభివృద్ధికి కిషన్ రెడ్డి ముందుకు వస్తే వారితో కలిసి వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాజెక్టులపై కిషన్ రెడ్డితో సమీక్ష చేసేందుకు రెడీగా ఉన్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఏ రోజైనా తెలంగాణ ప్రాజెక్టులపై కిషన్ రెడ్డి నివేదిక ఇచ్చారా కనీసం తెలంగాణకు ప్రాజెక్టు ఇవ్వాలని డిమాండ్ చేశారా అని ప్రశ్నించారు. కేంద్ర కేబినెట్‌లో తెలంగాణ అంశాలను ఎప్పుడైనా కేంద్రమంత్రి ప్రస్తావించారా అంటూ నిలదీశారు. నిర్మల సీతారామన్ చెన్నైకు మెట్రో తీసుకువెళ్లారని.. ప్రహ్లాద్ కర్ణాటకకు మెట్రో తీసుకెళ్లారని.. తెలంగాణ నుంచి కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఏమీ తీసుకురాలేదని మండిపడ్డారు. తెలంగాణలో ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి కిషన్ రెడ్డి అడ్డుగా ఉన్నారన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కిషన్‌రెడ్డి ఒక్కటేనన్నారు. కులగణన సమయంలో కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్, కిషన్ రెడ్డి అందరి నివాసాలకు ప్రత్యేకంగా వెళ్లి వివరాలు స్వీకరించాలని హైదరాబాద్ కలెక్టర్‌కు ప్రత్యేకంగా సూచించినట్లు తెలిపారు.

కేసీఆర్, కేటీఆర్, కిషన్ రెడ్డి, హరీష్ రావు సర్వేలో వివరాలు పంచుకోలేదన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, ప్రాజెక్టులను అడ్డుకుంటున్నదని ఆయనేనని ఆరోపించారు. రాష్ట్రానికి ఆయన ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేదని, కేబినెట్ మంత్రిగా తెలంగాణ అంశాలపై తనతో కిషన్‌రెడ్డి ఒక్క రివ్యూ కూడా జరపలేదన్నారు. మెట్రో విస్తరణ కేటీఆర్‌కు ఇష్టం లేదని,కెటిఆర్ సూచనతోనే మెట్రోను కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఫెయిల్ అయ్యారని విమర్శించారు.అసెంబ్లీ రౌడీ సినిమాలో బాషా గ్యాంగ్ మాదిరిగా బీఆర్ఎస్ నేతల పంచాయతీ ఉందని విమర్శించారు. తెలంగాణ మంత్రివర్గం విస్తరణలో సామాజిక న్యాయం పాటించామని.. 55 శాతం మేరకు ఇప్పటికే పదవులు కేయించామన్నారు. నక్సలిజానికి అంతం ఉండదని.. సామాజిక అసమానతలు ఉన్నంత వరకు నక్సలిజం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మీడియా దృష్టిని తమవైపు తిప్పుకునేందుకు బీఆర్ఎస్ నేతలు డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. మూడు రోజులు ఢిల్లీ పర్యటనలో బిజీగా గడిపిన సీఎం రేవంత్‌రెడ్డి, తిరిగి బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనను జనంలోకి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్రంలో రెండు బహిరంగసభలు నిర్వహించాలని ముఖ్యమంత్రి అధిష్ఠానానికి వివరించినట్లు సమాచారం. ఈ సభలకు రావాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీకి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన తేదీలు ఖరారు చేయాలని కోరినట్లు సమాచారం. మోదీ 11 ఏళ్ల పాలన వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌కు అధిష్ఠానం ఆదేశించింది. ఇందుకు సంబంధించిన తీసుకోవాల్సి న కార్యాచరణపై దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. అలాగే కేసీ వేణుగోపాల్‌తోనూ సీఎం చర్చించారు.

## అట్టుడుకుతున్న లాస్ ఏంజెల్స్

>> "ఇన్‌సరెక్షన్ యాక్ట్"ను ప్రయోగిస్తానని మంగళవారం హెచ్చరించారు. లాస్‌ఏంజెలెస్‌ను విముక్తి చేయడం తన లక్ష్యమని అన్నారు. అమెరికాలో నేషనల్ గార్డ్ దళాలు రాష్ట్ర, సమాఖ్య ప్రభుత్వాల ఉమ్మడి పరిధిలోకి వస్తాయి. గవర్నర్ అనుమతి లేకుండా, ఆయన అధికారాలను అధిగమించి నేషనల్ గార్డ్ దళాలను మోహరించినందుకు అధ్యక్షుడు ట్రంప్‌పై దావా వేయడానికి కాలిఫోర్నియా సిద్ధమవుతోంది. శాంతిభద్రతల పరిరక్షణకు కాలిఫోర్నియా స్థానిక బలగాలు సరిపోతాయని గవర్నర్ న్యూసమ్ నొక్కిచెప్పినప్పటికీ, ఏదైనా రాష్ట్రంలో దండయాత్ర జరిగినా లేదా అలాంటి భయం ఉన్నా "అధ్యక్షుడు సాధారణ దళాలతో అమెరికా చట్టాలను అమలు చేయలేని పక్షంలో" నేషనల్ గార్డ్ దళాలను మోహరించడానికి వీలు కల్పించే ఫెడరల్ చట్టంలోని మూడు నిర్దిష్ట నిబంధనలను ట్రంప్ ఉటంకించారు.

**పరిసర నగరాలకుసైతం వ్యాపిస్తున్న ఆందోళనలు**

అమెరికాలో ఫెడరల్ ప్రభుత్వం చేపట్టిన ఇమ్మిగ్రేషన్ దాడులు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. లాస్ ఏంజిల్స్‌లో మొదలైన నిరసనలు ఇప్పుడు దేశవ్యాప్తంగా పలు నగరాలకు వేగంగా విస్తరిస్తున్నాయి. ట్రంప్ పరిపాలన అనుసరిస్తున్న కఠిన వలసదారుల బహిష్కరణ వ్యూహమే ఈ ఆందోళనలకు కారణమని తెలుస్తోంది. పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు కాలిఫోర్నియాలో నేషనల్ గార్డ్‌ను మోహరించడం వివాదాస్పదంగా మారింది. ఈ నెల 6న ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు లాస్ ఏంజిల్స్‌లోని పలు ప్రాంతాల్లో అక్రమ వలసదారులుగా అనుమానిస్తున్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా నిరసనలు మిన్నంటాయి. తొలుత లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని ఐదు బ్లాకుల ప్రాంతంలో శాంతియుతంగా ప్రారంభమైన ప్రదర్శనలు, అనతికాలంలోనే హింసాత్మకంగా మారాయి. నిరసనకారులకు, లాస్ ఏంజిల్స్ పోలీస్ డిపార్ట్‌మెంట్, ఐసీఈ అధికారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈనెల 7 నాటికి ఈ ఆందోళనలు సమీప నగరాలైన పారామౌంట్, కాంప్టన్‌లకు కూడా వ్యాపించాయి. నిరసనకారులు పెద్ద ఎత్తున గుమిగూడి ట్రాఫిక్‌ను అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో స్థానిక అధికారులు దీనిని చట్టవిరుద్ధమైన సమావేశంగా ప్రకటించి, నిరసనకారులను తక్షణమే అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు.

పెరుగుతున్న అశాంతిని అదుపులోకి తెచ్చేందుకు, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాలిఫోర్నియా నేషనల్ గార్డ్‌ను ఫెడరల్ నియంత్రణలోకి తీసుకున్నారు. సుమారు 2,000 మంది సైనికులను, అందులో 700 మంది మెరైన్లను కూడా శాంతిభద్రతల పరిరక్షణ కోసం లాస్ ఏంజిల్స్ ప్రాంతానికి తరలించారు.అయితే, ట్రంప్ చర్యను కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్య అని, సైన్యాన్ని ఉపయోగించడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతుందని ఆయన హెచ్చరించారు.



మాజీ లోక్‌సభ స్పీకర్ కె.ఎస్. హెగ్డే జయంతి సందర్భంగా బుధవారం పార్లమెంట్ హౌస్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

## అన్ని అనుమతులతోనే 'కాళేశ్వరం'

>> నిర్మించినవి అని కేసీఆర్ సమాధానమిచ్చారు. కాళేశ్వరం రీఇంజినీరింగ్ గురించి కెసిఆర్ వివరించారు. క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసి వారి నిర్ణయం మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిపాదనలకు అంకురార్పణ చేశామని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం తుమ్మడిహట్టి వద్ద 148 అడుగుల ఎత్తుకు మించి ఆనకట్ట నిర్మాణంకు అనుమతించమని నిరాకరించడం, అదే సమయంలో సిడబ్ల్యుసి కూడా అక్కడ నీటి లభ్యత లేదనితేల్చడంతో వెనుకడుగు వేయాల్సి వచ్చిందని వివరించారు. ప్రాజెక్టు స్థలమార్పు ప్రతిపాదన ఎందుకు మార్చాల్సి వచ్చిందో కెసిఆర్ సుదీర్ఘంగా వివరించారు. సిడబ్ల్యుసి తుమ్మిడి హట్టి వద్ద నీటి లభ్యత లేదని చెప్పిందని,వ్యాప్కోస్ సర్వే చేసి నివేదిక ఇచ్చిందన్నారు. టెక్నికల్ టీం మూడు బ్యారేజీలు నిర్మించాలని చెప్పిందన్నారు. ఆనకట్టల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం ఉందా అని కమిషన్ ప్రశ్నించింది.తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించలేదని దీనితో టెక్నికల్ టీం ఇచ్చిన నివేదికపై క్యాబినెట్ సబ్‌కమిటి కూడా ప్రత్యామ్నాయ ప్రాంతాలను ఎంపికకోసం స్టడీచేసి లోకేషన్ మార్పు సిఫార్సు చేశారని దీనితో క్యాబినెట్ అనుమతి తీసుకొన్నామని వివరించారు. నిర్ణయాలన్నీ కేబినెట్ ఆమోదంతోనే జరిగాయని కేసీఆర్ చెప్పారు. క్యాబినెట్, ప్రభుత్వ ఆమోదంతోనే ఆనకట్టల నిర్మాణం జరిగిందని కెసిఆర్ బదులిచ్చారు. వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారమే నిర్మాణం జరిగిందనీ,అన్ని అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అన్ని అంశాలతో ఉన్న పుస్తకాన్ని కమిషను అందజేశారు.కాళేశ్వరం కార్పొరేషన్ గురించి కమిషన్ ఆరా తీసింది. కొత్త రాష్ట్రంలో నిధులను దృష్టిలో ఉంచుకొని కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు కెసిఆర్ తెలిపారు. ప్రాజెక్టు వేగంగా పూర్తి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. బ్యారేజీల్లో నీటి నిల్వ గురించి కేసీఆర్ను కమిషన్ అడిగింది. బ్యారేజీల నిర్మాణ స్థలం ఎంపిక, మార్పు సాంకేతికపరమైన అంశమన్నారు. నీటి లభ్యత దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. జీవో నంబర్ 45ను, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ బుకోను కమిషన్‌కు అందజేశారు.

## కొత్త మంత్రులకు శాఖలు

>> సీఎం తన వద్ద ఉన్న శాఖలు కార్మిక, సంక్షేమ,మైనింగ్, పశుసంవర్ధక శాఖలు నూతన మంత్రులకు కేటాయించారు. ఈ నెల 8న ముగ్గురు కొత్త మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించిన విషయం తెలిసిందే. రెండు,మూడు రోజులుగా ఢిల్లీలోనే ఉన్న సిఎం ఎ.రేవంత్‌రెడ్డి కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై అధిష్టానంతో చర్చలు చేసిన మీడియాతో చిట్ చాట్ చేస్తూ తన దగ్గర ఉన్న శాఖలనే కొత్త మంత్రులకు కేటాయిస్తానని, కొత్త మంత్రుల శాఖలపై సిఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. పాత మంత్రుల శాఖలను మార్పు చేసే అవకాశం లేదన్నారు. తన వద్ద ఉన్న హోం, మున్సిపల్, క్రీడలు, విద్య తో పాటు 11 శాఖలలోని కొన్నింటికి కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మంత్రులకు కేటాయిస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో కొన్ని నెలల వరకు మంత్రి పదవులు ఇవ్వలేదని, ఇచ్చినప్పటికీ శాఖలను కేటాయించలేదన్నారు. తమ ప్రభుత్వం రాగానే మంత్రివర్గం ఏర్పడినప్పుడు రెండు మూడు రోజులకే శాఖలను కేటాయించినట్లు చెప్పారు. కొత్త మంత్రులకు హైదరాబాద్‌కు వచ్చాక అందరితో సంప్రదించి శాఖలు నిర్ణయిస్తామని సీఎం రేవంత్ వివరించారు. అలా చెప్పిన మేరకు సిఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 5 గంటలకు ఢిల్లీ నుంచి రాగానే శాఖల కేటాయింపునకు ముందు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును తన వద్దకు పిలిపించుకుని సమావేశమయ్యారు. ఎవరికి ఏ శాఖలు కేటాయించాలనే విషయంపై చర్చించారు. అనంతరం శాఖల కేటాయింపు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కీలకమైన హోం,విద్య,మున్సిపల్ శాఖలు సిఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నాయి. కాగా, నూతన మంత్రులకు శాఖల కేటాయింపు ఇలా ఉంది.

**వివేక్ వెంకటస్వామి:** కార్మిక,ఉపాధికల్పన శిక్షణ,ఫ్యాక్టరీస్‌లతో పాటు భూగర్భ గనుల శాఖలను కేటాయించారు.

**అడ్లూరి లక్ష్మణ్‌కుమార్:** ఎస్సీ సంక్షేమం,గిరిజన సంక్షేమ,మైనారిటీస్ సంక్షేమ,వికలాంగులు,సీనియర్ సిటిజన్స్,ట్రాన్స్ జెండర్ల సంక్షేమం.

**వాకటి శ్రీహరి:** పశు సంవర్ధణ శాఖ, డైయిరీ అభివృద్ధి,మత్స్య శాఖ,క్రీడలు,యువజన సర్వీసుల శాఖలు

## రాష్ట్రానికి యుకె పెట్టుబడులు

>> దక్షిణ కొరియా, జపాన్ తదితర దేశాల్లో ఇంటర్న్ షిప్ చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. టీ కన్సల్ట్ సహకారంతో 2030 నాటికి 10వేల మంది యువతకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తాం అని కెన్ కూ...మంత్రి శ్రీధర్ బాబుకు వివరించారు. సానుకూలంగా స్పందించిన కెన్ కూ మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీ కన్సల్ట్ ఛైర్మన్ సందీప్ కుమార్ మక్తాలా, వరల్డ్ తెలుగు ఐటీ కౌన్సిల్ మలేషియా విభాగం ప్రెసిడెంట్ మారుతీ, ఇతర ప్రతి నిధులు మహేష్‌నటరాజ్,వాకిటిభాగ్యలక్ష్మీతదితరులు పాల్గొన్నారు.

## మంగ్లీ బర్త్‌డే పార్టీలో గంజాయి, విదేశీ మద్యం!

### దాడి చేసి కేసులు పెట్టిన పోలీసులు

**హైదరాబాద్, జూన్11, ప్రభాతవార్త:** జానపద, సినీ గాయని మంగ్లీ (సత్యవతి) బర్త్‌డే వేడుకలు రసాభాసాగా మారాయి. పోలీసులు అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహించడంతో మంగళవారం రాత్రి అర్ధరాత్రి స్థానిక పోలీసులతో కలిసి రాచకొండ ఎస్వోటీ పోలీసులు వచ్చి ఆకస్మిక దాడులు చేశారు. హైదరాబాద్ శివారులోని చేవేళ్ల సమీపం ఈర్లపల్లిలోని త్రిపుర రిసార్ట్‌లో ఆమె పెద్ద ఎత్తున వేడుకలకు ఏర్పాట్లు చేశారు. మంగ్లీ కుటుంబసభ్యులతో పాటు, సన్నిహితులు, సినీ ప్రముఖులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అర్ధరాత్రి దాటక కూడా పెద్ద సౌండ్‌బాక్సులతో డీజే, మద్యం, డ్యాన్సులతో కేకలు పెడుతుండడంతో స్థానికులు కంట్రోల్‌రూంకు సమాచారం అందించారు. ఘటనస్థలానికి వచ్చిన ఎస్వోటీ పోలీసులు తక్షణమే డీజేలను ఆపించేశారు. అనుమతులపై ఆరా తీయగా రిసార్ట్ మేనేజర్ స్పందిస్తూ ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, కార్యక్రమాన్ని తామే నిర్వహిస్తున్నట్లు సమాధానమిచ్చారని పోలీసులు పేర్కొన్నారు. దీంతో పోలీసులు వేడుకల ప్రాంగాన్ని తనిఖీ చేయడంతో అక్రమంగా విదేశీ మద్యాన్ని గుర్తించారు. ఈ క్రమంలోనే అక్కడే ఉన్న మంగ్లీని ప్రశ్నించగా అనుమతులేమి తీసుకోలేదని ఆమె పోలీసులకు తెలిపారు. వెంటనే అక్కడున్న నలభై మందికి డ్రగ్స్ పరీక్షలు చేయగా ఒక వ్యక్తి గంజాయి సేవించినట్లు తేలింది. అనుమతులు లేకుండా పార్టీ నిర్వహణ, న్యూసెన్స్ కింద సింగర్ మంగ్లీ, రిసార్ట్ మేనేజర్ రామకృష్ణ, ఈవెంట్ నిర్వాహకులు మేఘరాజ్, దామోదర్‌లపై ఆయా సెక్షన్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రేవంత్‌ను వదలం..

### కాంగ్రెస్‌ను బొంద పెడతాం: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్11:** కేసీఆర్ అంటే ఒక చరిత్ర.. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్‌ను విచారణకు పిలిచారంటే.. హనుమంతుడి ముందు కుప్పిగంతులు లాంటిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇరిగేషన్ మీద కేసీఆర్‌కు ఉన్న అవగాహన బహుషా ఈ దేశంలోని సమకాలీన రాజకీయ నాయకులలో ఎవరికి ఉండదని పేర్కొన్నారు. బుధవారం బీఆర్‌కే భవన్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. చివరకు ధర్మం, న్యాయమే గెలుస్తది. తెలంగాణను సాధించిన నాయకుడిగా, సస్యశ్యామలం చేసిన నాయకుడిగా కేసీఆర్ పేరు చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడుతది అని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి కూలగొట్టడానికి వచ్చాడు తప్ప కట్టడానికి రాలేదు. విధ్వంసకరమైన ఆలోచనలతో పేదల ఇండ్లు కూలగొట్టడం, ప్రాజెక్టులను కూలగొట్టడం.. రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు తప్ప ఈ సన్నాసికి ఏం చేతకాదు అని అర్థమైతుంది. 100 జన్మలు ఎత్తినా రేవంత్ రెడ్డి అనే చిల్లర వ్యక్తికి కేసీఆర్ గొప్పతనం అర్థం కాదు. రేవంత్ రెడ్డి గురువు, ఆయన జేజమ్మతో గొడవ పడి ఇక్కడ నుండి తరిమిన వాడే కేసీఆర్. రేవంత్ రెడ్డి అనే చిల్లరవ్యక్తి ఏం చేసినా, ఆయన ప్రభుత్వం ఏం చేసినా కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేడు. రేవంత్ రెడ్డిని వదిలిపెట్టం.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేదాకా వెంటాడుతాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఈ చిల్లర రాజకీయాలను పట్టించుకోవద్దని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉండాలి. రేవంత్ రెడ్డిని ప్రజాక్షేత్రంలో బట్టలిప్పి నిలబెట్టే రోజులు వస్తాయి. రేవంత్ రెడ్డి లాంటి చిల్లర నాయకుడికి కేబినెట్ అంటే అర్థం కాదు.. కేబినెట్ ఎట్ల పని చేస్తదో తెలియదు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు ముఖ్యం ఆయనకు. విచారణల పేరిట రేవంత్ రాక్షసానందం పొందుతున్నారు.

## పిఎస్ఆర్‌కు మధ్యంతర బెయిలు

**విజయవాడ,జూన్11,ప్రభాతవార్తప్రతినిధి:** వివిధ కేసుల్లో విజయవాడ జైలు రిమాండ్ ఖైదీగా ఉన్న ఐపిఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులకు ఊరట లభించింది. విజయవాడ కోర్టు ఈనెల 26 వరకు వైద్యం కోసం మధ్యంతర బెయిల్ మంజూరు చేసిందిజ ప్రస్తుతం విజయవాడ జీజి హెచ్‌లో చికిత్స పీఎస్ఆర్ పొందుతున్నారు.వివిధ కేసుల్లో ఆయన రిమాండ్ ఖైదుగా ఉన్నారు.అయితే వివిధ అనారోగ్య కారణాలతో ఆయన ఇబ్బంది పడుతున్నారు. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆయన నిన్న విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయనకు ఆస్పత్రిలో ఇన్‌పెషెంట్ చికిత్స అవసరమని పీఎస్ఆర్ తరపు న్యాయవాదులు విజయవాడ కోర్టుకు వివరించారు.దాంతో పీఎస్ఆర్‌కు కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

# గ్రూప్1 నియామకాలపై స్టే ఎత్తివేయాలంటూ 4 పిటిషన్లు

## నియామకాలు ఆలస్యమైతే అభ్యర్థులు నష్టపోతారన్న టిజిపిఎస్సీ

### 30వ తేదీకి విచారణ వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్11:** రాష్ట్రంలో గ్రూప్1 నియామకాలపై స్టే ఎత్తివేయాలని కోరుతూ హైకోర్టులో 4 పిటిషన్లు దాఖలయ్యాయి. గ్రూప్1 మెయిన్స్ ఎగ్జామ్ సెంటర్ల కేటాయింపు, మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పలువురు అభ్యర్థులు గతంలో తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. కాగా గత నెలలోనే ఈ పిటిషన్లపై హైకోర్టులో వాదనలు జరిగాయి. పునర్మూల్యాంకనం చేయాలని లేదా మరోసారి ప్రధాన పరీక్ష(మెయిన్స్) నిర్వహించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరారు.అభ్యర్థులు కేవలం అపోహపడుతున్నారని, నిపుణులతో మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనం చేయించామని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గ్రూప్1 నియామకాలు ఆలస్యమైతే ఎంపికైన అభ్యర్థులు నష్టపోతారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.వాదనలు విన్న హైకోర్టు గ్రూప్1 నియామకాలపై స్టే విధించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయొచ్చని ఆదేశించింది. కాగా, టీజీపీఎస్సీ గ్రూప్1 నియామకాలపై విధించిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ గ్రూప్1కు ఎంపికైన 4 అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానంలో వేర్వేరుగా పిటిషన్లను దాఖలు చేశారు. బుధవారం విచారణ సందర్భంగా స్టే వెకెట్ పిటిషన్లపై వాదనలు జరిగాయి. కౌంటరు దాఖలు చేసేందుకు టీజీపీఎస్సీ, ఇతర న్యాయవాదులు సమయం కోరారు. విచారణను ఆలస్యం చేయొద్దని,దీని వల్ల ఎంపికైనటువంటి అభ్యర్థులకు ఇబ్బందులు ఉంటాయని హైకోర్టు తెలిపింది.వినిపించిన వాదనలే మళ్లీ వినిపించొద్దని, ఈనెల 30వతేదీన పూర్తిస్థాయి వాదనలు వింటామని హైకోర్టు స్పష్టం చేసింది.

# కాంగ్రెస్ పార్టీని చీల్చేందుకు ఎన్డీయే కుట్రలు

## ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ధ్వజం



**కాలాబురగి,జూన్ 11 :** కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా కాంగ్రెస్ పార్టీని విడగొట్టేందుకు మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం కుట్ర పన్నిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణానికి సంబంధించి బళ్లారి ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలపై ఈడీ దాడులను ఖర్గే బుధవారంనాడిక్కడ జరిగిన మీడియా సమావేశంలో ప్రస్తావించారు. ఈడీ దాడుల ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలను బీజేపీ టార్గెట్ చేసిందని, అయినప్పటికీ మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి చీలికలు తేలేదని, పార్టీ ఐక్యంగా ఉందని చెప్పారు. నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన కేవలం అబద్ధాలు, యువకులను మోసం చేయడానికే పరిమితమైందని ఖర్గే ఆరోపించారు. 11 ఏళ్లలో 33 తప్పిదాలు చేశారు. పార్లమెంటులో కూడా నేను ఇదే మాట చెప్పిన సంగతి అందరికీ తెలుసు. ఓట్ల కోసం అబద్ధాలు చెప్పడం, యువకులను మోసం చేయడం, పేదలను కడగండ్లపాలు చేస్తున్న ఇలాంటి ప్రధానికి నా రాజకీయ జీవితంలోనే చూడలేదని ఖర్గే ఘాటుగా విమర్శించారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండా ఖాళీగానే ఉంచడంపై ప్రభుత్వాన్ని ఖర్గే నిలదీశారు. ప్రధాన విపక్ష పార్టీకి ఆ పదవి దక్కాల్సి ఉందని చెప్పారు. ఆ ఖాళీని భర్తీ చేయకపోవడం చట్టవిరుద్ధమని, విపక్షాలకు చిన్న పోస్ట్ కూడా మోదీ ఇవ్వడం లేదని అన్నారు. ప్రజాస్వామ్యం పట్ల ఆయనకు నమ్మకం లేదనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మోదీకి లేఖ కూడా రాసినట్టు చెప్పారు. కర్ణాటక మహర్షి వాల్మీకి ఎస్టీ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌పై సమగ్ర దర్యాప్తు జరిగేంత వరకూ తమ పార్టీ ఎలాంటి వ్యాఖ్యలు చేయదని ఖర్గే చెప్పారు. ఈ స్కామ్‌కు ఈడీ ఎలాంటి ట్విస్ట్ ఇస్తుందో చూడాలనుకుంటున్నామని అన్నారు. నిధుల దుర్వినియోగం అంశ ఈడీకే వదిలి పెడుతున్నామని, కేసు విచారణలో తాము జోక్యం చేసుకోమని తెలిపారు. ఎన్నికల్లో ఎవరు, ఎంతెంత ఖర్చుపెట్టారో అందరికీ తెలుసునని, ఈడీ దాడులు కొత్తేమీ కాదని, ఇలాంటి దాడులతో కాంగ్రెస్ పార్టీని విడగొట్టడం మాత్రం అసాధ్యమని అన్నారు. కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ ఇప్పటికిప్పుడు లేదని ఖర్గే తెలిపారు. బెంగళూరులో ఇటీవల జరిగిన తొక్కిసలాట సహా పలు అంశాలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు మంగళవారంనాడు ఢిల్లీలో రాహుల్ సమక్షంలో చర్చించినట్టు చెప్పారు. కర్ణాటకలో మళ్లీ కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని ఖర్గే సమర్థించారు. కులగణనలో సామాజిక ఆర్థిక కోణాలను ఇప్పటికే ప్రభుత్వం పాటిస్తోందని, ఇందులో చోటుచేసుకోని మరో క్రయిటీరియాను కొత్త సర్వేలో చేర్చాల్సి ఉంటుందని చెప్పారు. బెంగళూరులో తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ సిద్ధరామయ్య రాజీనామాకు బీజేపీ డిమాండ్ చేయడంపై అడిగినప్పుడు, ఈ ఏడాది మొదట్లో కుంభమేళాలో విషాదం చోటుచేసుకుందని, సీఎం రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. తొక్కిసలాట ఊహించలేదని, దానికి క్షమా పణ చెప్పాల్సి ఉంటుందని, బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రభుత్వం అండగా నిలబడమే కాకుండా భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఖర్గే చెప్పారు.

# ఆయువకుడు తప్పు చేసాడు.. చర్యలు తప్పవు..!

## బేడీలు వేయడంపై విదేశాంగ శాఖ ఆగ్రహం

**నెవార్క(యుఎస్),జూన్ 11:** అమెరికాలోని నెవార్క్ విమానాశ్రయంలో ఇటీవల ఒకభారతీయ యువకుడి పట్ల అక్కడి భద్రతాధికారులు వ్యవహరించిన తీరుపై నెటిజన్ల విమర్శలతో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. సదరు యువకుడు నిబంధనలకు విరుద్ధంగా, సరైన వీసా లేకుండా అక్రమంగా అమెరికా వెళ్ళాడని, అతని ప్రవర్తన కూడా సరిగా లేదని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. హర్యానాకు చెందిన ఈ యువకుడి ప్రవర్తన ప్రయాణ సమయంలో ఆమోదయోగ్యంగా లేదని తెలిసింది. ఆ యువకుడు తప్పు చేశాడు. సరైన పత్రాలు లేకుండా అక్రమంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోకి ప్రవేశించాడు. అతని ఆరోగ్యం కుదుటపడిన తర్వాత, అతడిని తిరిగి భారతదేశానికి పంపించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ విషయమై అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని విదేశాంగవర్గాలు పేర్కొన్నాయి. అయితే, యువకుడు అక్రమంగా ప్రవేశించి ఉండవచ్చని అంగీకరిస్తూనే, భద్రతా సిబ్బంది అతనిపై వ్యవహరించిన తీరుపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. యువకుడిని నేలపై పడేసి, చేతులను వెనక్కి విరిచి కట్టేసిన దృశ్యాలు తీవ్ర ఆందోళన కలిగించాయి. ఇటువంటి చర్యలు ఆమోదయోగ్యం కావని భారత్ స్పష్టం చేసింది. అక్రమ వలసదారుల విషయంలో అమెరికా కఠినంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. గతంలో ట్రంప్ పరిపాలన నుంచి ఈ వైఖరి మరింత కఠినతరమైంది. అనేక మంది అక్రమ వలసదారులను, వారిలో భారతీయులతో సహా,పలువురిని స్వదేశాలకు తిప్పి పంపించారు. ఈ నేపథ్యంలో, పౌరులు సరైన పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లవద్దని భారత ప్రభుత్వం పదేపదే హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది.

# శ్రీలక్ష్మీ పిటిషన్‌పై విచారణ వాయిదా

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** ఉమ్మడి ఏపిలో సంచలనం రేపిన ఓబుళాపురం గనుల అక్రమ మైనింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మి పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ వాయిదా పడింది. ఈ కేసులో తెలంగాణ హైకోర్టు శ్రీలక్ష్మికి ఇంతకు ముందే క్లీన్ చిట్ ఇవ్వడం తెలిసిందే. అయితే దీనిపై సిబిఐ సుప్రీం కోర్టులో సవాల్ చేయడంతో ఈ కేసు విచారణను మళ్లీ చేబట్టి మూడు నెలల్లో పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టును సుప్రీం కోర్టు ఆదేశించడం విదితమే. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గత వారం ఈ కేసు విచారణ మళ్లీ మొదలుకాగా బుధవారం కూడా దీనిపై వాదనలు జరిగాయి. దీనిపై తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి హైకోర్టు వాయిదా వేయడంతో పాటు అప్పట్లోగా కౌంటర్ దాఖలు చేయాలని సిబిఐకి నోటీసులు జారీ చేసింది.

# నా పోరాటం ఇక్కడితో ఆగదు..

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర పోస్ట్

### రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వనందుకు వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసిన యువకులు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్11:** సామాజిక సమీకరణల నేపథ్యంలో కేబినెట్‌లో చోటును కోల్పోయిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర పోస్ట్ చేశారు. తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన వారికి ఎమ్మెల్యే రాజ గోపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తనకు రాజకీయాలంటే పదవులు, అధికారాలు కాదని ప్రజలకు సేవ చేయడమేనని చెప్పుకొచ్చారు. తాను మంత్రిగా లేకపోయినా ప్రజల సమస్యలు వినడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకు తీసుకెళ్లడంలో ముందుంటానన్నారు. తన రాజకీయ ప్రయాణం ఇక్కడితో ఆగదని పోస్ట్‌లో రాసుకొచ్చారు.తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని కీలకమైన నేతల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ కూడా ఉన్నారు. వీరిలో ఇప్పటికే ఒకరు మంత్రి వర్గంలో ఉండగా మరొకరు ఎమ్మెల్యేగా ఉన్నారు. గత ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన ఈయన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు ఉన్న పలుకుబడి, ప్రజాదరణతో ఎంపీ ఎన్నికల్లో పార్టీ ఇచ్చిన బాధ్యతలను విజయవంతం చేసిన ఆయన మంత్రి పదవిపై అనేక ఆశలు పెట్టుకున్నారు. కానీ సామాజిక సమీకరణల నేపథ్యంలో ఇటీవల జరిగిన కేబినెట్ విస్తరణలో ఆయనకు చోటు దక్కకపోవడంతో రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. సామాజిక సమీకరణల నేపథ్యంలో కేబినెట్‌లో చోటును కోల్పోయిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బుధవారం ఉదయం ఎక్స్ వేదికగా ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన వారికి ఎమ్మెల్యే రాజ గోపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం చేకూరాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. తనకు రాజకీయాలు అంటే పదవులు గానీ, అధికారాలు గానీ కాదని ప్రజల పట్ల తన నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల తన కలలే తనకు ప్రేరణగా నిలిచాయని అన్నారు. అదే కారణంగా తాను తిరిగి కాంగ్రెస్ పార్టీకి వచ్చానని రాసుకొచ్చారు. ఈరోజు తాను మంత్రిగా లేకపోయినా, పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతానని తెలిపారు. ప్రజల సమస్యలు వినడంలో, వారి హక్కుల కోసం పోరాడడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకు తీసుకెళ్లడంలో తాను ఎప్పటికీ ముందుంటానని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. తన రాజకీయ ప్రయాణం ఇక్కడితో ఆగదని.. కొన్నిసార్లు, పదవి లేకుండానే ప్రజల మధ్య పనిచేసే అవకాశం ఎంతో శక్తివంతంగా మారుతుందని.. తాను కూడా అదే మార్గాన్ని ఎంచుకున్నానని రాజగోపాల్ రెడ్డి తాను చేసిన పోస్ట్‌లో రాసుకొచ్చారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడంతో ఆయన అభిమానులు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. ఆ క్రమంలో చండూరులో ఇద్దరు యువకులు బుధవారం సాయంత్రం వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుంటే.. తాము వాటర్ ట్యాంక్ పైనుంచి దూకేస్తామంటూ యువకులు బెదిరించారు. దీంతో స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని వారిని కిందకు దింపారు.

# చట్టాన్ని ధిక్కరిస్తే కఠినంగా వ్యవహరిస్తాం

## చేవెళ్లలో సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో గంజాయి సేవనంపై టి.పోలీసు ట్విట్

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** సైబరాబాద్‌లోని చేవెళ్లలో ఫోక్ సింగర్ మంగ్లీ బర్త్ డే పార్టీ సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి జరిగిన హంగామా, పోలీసుల దాడి, ఓ వ్యక్తి గంజాయి సేవించి దొరికిపోయిన ఘటనపై తెలంగాణ పోలీసు విభాగం ట్విటర్‌లో తీవ్రమైన హెచ్చరిక చేసింది. ఎంతటి వారైనా, ఎలాం టి వ్యక్తులైనా చట్టాన్ని దిక్కరించి ఇష్టానుసారం వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని,లాఠీ ఝుళిపిస్తామని టి.పోలీసు విభాగం తన ఎక్స్ ఖాతాలో పేర్కొంది.ఈ సందర్భంగా మంగ్లీ బర్త్‌డే పార్టీకి సంబంధించిన ఫోటోలతోపాటు పోలీసులు దాడిచేసినసమయంలో పట్టుబడ్డ వారి ఫోటోలను షేర్ చేసింది. డ్రగ్స్ విషయంలో పోలీసులు ఏమాత్రం ఉపేక్షించబోదని హెచ్చరించింది.



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు , దెబ్బతిన్న బస్సు ముందుభాగం

# ట్రావెల్స్ బస్సు,కారు ఢీ: ముగ్గురు దుర్మరణం

**యాచారం,జూన్11, ప్రభాతవార్త :** ఎదురెదురుగా కారు ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి మాల్ సమీపంలోని ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద చోటుచేసుకుంది. యాచారం సీఐ నందీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ బాలానగర్‌కు చెందిన వాస సాయితేజ (22) మూసాపేటుకు చెందిన వాస పవన్ కుమార్ (25) రాఘవేందర్ (25) మరో నలుగురు స్నేహితులతో కలిసి వైజాగ్‌కాలనీకి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు వస్తుండగా మాల్ సమీపంలోని మైసమ్మదేవాలయం దాటి ఎస్సార్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే నాగార్జునసాగర్ వైపు వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వచ్చి కారు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వాస శివకుమార్,వాస సాయికుమార్, ఎం.సందీప్, శివకుమార్ తీవ్రగాయాలపాలైనారు. స్థానికులు వారిని చికిత్స కోసం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పుడు ఎన్టీఆర్.. ఇప్పుడు కెసిఆర్

## బిఆర్‌కె భవన్‌లో విచారణకు వెళ్లింది ఇద్దరే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్11:** కాళేశ్వరంపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను వన్ టు వన్ విచారించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. పలు కీలక వివరాలను అడిగి తెలుసుకుంది. మధ్యాహ్నం 12గంటలకు మొదలైన కేసీఆర్ విచారణ.. 51 నిమిషాల పాటు కొనసాగింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్‌కు కమిషన్ పలు కీలక ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. కారు డోరులో నిలబడి కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేశారు. నేరుగా హైదరాదాద్‌లోని బీఆర్కే భవన్ నుంచి యశోదా ఆసుపత్రిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్చించిన అనంతరం ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌కు కేసీఆర్ నేరుగా పయనమయ్యారు. కాగా కోర్టు హాల్‌లో కేవలం ముగ్గురికే అనుమతిచ్చిన కమిషన్.. మాజీమంత్రులు, ఎమ్మెల్యేలను బయటకు పంపిం చారు. కోర్టు హాల్‌లో కేవలం ముగ్గురికి మాత్రమే అను మతించింది. విచారణలో జస్టిస్ ఘోష్, కమిషన్ కార్య దర్శి మురళీధర్ కలిసి కేసీఆర్ ను ప్రశ్నించారు.బీఆర్‌కే భవన్‌లో విచారణకు హాజరైన రెండో మాజీ సీఎంగా కేసీఆర్ నిలిచారు. గతంలో జస్టిస్ శ్రీరాములు కమిషన్ ముందు దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ హాజరయ్యారు. మల్లెల బాబ్జీపై హత్యాయత్నం కేసులో విచారణను ఎదుర్కొన్నారు ఎన్టీఆర్ మాజీ సీఎం హోదాలో ఎన్టీఆర్ తర్వాత బిఆర్‌కె భవన్‌లో న్యాయవిచారణ ఎదుర్కొన్న రెండో సీఎంగా కేసీఆర్ నిలిచారు. మొదట ఓపెన్ కోర్టులో కేసీఆర్ బహిరంగ విచారణ జరుగుతుందని అంతా భావించినా ఆరోగ్యరీత్యా వన్ టు వన్ విచారణ కోరారు కేసీఆర్. ఆయన విజ్ఞప్తిని అంగీకరించిన జస్టిస్ ఘోష్ కమిషన్ కేసీఆర్‌తో పాటు లోపలికి 9 మందికి అనుమతించింది. అయితే, చివరగా హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, పద్మా రావు గౌడ్, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్రలకు లోపలికి అనుమతించారు. మొత్తానికి కాళేశ్వరం కమిషన్ విచారణలో చివరి ఘట్టం ముగిసినట్లు కనిపిస్తోంది. ఇప్పటి వరకు 114 మందిని విచారించిన కమిషన్ 115వ వ్యక్తిగా కెసిఆర్‌ను ప్రశ్నించింది. ఇప్పటికే హరీశ్‌రావు,ఈటలను విచారించిన కమిషన్ కెసిఆర్‌ను కూడా విచారించడంతో జస్టిస్ ఘోష్ కమిషన్ టాస్క్ కంప్లీట్ అయినట్లు తెలుస్తోంది. జూలై నెలాఖరుతో గడువు ముగుస్తుండటంతో ఇక కమిషన్ తుది నివేదిక ఇచ్చే అవకాశం ఉంది.

# పుట్టినరోజున 78కిలోల కేక్‌ను కట్‌చేసిన ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్‌యాదవ్



**పాట్నా,జూన్ 11:** బీహార్ మాజీ సీఎం, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ బుధవారం తన 78వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. పాట్నాలోని నివాసంలో 78 కిలోల భారీ లడ్డూ కేక్‌ను పొడవైన కత్తితో కట్ చేశారు. ఆయన అనుచరులు, పార్టీ నేతలు ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 'లాలూ యాదవ్ జిందాబాద్' అని నినాదాలు చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కాగా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా లాలూ ప్రసాద్ యాదవ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తమ ఇద్దరి మధ్య సంబంధం రాజకీయాలకు అతీతమని అన్నారు. 'బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ జీకి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. మా మధ్య బంధం ఎప్పుడూ రాజకీయాలకే పరిమితం కాలేదు. ఇది ఉమ్మడి విలువలు, సామాజిక న్యాయం కోసం పోరాటంలో పాతుకుపోయిన లోతైన మానవ సంబంధం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

**తేజ్‌ప్రతాప్ వినూత్న శుభాకాంక్షలు**

బహిష్కరణవేటుకు గురయిన లాలూ పెద్దకుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు వినూత్నంగా బర్త్ డే విషెష్ చెప్పారు. లాలూ యాదవ్ స్కెచ్ చిత్రాన్ని కౌగిలించుకున్న ఫొటోను ఆయన షేర్ చేశారు. 'రాత్రి చీకటిగా ఉంటే, ఉదయం దగ్గరగా ఉంటుంది' అని పేర్కొన్నారు. తేజ్ ప్రతాప్ యాదవ్ మే 25న సంచలన విషయాన్ని బయటపెట్టారు. ఒక మహిళతో 12 ఏళ్లుగా రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ దీనిపై సీరియస్‌గా స్పందించారు. తేజ్ ప్రతాప్ యాదవ్‌ను ఆరేళ్ల పాటు ఆర్జేడీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. అలాగే తన పెద్ద కుమారుడిని కుటుంబం నుంచి కూడా వెలివేసినట్లు వెల్లడించారు. 'అతడితో సన్నిహితంగా ఉండాలనుకునే వారు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవచ్చు. నేను ఎల్లప్పుడూ ప్రజా జీవితంలో మర్యాదను సమర్థించాను. కుటుంబ విధేయులైన సభ్యులు దీనిని అనుసరించారు' అని ఆరోజు ఎక్స్‌లో పేర్కొన్నారు.

# కెసిఆర్‌తో కల్వకుంట్ల కవిత భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్11:** లేఖ వివాదం తర్వాత మొదటి సారి ఎమ్మెల్సీ కవిత ఆమె భర్తతో కలిసి కేసీఆర్‌ను కలిశారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కువెళ్లి బుధవారంఉదయం తండ్రి కేసీఆర్‌తో కవిత భేటీ అయ్యారు. హరీశ్‌రావు కూడా మంగళవారంనుంచి ఫాంహౌస్‌లోనే ఉన్నారు. కేసీఆర్ కాళేశ్వరం విచారణకు బయలు దేరే ముందు కవిత, కేసీఆర్‌ల భేటీ చర్చనీయాంశంగా మారింది.కాగా తండ్రి కేసీఆర్‌ని చూసి ఆమె భావోద్వేకానికి గురయ్యారు. కేసీఆర్‌తో కలిసి భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్‌కు కవిత, హరీశ్ లు హైదరాబాద్‌బయలుదేరారు.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కేటీఆర్ కొడుకు హిమాన్షు కూడా ఫాంహౌస్‌కు చేరుకుని తిరిగి కెసిఆర్‌తోపాటు హైదరాబాద్‌కు వచ్చారు.



యశోదలో పల్లా రాజేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న కెసిఆర్,హరీష్‌రావు తదితరులు

# జారిపడి గాయపడ్డ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

## ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన కెసిఆర్, హరీశ్‌రావు, కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్11:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం విచారణ కమిషన్ ఎదుట హాజరయ్యేందుకు సిద్ధం కాగా, ఈ నేపథ్యంలో ఆయనను కలిసేందుకు బుధవారం ఉదయం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లిన ఆ పార్టీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అక్కడ ప్రమాదవశాత్తూ జారిపడ్డారు.ఈ ఘటనలో ఆయన తుంటి ఎముకకు గాయమైనట్టు తెలిసింది. వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయన్ను పరామర్శించారు. బుధవారం బీఆర్‌కే భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరయ్యారు. విచారణ ముగిసిన వెంటనే ఆయన నేరుగా యశోద ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న పల్లా రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీష్‌రావు తదితరులు ఉన్నారు. పల్లా త్వరగా కోలుకోవాలని కేసీఆర్ ఆకాంక్షించారు. కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా యశోద ఆస్పత్రికి వెళ్లి పల్లా రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించారు.

## మూడురాష్ట్రాల్లో రెండు కీలక రైల్వేప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం

# రూ.6405 కోట్లతో రైల్వే డబ్లింగ్‌ప్రాజెక్టులు



**న్యూఢిల్లీ,జూన్ 11:** దేశంలోని రైల్వేకార్గో రవాణాకు వీలుగా రెండు అత్యంత కీలకమైన ప్రాజెక్టులకు ఆర్థికవ్యవహారాల కేబినెట్‌కమిటీ ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టులకు రూ. 6405 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసారు. ఈ ప్రాజెక్టులవల్లన ఉమారు 10.8 కోట్ల పనిదినాలను కల్పించవచ్చని, నిర్మాణ కాలంలోనే ఉపాధిపెరుగుతుందని కేబినెట్ అంచనావేసింది. ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన ఈ కేబినెట్‌లో కోడెర్మా, బార్కాకానా డబ్లింగ్ ప్రాజెక్టు ఉంది. 133 కిలోమీటర్ల నిడివి ఉన్న ఈప్రాజెక్టు జార్ఖండ్‌లోని కోల్ ఉత్పత్తి ప్రాంతం మొత్తం కవర్‌చేస్తుంది. పాట్నా, రాంచీల మధ్య ప్రయాణదూరం కూడా తగ్గిస్తుంది. అలాగే బళ్లారి చిక్‌జాజూర్ డబ్లింగ్ పనులకుకూడా ఆమోదం తెలిపింది. 185 కిలోమీటర్లదూరం ఉనన ఈప్రాజెక్టు బళ్లారితో పాటు కర్ణాటకలోని చిత్రదుర్గ, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలను కలుపుతుంది. ఈ రెండుప్రాజెక్టులు జార్ఖండ్; కర్ణాటక ,ఏపిల్లోని ఏడు జిల్లాలను కవర్‌చేస్తాయి. మొత్తం 1408 గ్రామాలు 28.19 లక్షల మంది ప్రజానీకానికి ఈ రైల్వే డబ్లింగ్‌పనులప్రాజెక్టు ఎంతో లబ్ధికల్పిస్తుందని అంచనా. బొగ్గు, ముడి ఇనుము, ప్రాసెస్‌చేసిన ఉక్కు, సిమెంట్, ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తులు, పెట్రోలియం ఉత్పత్తులు వంటి వాటిరవాణాకు మరింత సులువవుతుంది. సాలీనా 49 మిలియన్ టన్నుల రవాణానుచేసే వీలు కలుగుతుంది. చమురు దిగుమతులను భారీగా తగ్గించి సిఒ2 ఉద్గారాలను కట్టడిచేసేందుకువీలుగా ఈ ప్రాజెక్టు అన్ని పర్యావరణ అనుమతులతో ప్రారంభం అవుతుంది.

## దేవాలయంలో ప్రసాదం తిన్న భక్తులకు అస్వస్థత

# ఆసుపత్రుల్లో 107 మందికి చికిత్సలు



**విరుధ్‌నగర్,(తమిళనాడు),జూన్ 11:** రాష్ట్రంలోని విరుద్‌నగర్‌జిల్లాలోని ఒక దేవాలయంలో జరిగిన అన్నదానంతో ప్రసాదం భుజించిన 107 మంది భక్తులు ఆసుపత్రి పాలయ్యారు. జిల్లాలోని కల్విమధై గ్రామంలో ఉనన కరుప్పన్నసామి దేవాలయంలో జరిగింది. భక్తులందరికీ సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేసారు. ఈనెల 6వ తేదీ వమాకుంభాభిషేకం సందర్భంగా జరిగినఅన్నదానం తిన్న భక్తులు అస్వస్థతకు లోనయ్యారు. అనేకమంది తమకు కడుపునొప్పి వాంతులు వస్తున్నాయని చెపితే మరికొందరు స్పృహతప్పి పడిపోయారు. సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మొత్తం 107 మంది రోగులు రాజాజి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. వారిలో 41 మంది పురుషులు, 55 మంది మహిళలు, 11 మంది చిన్నారులున్నారని వైద్యబృందం లీడ్ డా.శరవణన్ తెలిపారు. అందరికి యాంటి బయాటిక్స్ ఇచ్చామని, వాంతులు, విరోచనాల కట్టడికి కూడా చికిత్స అందించామని, గ్లూకోస్ డ్రిప్‌లు పెంచామన్నారు. వీరిలో ఏడుగురిని ప్రత్యేక వార్డుకు తరలించామని, అయితే వీరంతా చికిత్సకు స్పందిస్తున్నట్లు శరవణన్ తెలిపారు. ఆహారంలో కానీ లేదా అక్కడ పంపిణీచేసిన మంచినీరులోకానీ కలుషితం కావడంవల్లనే ఈసంఘటన జరిగిందని తెలిపారు. విరుద్‌నగర్ జిల్లా వైద్య అధికారులు నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు.గత ఏప్రిల్ 23వ తేదీ కూడా ఇలాంటి సంఘటన ఒకటి చోటుచేసుకుంది. 15మంది విద్యార్థులు తిరుచిరాపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో మిడ్‌డేమీల్ తిన్న తర్వాత అస్వస్థతకు లోనయ్యారు. ఈ సంఘటనలో కలుషిత ఆహారం తిన్నట్లు తేలింది. సమీపంలోని ఆసుపత్రికి తరలించి విద్యార్థులందరికి చికిత్స చేసారు.


తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం

నిట్ సం. DB/D1/Shamshabad/DMFT/ZPHS Satamrai/2025-26, తేది: 11.06.2025
రూ.55.00 లక్షలు వెల గల 01 పని: DMFT గ్రాంట్స్ క్రింద శంషాబాద్ మునిసిపాలిటీలో సాతమ్‌రాయ్ ZPHS వద్ద (4) నూతన తరగతి గదుల యొక్క నిర్మాణం మరియు నవీకరణ మరియు మరమ్మతులు. ముగింపు 23.06.2025న సా.04.30 గం. వివరాలకు https://tender.telangana.gov.in వీక్షించండి. సంప్రదించవలసిన నం: 9154299724.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (PH) వెస్ట్ సర్కిల్, హైదరాబాద్
DIPR.No.3428-PP/CL/Advt/1/2025-26, తేది: 11.06.2025

దక్షిణ మధ్య రైల్వే
Follow us on X@SCRailwayindia మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.
No. Y/C. e-Auction/HYB/2025-26. తేది : 10.06.2025
PUB0701
దక్షిణ మధ్య రైల్వే యొక్క హైదరాబాద్ డివిజన్‌లో కమర్షియల్ పబ్లిసిటీ కాంట్రాక్టులు మరియు పార్కింగ్ స్టాండ్ కాంట్రాక్టులు ఇవ్వడం.
ఇ-వేలం యొక్క షెడ్యూల్ ఈ క్రింద పొందుపరచబడినది:

| క్ర సం | కేటగిరీ | కేటలాగ్ సం | వివరాలు | వేలం తేది | వేలం ప్రారంభ సమయం | వేలం ముగింపు సమయం |
|---|---|---|---|---|---|---|
| 1. | పార్కింగ్ | HYB-MIXED-43 | 06 స్టేషన్‌ల వద్ద పార్కింగ్ లాట్స్ ఇవ్వడం సిద్దిపేట, మీర్జాపల్లి, ఫలక్‌నుమా, అల్వాల్ (అవతల వైపు) గుండ్ల పోచంపల్లి షాద్‌నగర్ మరియు అక్కనపేట రైల్వేస్టేషన్‌లు | 21.06.25 | 11:30 | 13:00 |
| 2. | ADVN-HYB-BSX-OSN-127-25-1 (స్టేషన్ ప్రాంగణంపై ప్రకటనలు (నాన్-డిజిటల్) | | బాసర, ధర్మాబాద్ మరియు ఉమ్రి రైల్వేస్టేషన్‌ల వద్ద ప్రకటన హక్కులు BSX-1132 చదరపు అడుగులు DAB-780 చదరపు అడుగులు, ఉమ్రి-584 చదరపు అడుగులు మొత్తం ఏరియా 2496 చదరపు అడుగులు | 21.06.25 | 11:30 | 13:10 |
| 3. | పే & యూజ్ టాయిలెట్స్ | -PnU-HYB-Toi-27-25-1 (పే & యూజ్ టాయిలెట్స్) | నిజామాబాద్ రైల్వేస్టేషన్ వద్ద (MUE కొన) పే & యూజ్ టాయిలెట్స్ కాంట్రాక్ట్ యొక్క ఆపరేషన్ మరియు నిర్వహణ | 21.06.25 | 11:30 | 13:20 |

A0860 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్

స్నేహం నిదానంగా వికసించేది, నెమ్మదిగా వర్ధిల్లేది. ఒకరినొకరు అర్థం చేసుకోవడం వల్ల, త్యాగం చేసుకోవడం వల్ల విస్తరించేది.

-సిసిరో

# పంచాయతీలను పాడు పెట్టొద్దు!

జాతిపిత మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశలో అడుగులు వేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పాలక పెద్దలు ఏనాటి నుంచో చెప్తున్నా ఆచరణకు వచ్చేసరికి హామీలుగానే మిగిలిపోతున్నాయి. స్వాతంత్య్రం వచ్చి దాదాపు ఏడున్నర దశాబ్దాలు దాటినా నేటికీ గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వాటి పటిష్టతే తమ ధ్యేయమని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవంగా చూస్తే గ్రామసర్పంచులకు ఒక వ్యూహం ప్రకారం ప్రాధాన్యత తగ్గిస్తున్నారు. అధికారం లేని ఉత్సవ విగ్రహాలుగా మార్చేందుకు తమవంతు కృషి చేస్తూనే ఉన్నారు. అందుకే ఒకనాడు సర్పంచులకు ఉన్న ప్రాధాన్యత నేడు కానరావడం లేదనేది వాస్తవం. ఇందుకు వారువీరు అనేదానికంటే ఎవరు అధికారంలో ఉన్నా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యంచేశారు, చేస్తున్నారని చెప్పక తప్పదు. చివరకు నిబంధనల మేరకు ఐదేళ్లకోసారి జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఏదో ఒక కారణాలతో వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారు. ఇంచార్జీలతో స్థానిక సంస్థలను నడిపేందుకే మొగ్గుచూపిస్తున్నారు. మరొకపక్క గ్రామస్థాయిలో ఎన్నో కమిటీలు పెట్టి సర్పంచులను పక్కకు పెట్టారు. వారి ప్రమేయం లేకుండా వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితులు తీసుకువచ్చారు. విద్యాకమిటీలు, ఆస్పత్రి కమిటీలు, నీటి సంఘాలు, వనరక్షణ సమతులు ఒక్కటేమిటి గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రతినిధులకు సమాంతరంగా పదవులు సృష్టించారు. ఆంధ్రప్రదేశ్‌లో అయితే గత ప్రభుత్వం వలంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టి సర్పంచులను ఉత్సవవిగ్రహాలుగా మార్చింది. ఇలాంటి చర్యలతో ఉన్న ప్రాధాన్యత కూడా లేకుండా పోయింది. నేతల వాగ్దానాలతో ఏదో సాధించాలని, సమాజానికి ఏదోచేయాలని తపనతో ఎందరో యువకులు ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నో వ్యయప్రయాసలకులోనై సర్పంచులయ్యారు. గ్రామాభివృద్ధికి తాము చేసిన వాగ్దానాలను నెరవేర్చుకునేందుకు నడుం కట్టారు. ఈ చట్టాల వలలో కొందరు అధికారుల మాయాజాలంలో తాము ఏమీ చేయలేమనే విషయం అర్థంకావడానికి వారికి చాలా కాలం పట్టింది. అయితే తమ గ్రామ ప్రజలకు తాము చేసిన వాగ్దానాలను పూర్తి చేసేందుకు తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి కొన్ని గ్రామాల్లో పనులు పూర్తిచేశారు. అయితే ఎంతకూ బిల్లులు రాకపోవడం, ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి, ఇంకొకపక్క అప్పులు, వడ్డీలు పెరిగి, మరొకపక్క సమాజంలో తలవంచుకోలేక డజన్ మందికిపైగా సర్పంచులు తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరెందరో సర్పంచులు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. ఇప్పుడు తెలంగాణలో వారంతా మాజీలైపోయారు. గత యేడాది జనవరి 31తేదీతో వారి పదవీకాలం పూర్తయిపోయింది. గత యేడాది ఫిబ్రవరి నుంచి వారు మాజీ సర్పంచులే. ప్రత్యేక అధికారులను నియమించారు. ఆగమేఘాల మీద వారివద్ద నుంచి రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు. అయితే బిల్లులు వస్తాయో రావో తెలియదు. వస్తే ఎప్పుడు వస్తాయోచెప్పేవారు లేరు. ఇప్పటికీ వారి పరిస్థితి అగమ్యగోచరంగానే ఉంది. మరొకపక్క ఎన్నికలు నిర్వహించనిదే కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆర్థికసహాయం అందుకునే అవకాశం లేకుండాపోయింది. గ్రామాల్లో పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులంటే ఎంతో గౌరవ మర్యాదలు ఉండేవి. భారతదేశంలో స్థానిక సంస్థలకు సుదీర్ఘచరిత్ర ఉంది. చంద్రగుప్తుడి కంటే ముందు గ్రామాల్లో గ్రామవ్యవస్థ అమలులో ఉన్నట్లు ఆధారాలున్నాయి. గ్రామసభల నిర్ణయమే కీలకం. వాటి నిర్ణయాలకుఆనాటి రాజరికపువ్యవస్థ ఎంతో ప్రాధాన్యత ఇచ్చేది. ప్రాచీన కాలం నుండి గ్రామవ్యవస్థ ఏదోఒక రూపంలో మనదేశంలో కొనసాగుతూనే ఉన్నది. 1882లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్‌రిప్పన్ స్థానిక సంస్థలకు ప్రతిపత్తి కల్పించారు. గాంధీమహాత్ముడు ప్రవచించిన గ్రామస్వరాజ్యం లక్ష్యంలో స్థానికసంస్థల పటిష్టత అన్నది ఒక ముఖ్యాంశం. భారత రాజ్యాంగంలో కూడా స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు ఇవ్వడానికి ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని స్పష్టంగా సూచించారు. 1952 నుంచి ఎన్నో కమిటీలు, మరెన్నో అధ్యయనాలు, మార్పులు, చేర్పులు, పంచాయతీ వ్యవస్థలో చేశారు. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వడానికి మాత్రం పాలకపెద్దలకు మనసు ఒప్పడం లేదు. రాను రాను పంచాయతీరాజ్ వ్యవస్థను నామమాత్రంగా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజాస్వామ్యపద్ధతిలో ప్రజలతో ఎన్నికైన సర్పంచును సస్పెండ్ చేసే అధికారం అధికారులకు కట్టబెట్టిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎన్నో మార్పులు, చేర్పులు చేసుకున్నా, ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎందరు నేతలు మారినా, అధికార వికేంద్రీకరణ మాత్రం ఆదినుంచి అధికారంలో ఉన్నపెద్దలు జాగ్రత్త పడుతూనే ఉన్నారు. ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది వంటిది. అందులో సర్పంచులు చాలా కీలకం. రాష్ట్రానికిమరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు కేకలుపెడుతున్న నాయకులకు, స్థానికసంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అంటూ పదేపదే వల్లించే నేతలు తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులతో కాలం గడపడం ఏమాత్రం సమంజసం కాదు.

“ డబ్బు సంపాదనలో విజయం సాధించినంత మాత్రాన జీవితంలో నిజమైన విజయం సాధించినట్లు కాదు.



అరిస్టాటిల్

“ కలకాలం నిలిచిపోయే పనులు చేయడంలో ఖర్చు అయిన జీవితమే చాలా ఉపయోగకరమైన జీవితం.



విలియం జేమ్స్

# ప్రజావాక్కు



## తల్లిదండ్రులను గౌరవించండి

తమ జీవితాంతం పిల్లల కోసం బతికిన తల్లిదండ్రులను చివరకు వృద్ధాశ్రమంలో, రోడ్లపైనా వదిలేస్తున్నారు కొందరు. తల్లిగా ప్రేమను పంచిన అమ్మ, కష్టపడి సంపాదించి చదువు చెప్పించి బిడ్డలఉన్నతికి కారణమైన తండ్రి, రోడుపై, వృద్ధాశ్రమంలో జీవిత చరమాంకంలో ఒంటరిగా, అనాథలా కాలం గడపాల్సివస్తుంది. అదెంత బాధాకరం అనే విషయాన్ని పిల్లలు తెలుసుకోవాలి. రేపు తమ బిడ్డలు కూడా అలాగే చేస్తే అని ఒక్కసారి ఊహించుకుంటే ఇంకెప్పుడు అలాంటి తప్పుచేయరు. పిల్లలు వృద్ధ తల్లిదండ్రులకు అండగా ఉంటే సమాజం సంతోషకరంగా మారుతుంది. కాబట్టి తల్లిదండ్రులను గౌరవించండి.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

## పోలీసుల నిఘా అవసరం

నేడు సామాజికమాధ్యమాల్లో వస్తున్నకొన్నికొన్ని పోస్టుల్ని చూస్తూంటే మనం మన భారతదేశంలోనే ఉన్నామా? అనే సందేహం కలుగుతోంది. ముఖ్యంగా, పెహల్గాంలో హిందూ పర్యాటకులపై పాక్ ఐ.ఎస్.ఐ., ఎల్.ఇ. టి.లు కలిసి చేసిన దారుణమారణహోమాన్ని సమర్ధించేలా, తదుపరి భారతప్రభుత్వం పాకిస్థాన్ పై తీసుకుంటున్న చర్యల్నీ, సైన్యం సాగిస్తున్న ఉగ్రవాదుల నిర్మూలననీ విమర్శించేలా కొందరు పెడుతున్న పోస్టులు చూస్తూంటే పై సందేహం కలుగుతోంది. మనదేశంలో మతం ముసుగులో తిష్టవేసుకుపోయిన పాక్‌అనుకూల శక్తుల ఉన్మాదానికి వాళ్లు సాగిస్తున్న దేశద్రోహ కార్యకలాపాల కూ ఇవి నిలువెత్తు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. సానుభూతిపరులైన కొందరి వ్యాఖ్యల్ని ఉదాహరిస్తూవంటి పోస్టుల్ని చూస్తూంటే దేశంలో సామాజిక మాధ్యమాలపై పోలీస్ నిఘా అనేది ఉందా? లేదా?

- వీరుభొట్ల పేరయ్యశాస్త్రి, విజయవాడ

## అభివృద్ధికి దూరం చేయడం తగదు

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజలందరిని సమానంగా చూడమని రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామపంచాయతీ అధికారులను హెచ్చరించాలి. కక్షలు గత ప్రభుత్వం నాటిన చెట్లు, మొక్కలపై కూడా చూపిస్తున్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తన, మన అనే భేదం లేకుండా ఆలోచించాలి.

- పి. మల్లికార్జున్, గద్వాల్ జిల్లా

## ప్రమోషన్స్ ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ట్రాన్స్ఫర్లు చేయాలని ఒక చట్టం రూపొందించింది. అన్ని డిపార్ట్మెంట్లకు ప్రమోషన్ వస్తున్నాయి. కానీ టీచర్లకు ప్రమోషన్లు ఒక కలగానే మిగిలిపోతూ ఉన్నది. ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఉండడం వలన సీనియారిటీకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. సెకండరీ టీచర్లు డైట్ కాలేజీ లెక్చరర్‌గా, ఉన్నతపాఠశాల హెడ్మాస్టర్లుగా ప్రమోషన్‌లో తమకు కొంత శాతం ఇవ్వాలని అప్పిల్‌చేశారు. డ్రిల్‌మాస్టర్లు కూడా ఏకంగా డిగ్రీకాలేజీల పీడీలుగా ప్రమోషన్లు ఇమ్మని అడుగుతున్నారు. ఎవరికి తోచిన అప్పిల్ వారు చేస్తున్నారు. ప్రమోషన్లు 70శాతం డైరెక్టర్ రిక్రూట్మెంట్ 30శాతం అనేది ఎప్పటినుండో ఉన్న నిబంధన. ప్రమోషన్లు ఇచ్చిన తర్వాతే డైరెక్టర్ రిక్రూట్మెంట్ చేయాలి.

-వి. భాస్కర్ రావు, విజయనగరం జిల్లా

## వాగ్దానాలు చేయడం మానుకోవాలి

ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ 1995 లో పదవీ విరమణ చేసిన వారికి 2014 నుండి కదలని వెయ్యి రూపాయల పెన్షన్ను మే నెల నుండి కేంద్ర ప్రభుత్వం పెంచేసిందని తప్పుడు వార్తలు గూగుల్ న్యూస్ నుండి ప్రతీరోజు ప్రధాని మోడి, ఫైనాన్స్ మినిష్టరు నిర్మలా సీతారామన్ గారి ఫోటోలతో వస్తున్నాయి. పెన్షను కూడా 3000, 7000, 7500, 8000, 9000 వరకు పెంచారని రకరకాల అవాస్తవ సమాచారాన్ని ప్రసారం చేస్తున్నది. ఇదంతా వట్టి బూటికమని ఈ పెన్షన్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంతో నిత్యం సంప్రదిస్తున్న నేషనల్ ఏజిటేషన్ కమిటి నాయకులు విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇటువంటి అబద్ధపు వార్తలను కేంద్రం నిషేధించలేకపోవడం ఏమిటో అర్థం కాదు.

-ఆర్. కృష్ణమూర్తి, హైదరాబాద్

## ఎన్ఐసిని అనుసంధించాలి

సెంట్రల్ గోవ్స్ హెల్త్ సిస్టమ్ లబ్ధిదారుల అన్ని ప్రయోజనాల కోసం ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌పై అమలు చేయబడుతోంది. చాలా రోజుల నుండి వ్యవస్థ ఎన్ఐసితో అనుసంధానించబడింది. రోగులకు చికిత్స చేసేటప్పుడు కొన్ని రోజులలో ఈ సమస్య ఉన్నప్పటికీ, ఇదిఎక్కువ కాలం అడ్డంకిని సృష్టించలేదు. ఇటీవల కొత్త సాఫ్ట్‌వేర్ బదులుగా ఎన్ఐసిని అనుసంధానించినట్లు కనిపిస్తుంది. లబ్ధిదారులు టోకెన్లను పొందలేకపోతున్నారు. దాని ఫాలోఅప్ పని ఆగిపోయింది.

-బొల్లోజు మేఘనధమ్, విశాఖపట్నం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# మద్దతు ధర పెంపుతో రైతు రాజు అయ్యేనా?

**కౌలు రైతులకు కేరళ రాష్ట్రం తరహాలో గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వ పథకాలను వారికి వర్తింపజేయడం, క్షేత్రస్థాయిలో పంటలు పండించే రైతులకు రైతు భరోసాను అందజేయడం, సమగ్రమైన విత్తన చట్టాన్ని రూపొందించి నాణ్యమైన విత్తనాలను సరసమైన ధరలకు అందించడం, ప్రైవేటు యాజమాన్యాలు అమ్మేటువంటి కల్తీ విత్తనాలను పకడ్బందీగా నిరోధించడం, సరసమైన ధరలకు సరిపడా ఎరువులను అందించడం, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ప్రకారం రైతులకు రుణసౌకర్యం కల్పించి, సకాలంలో పండించిన పంటలను కొనుగోలు చేయడం లాంటి సౌకర్యాలు కల్పించినప్పుడే రైతుల సంక్షేమం గురించి పట్టించుకున్నట్లు అవుతుంది. కానీ సమస్యలను తీర్చకుండా నూతనంగా కొత్తవి కల్పిస్తూ, రైతును రాజు చేస్తామనడం, రైతే దేశానికి వెన్నుముక అనిమాటలు చెప్పడం, ఆరుగాలం శ్రమించి మట్టి నుండి బువ్వను తీసే అమాయకపు రైతులను మోసం చేయడమే అవుతుంది. పంటలను పండించిన ఏఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోకుండా కాపాడగలిగినప్పుడే రైతులను రాజులుగా చేసినట్టు అవుతుంది. ఆ రోజు కోసం వేచిచూద్దాం.**



తండా సదానందం

తొలకరితొంగి చూసింది. రైతన్నలు ఏరువాక సాగేసమయం ముంచుకొచ్చింది. కానీ రబీ సాగులో పండిన ధాన్యాన్ని కల్లాలలో పోసుకొని, కొనుగోలు కోసం, కాంట ఎప్పుడుపెడతారని కనులు కాయలు కాసేలా ఎదురు చూస్తూ, అకాల వర్షాలకు ధాన్యం కొట్టుకుపోతుంటే తడిసి ముద్దవుతూ రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పుల పాలై పండించిన పంటను వరుణుడు వరద రూపంలో తీసుకెళుతుంటే అష్టకష్టాలు పడుతూ కాపాడలేక తల్లడిల్లుతున్న రైతాంగం, ఆఫీసర్ల కాళ్లు పట్టుకొని బ్రతిమాలుతున్న దైన్యస్థితిలో రైతులు ఉండటం బాధాకరం. ఎద్దేడిచిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం మనుగడ సాగించలేవంటారు పెద్దలు. రబీలో పండిన ధాన్యం కల్లాల నుండి ఖాళీకాకముందే ముందస్తుగా నైరుతి రుతుపవనాలు ప్రవేశించడం, తొలకరి జల్లులు కురవడంతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాల్సిన రైతులు ఆందోళనతో అయోమయంలో ఉన్నారు. యాసంగి పంట కల్లాలలో ఉన్న ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయకుండా తాత్సరం చేయడం, ఏప్రిల్ నెలలో కురిసిన వర్షాలుముందస్తుగా ప్రవేశించిన వర్షాలు కూడా తోడవడంతో ధాన్యాన్ని అమ్మడానికి పెట్టిన రైతులకు కన్నీరే మిగిలింది. వరుసగా కురుస్తున్న వర్షాలతో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకోవడం ఇబ్బందిగా మారింది. తడిసిన ధాన్యం రంగు మారుతుంది, మొలకెత్తుతుంది. తడిసిన ధాన్యాన్ని కొంటున్నను తరుగు బాగా తీయడంతో తీవ్రనష్టం వాటిల్లుతుందని, అప్పు చేసి పంటను పండిస్తే పెట్టిన పెట్టుబడుల్లో పావు వంతు కూడా మిగలడం లేదు అంటూ రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. ఈసీజన్లో ఒక్కో రైతుకు ఎకరానికి 20వేల నుండి 25 వేల వరకు నష్టం వాటిల్లుతుందని దుఃఖిస్తున్నారు. ఇదిలా ఉండగా మూలిగే నక్కపై తాటి పండుపడ్డ చందంగా కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి మద్దతు ధరలను ప్రకటించింది. ఈ మద్దతు ధరలు వాస్తవ గణాంకాలను కప్పిపుచ్చి తప్పుదారి పట్టించేలా వ్యవసాయ రంగానికి, రైతాంగానికి ద్రోహం చేసేలా ఉన్నాయని నిపుణులు, రైతు సంఘాల వారు అభిప్రాయపడుతున్నారు. 14 పంటలలో9 పంటలకు కనీస మద్దతుధర అతి తక్కువగా నిర్ణయించారు. కేంద్ర మంత్రివర్గం ఆయా పంటల కనీస మద్దతు ధర కోసం 2.7 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది. జొన్నలకి క్వింటాలుకు రూ. 328. సజ్జలు క్వింటాలకు 150, రాగులు క్వింటాలకు రూ.596. మొక్కజొన్న క్వింటాల్కు రూ.175, కందిపప్పు క్వింటాల్కు రూ.450, పెసర్లకురూ. 86 రూపాయలు, మినుములు క్వింటాల్కు 400 ,వేరుశనగ క్వింటాలకు 480, పొద్దుతిరుగుడు క్వింటాల్కు 441, కుసుమలు క్వింటాలకు 579, పత్తి క్వింటాల్‌కు 589 పెంచినట్లు చెప్పారు. ప్రతిఏటా ప్రకటించే కనీస మద్దతు ధరలు శాస్త్రీయంగా లెక్కకట్టకుండా భిక్షం వేసినట్లు ఎంతో కొంత పెంచడం రైతుల పట్ల వ్యవసాయ రంగం పట్లపాలకుల అశ్రద్ధ స్పష్టంగా కనబడుతుంది. అత్యధికంగా పండించే వరి పంటకు అతితక్కువగా కేవలం 69రూపాయలు మాత్రమే పెంచడం హాస్యాస్పదం. వాస్తవానికి వరి పంట క్వింటాలుకు 3,135 రూపాయలుగా నిర్ణయించాల్సి ఉండగా, 2369 రూపాయలుగా నిర్ణయించడం జరిగింది. దీంతో



క్వింటాల్ ధాన్యానికి 766రూపాయలు నష్టపోవాల్సిందే. ఈ కనీస మద్దతు ధరలను 2004-06 మధ్యకాలంలో ఎమ్మెస్ స్వామినాథన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన జాతీయ రైతుల కమిషన్ సిఫారసుల మేరకు సమగ్ర ఉత్పత్తి ఖర్చు ప్లస్ 50 శాతం(2+50శాతం) అదనంగా కలిపి నిర్ణయించాల్సి ఉంది. కానీ ఇంతవరకు ఏప్రభుత్వం కూడా ఈ సిఫారసుల ప్రకారం నిర్ణయించిన దాఖలాలు లేవు. వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్( సిఏ సిపి) సిఫారసులను కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీస మద్దతు ధరను రైతులకు అనుకూలంగా శాస్త్రీయంగా నిర్ణయించకుండా, అప్పుల పాలయ్యే విధంగా అతి తక్కువగా నిర్ణయించిన పాలక పెద్దలు రైతును రాజును చేస్తామనడం సత్య దూరమే. గత ఎన్నికలలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కడమే కదా! రైతును రాజుని చేస్తామన్న ప్రభుత్వం అసలు రైతులకే ఏసరు పెట్టేలా మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకురావడంతో, దేశవ్యాప్తంగా రైతన్నలు ఏడాదిపైగా ఉద్యమాలు చేపట్టి,700 మందికి పైగా రైతుల బలిదానంతో, వాటిని వెనక్కి తీసుకొని రైతులతో చర్చలు జరిపిన ప్రభుత్వంకనీస మద్దతు ధర చట్టం రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఇంతవరకు అతిగతి కూడా లేదు. కనీసం మద్దతు ధరకు చట్టం చేయకపోగా సరిగ్గా లెక్కించకపోవడంతో రైతులు అప్పులఊబిలో కూరుకుపోయి, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రతి ఏటావేలాది మంది రైతులు పిట్టల్లా రాలిపోతుంటే వాటిని నిరోధించడానికి కనీస చర్యలు చేపట్టకపోవడం పాలకవర్గాల నిర్లక్ష్యపు ధోరణియే కారణం. ఖరీఫ్ సీజన్ కోసం వాతావరణ శాఖ అందించినసమాచారం మేరకు ప్రభుత్వాలు వ్యవసాయ ప్రణాళిక తయారు చేసుకుని దాని ప్రకారం రైతులను సన్నద్ధం చేయవలసి ఉంది. ఖరీఫ్ సాగుకు అనుకూలమైన పంటలను తెలియపరచి, వాటికి సంబంధించిన నాణ్యమైన మేలు రకం విత్తనాలు, సరిపడ ఎరువులు సమకూర్చుకొని సరసమైన ధరలకు రైతులకు అందించాల్సిన తరుణం. పాలక పెద్దలు నాణ్యమైన మేలురకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎరువులు కూడా సక్రమంగా అందుతాయని ప్రచారం చేయడం జరుగుతుంది. కానీ క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా కొనసాగుతుంది. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరంకూడా విత్తనాల ఎరువుల పంపిణీ సక్రమంగా సకాలంలో అందే పరిస్థితులు లేవని రైతన్నలు అభిప్రాయపడుతున్నారు. పాలకులు మారినా, వ్యవసాయ రంగ సమస్యలు, రైతులకు అందాల్సిన సహాయ సహకారాల లో ఎటువంటి మార్పులు కనుచూపు మేరలో కనబడటం లేదు. రైతులఆత్మహత్యలు, ఆక్రందనలకు అడ్డు, అదుపు లేనే లేవు. ప్రతిరోజు ఏదో ఒక చోట రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉన్నారు. వాటిని నిరోధించడానికి ఇచ్చిన హామీల మేరకు సన్నరకం ధాన్యానికి 500 రూపాయలు బోనస్ చెల్లించడం, రైతు బీమా పంట బీమాలను సక్రమంగా నిర్వహించడం, గ్రామాల వారీగా కౌలు రైతులను కేరళ రాష్ట్రం తరహాలో గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వపథకాలను వారికి వర్తింపజేయడం, క్షేత్రస్థాయిలో పంటలు పండించే రైతులకు రైతు భరోసాను అందజేయడం, సమగ్రమైన విత్తన చట్టాన్ని రూపొందించి నాణ్యమైన విత్తనాలను సరసమైన ధరలకు అందించడం, ప్రైవేటు యాజమాన్యాలు అమ్మేటువంటి కల్తీ విత్తనాలను పకడ్బందీగా నిరోధించడం, సరసమైన ధరలకు సరిపడా ఎరువులను అందించడం, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ప్రకారం రైతులకు రుణసౌకర్యం కల్పించి, సకాలంలోపండించిన పంటలను కొనుగోలు చేయడంలాంటి సౌకర్యాలు కల్పించినప్పుడే రైతుల సంక్షేమం గురించి పట్టించుకున్నట్లు అవుతుంది. కానీ సమస్యలను తీర్చకుండా నూతనంగా కొత్తవి కల్పిస్తూ, రైతును రాజు చేస్తామనడం, రైతే దేశానికి వెన్నుముక అనిమాటలు చెప్పడం అరుగాలం శ్రమించిమట్టినుండి బువ్వను తీసే అమాయకపు రైతులను మోసం చేయడమే అవుతుంది. పంటలను పండించిన ఏఒక్క రైతుకూడా ఆత్మహత్య చేసుకోకుండా కాపాడగలిగినప్పుడే రైతులను రాజులుగా చేసినట్టు అవుతుంది. ఆరోజు కోసం వేచిచూద్దాం. •

# ప్రకృతి వైపరీత్యాల పట్ల అవగాహన అవసరం

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచవ్యాప్తంగా అనేకానేక దేశాల్లో ప్రకృతి విపత్తులు విరుచుకుపడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సృష్టిస్తున్న విధ్వంసంతో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ఈ సందర్భంగా ప్రకృతి వైపరీత్యాల గురించి అవగాహన కలిగిఉండడం అత్యంత అవసరం. సహజ, సాంస్కృతిక వనరులను ధ్వంసం చేసి, ప్రజలకు తీవ్రనష్టం కలిగించే ప్రకృతిపరమైన, మానవ ప్రేరేపిత ఆకస్మిక సంఘటనలే విపత్తులు. విపత్తు ఒక భయంకర పరిస్థితి. దీంతో సాధారణ జనజీవనం అస్తవ్యస్తం అవుతుంది. పర్యావరణ స్థితి విచ్ఛిన్నం అవుతుంది. భూమి కంపించడం వలన జరిగే వైపరీత్యాలు, జల వైపరీత్యాలు, వడగాలి, అగ్ని, మహమ్మారులు, అంతరిక్షం ప్రభావాల సంఘటనలు, సౌర జ్వాలలు తదితరాల ప్రభావం మానవ జీవితంపై అధికంగా ఉంది. విపత్తులవల్ల వరదలు 30 శాతం, తుపానులు 21శాతం, కరవు 19శాతం, మహమ్మారి వ్యాధులు 15 శాతం, భూకంపాలు, సునామీలు 8శాతం, భూతాపాలు 4 శాతం, హిమపాతాలు 11శాతం, అగ్ని పర్వతాలు 1శాతం, కీటక దాడులు 1శాతం నష్టాలు సంభవిస్తున్నాయి. డిజాస్టర్ నాలెడ్జ్ నెట్‌వర్క్ (ఐడీకేఎన్) రిపోర్టుల ప్రకారం దేశంలోని 29 రాష్ట్రాలు ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏదో ఒక విపత్తుకు తరచు గురవుతున్నాయి. దేశంలోని తీర ప్రాంతాలు విశిష్టమైన ప్రకృతి వనరులు, జీవ వైవిధ్యానికి ప్రతీకలు. దేశ ఆర్థిక పరిపుష్టిలో విశేషమైన పాత్ర ఇవిపోషిస్తున్నాయి. 13 రాష్ట్రాల్లోని 84 జిల్లాలు, అండమాన్, లక్షద్వీప్ కేంద్ర పాలిత రాష్ట్రాల్లో 7,500 కిలోమీటర్లలో సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. వీటిల్లో గుజరాత్ (1,214కి.మీ.) ఆంధ్రప్రదేశ్‌లో (7 కి.మీ.) రాష్ట్రాల్లో అధికంగా తీరప్రాంతం ఉంది. అడవులు, చిత్తడినేలలు, పగడపు దిబ్బలు, ఉప్పునీటి కయ్యలు, ఇసుక నేలలు వంటి జీవ వైవిధ్యం తీరప్రాంతాల్లో ఉంటాయి. తీరంలోని యాభై కిలోమీటర్ల లోపు రమారమి ముప్పైకోట్ల మేర జనాభా నివసిస్తుంది. పర్యావరణ సమతుల్యత లోపించడం వాతావరణంలో పెను మార్పులు విపత్తులకు మూలకారణం పెరుగుతున్న జనాభా, నగరీకరణ, తీర నియంత్రణ, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలు, పరిశ్రమలు, ఓడరేవుల విస్తరణ తీరంలోని జీవ వైవిధ్యానికి చేటు తెస్తూ సమస్యకు ఆజ్యం పోస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం భారత దేశంలో సంభవించే విపత్తుల వల్ల జాతీయ ఆదాయంలో ఏటా 2.25 శాతం నష్టం వాటిల్లుతోంది. ‘ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్’ రిపోర్ట్ ప్రకారం భారత్‌లో గత మూడున్నర దశాబ్దాలుగా దాదాపు 431రకాల విపత్తులు సంభవించాయి. వీటిద్వారా సుమారు 1,43,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 15 కోట్ల మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వీటి ప్రభావానికి గురయ్యారు. సుమారు 4,800 కోట్ల అమెరికన్ డాలర్ల ఆస్తి నష్టం జరిగింది. ఇవి ఇప్పటివరకు భారత దేశంలో, ప్రపంచంలోనూ ఎక్కువసార్లు సంభవించిన విపత్తు ‘వరదలు’గా ఆ నివేదిక పేర్కొంది. ప్రకృతి విపత్తులకు భారత్ అంతులేని మూల్యాన్ని చెల్లిస్తోందని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక కుండబద్దలు కొట్టింది. 20ఏళ్లలో విపత్తుల కారణంగా దేశం 7,950 కోట్ల డాలర్లు (సుమారు రూ.5.91 లక్షల కోట్లు) నష్టపోయింది. ఆర్థిక నష్టాలు, పేదరికం, విపత్తుల పేరిట 2017ఆగస్టులో విడుదలైన నివేదికలో వివిధ, దేశాలు నష్టపోయిన మొత్తం విలువ 2.9 లక్షల కోట్ల డాలర్లుగా తేలింది. అంతకుముందు 20 ఏళ్ల వ్యవధినష్టాల కంటే ఇది రెట్టింపు. ప్రపంచంలో విపత్తులవల్ల నష్టపోతున్నవారిసంఖ్య 211 మిలియన్లు. విపత్తులవల్ల భారత్‌లో ఏటా10బిలియన్ల డాలర్ల నష్టం నష్టం జరుగుతోంది. మన దేశంలో భూమి వరదలకు 12శాతం (8శాతం) గురవుతోంది. ప్రకృతి వైపరీత్యాలైన తుపానులు, వరదల్లో మృతిచెందే వారికిప్రభుత్వం నష్టపరిహారాన్ని ఇస్తోంది. ప్రకృతి విపత్తులు, బీమా రంగం తన పాత్రను ఎక్కువగా నిర్వర్తిస్తూ వస్తూంది. ఈ రంగం, కొన్ని నష్టాలను పూడ్చుటకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తుంది. ప్రకృతి వైపరీత్యాల నివారణకై, ప్రణాళికలను బడ్జెట్లోప్రత్యేకంగా పొందుపరచాల్సిన అవసరం ఉంది. నష్టంఅంచనాలో పౌరసమాజం, స్వచ్ఛంద సంస్థలను భాగ స్వాములను చేయాలి. •

# రాజకీయ దురంధరుడు జలగం

గోపిశెట్టి వెంకటేశ్వరరావు

రాజకీయ రంగంలో గెలుపోటములు సమానంగా స్వీకరించిన జలగం వెంగళ రావు ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా భాసిల్లింది. సామాన్య వ్యవసాయ కుటుంబంలో పుట్టి వ్యాపార రంగంలో అడుగుపెట్టినా.. ఆపై జీవితమంతా రాజకీయ రణరంగంలోనే మనుగడ సాగించిన రణధీరుడు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభిమానంతో కార్యకర్తల కష్టంతో, నాయకుల కృషితో, స్వీయ పాలనా వైదుష్యంతో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధిలో చేపట్టిన చారిత్రాత్మక సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, నీటి ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపన, ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాలనాతత్పరునిగా పేరొందారు. జలగం వెంగళరావు 27 వ వర్ధంతి సందర్భంగా వారి కృషి ,పట్టుదల, సేవా దృక్పథం నేటి తరానికి అందివ్వడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం. శ్రీకాకుళం జిల్లా రాజం దగ్గర సోపేరులో 1922 మే 4వ తేదీన మాతామహుల ఇంట జలగం వెంగళరావు జన్మించారు. తండ్రి కృష్ణా జిల్లాలో జమీందారి ఉద్యోగం చేస్తుండేవారు. వెంగళరావుకు ఇద్దరు సోదరులు రామారావు కొండలరావులు. కాగా దామెర ప్రకాశమ్మ, కోటగిరి సత్యవతమ్మ, చెలికాని తాయారమ్మలు సోదరీమణులు. తండ్రి ఉద్యోగం చేస్తున్న కేసర పల్లిలో బాల్యం గడవడంతోపాటు (ప్రైమరీ విద్యను పూర్తి చేసి) ఆ తదుపరి గన్నవరం తాలూకా హైస్కూల్ నందు ఎస్ఎస్ఎల్సి వరకు చదివి ఉత్తీర్ణుల య్యారు. ఈ కాలంలోనే భావి జీవితానికి మంచి పునాదులు పడ్డాయి. బ్రిటీష్ వారితో తలపడి దేశానికి స్వాతంత్యం సాధించుకోవడం అంత తేలికైన పనికాదు. మహాత్మా గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య వంటి నేతల పోరాటంలో దండుగా కదిలారు. తమ పై లాఠీలు నాట్యం చేస్తున్నా అదర లేదు. బెదర లేదు. ‘ఇంక్విలాబ్ జిందాబాద్’ అనే నినాదం వెంగళరావును బాగా ఉద్యమంవైపు ఆకర్షించింది. ఆ సమయంలోనే కృష్ణా జిల్లా మాధవరానికి చెందిన వెలుగులేటి మాధవరావు కుమార్తె మంగాయమ్మతో పాణి గ్రహణం. ఈ వివాహ బంధమే



నేడు జలగం వెంగళరావు 27వ వర్ధంతి

వెంగళరావు జీవితాన్ని మలుపు తిప్పింది. మాధవరావుకు నాటి నైజాం రాష్ట్రంలోనే వరంగల్ జిల్లా మదిర తాలూకా చౌడవరం గ్రామంలో భూములు కలప వ్యాపారం ఉండేవి. ఈ విధంగా మామతో కలిసి నైజాం ప్రాంతానికి వచ్చి బయ్యన్నగూడెం గ్రామంలో భూములు కొనుగోలు చేసుకుని స్థిరపడి వ్యవ సాయం, వ్యాపారం చూస్తుండే వాడు. నాడు నైజాం ప్రభుత్వం అధికారులు, భూస్వాములు, పటేలులు, పట్వారీలు పెత్తనం కొనసాగుతూ ఉండేది. 22 ఏళ్ల వయసులో స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌లో పని చేశారు. జన సమీకరణలో ముందుండే వారు. గ్రామాలలో దౌర్జన్యాలు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పనిచేస్తూ నాయకుడిగా రాణిస్తున్న తరుణంలో నిజాం ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని రద్దు చేసింది. 1930లో తెలంగాణా నాయ కులంతా ఆంధ్ర మహాసభ ద్వారా నిజాంకు వ్యతిరేకంగా పనిచేసేవారు. స్వాతంత్రోద్యమ కాలంలో ఉద్యమకారులపై నిరంకుశ చర్యలు మెండుగా ఉండేవి. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా, నిజాం మరికొన్ని సంస్థలు విముక్తికి కాలేదు. దివంగతులు బొమ్మకంటి సత్యనారాయణ, హయగ్రీవాచారి, మాడపాటి హనుమంతరావులు విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్న సమయంలోనే జలగం వెంగళరావు తిరువూరు కేంద్రంగా చింతలపూడి వరకు కాంగ్రెస్ పార్టీని నిజాంకు వ్యతిరేకంగా నడిపించారు. 1948లో చింతలపూడి వద్ద కొంతమంది కార్యకర్తలతో జలగం దళంపై రజాకారు మూకలతో కలిసి పోరాడుతూ ఆంధ్రాప్రాంతంలోకి రాగానే ఆంధ్రా పోలీసులు అరెస్టు చేసారు .అనతి కాలంలోనే ఆంధ్రా, తెలంగాణా ,రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి తాగు, సాగు, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందడుగు వేసారు. బిబి నగర్, నడికుడి రైల్వే మార్గానికి రాయనపాడు వద్ద రైల్వే వ్యాగన్ల మరమ్మత్తుల కర్మాగారాన్ని ఏర్పాటు చేయించిన ఘనత ఆయనదే. రాష్ట్రంలో వృథాగా నీటిని వినియోగంలోకి తీసుకొచ్చి వ్యవసాయ ఉత్పత్తులను పెంచే లక్ష్యంగా నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువలను ప్రపంచ బ్యాంకు సహాయంతో పూర్తి చేసారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా వరంగల్ అదిలాబాద్, నిజాంబాద్ జిల్లాలకు నీరందించే ఏర్పాటు చేసారు. నెల్లూరు జిల్లాలో పెన్నా నదిపై సోమశిల ప్రాజెక్టు ద్వారా నెల్లూరు జిల్లా ప్రజల అవసరాలు తీర్చారు. రాయలసీమకు తాగునీరు అందించడానికి కృష్ణా జలాలను మళ్లించారు. ఈ విధమైన మధ్య తరహా ప్రాజక్టులకు అంకురార్పణ గావించారు. కేంద్ర పరిశ్రమల మంత్రిగా 1986 అక్టోబరు 22న రాజీవ్ గాంధీ మంత్రివర్గంలో చేరి సిమ్మెంటు, కాగితాల పరిశ్రమల, ఫార్మా సంస్థలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. జై ఆంధ్రా తెలంగాణా ఉద్యమాలతోపాటు నక్సలైటు ఉద్యమాలను అణచివేసిన ఖ్యాతి ఆయనకే దక్కింది. కేంద్రంలో జనతా పార్టీ అధికారంలోకి రాగానే వేడిన విమదలాలు కమీషను జలగం వెంగళరావును నిర్దోషిగా తేల్చగా పార్లమెంటులోనే ప్రకటించారు. ఖమ్మం జిల్లా నుండి రాజకీయాలు నడిపిన జలగం వెంగళరావు కుటుంబం ఆరు దశాబ్దాల పాటు కేంద్రంలో, రాష్ట్రంలో రాజకీయ రంగంలో గణుతికెక్కారు. 1984-89 ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు అందరూ ఏకమై జలగం వెంగళరావుకు వ్యతిరేకంగా పనిచేసారు. అయినా బహిరంగ సభల్లో జలగం మాట్లాడుతూ ‘నాగార్జున సాగర్ నీళ్లలో నా నీడ కనపడద్ది, తినే పళ్ళెంలో వెంగళరావు బొమ్మ కనపడద్ది’ అని ధైర్యంగా చెప్పగలిగిన ఏకైక నాయకుడు జలగం. జలగం వెంగళరావు నేటి తరం నాయకులకు ఆదర్శవంతుడు. 1999 జూన్ 12న హైదరాబాద్‌లో తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. •

# భర్తని నేనే హత్య చేయించా



## రఘువంశీ హత్యకేసు కీలకమలుపు

## నేరాన్ని అంగీకరించిన సోనమ్

### ప్రియునితో కలిసి కుట్రపన్నినట్లు వెల్లడి

**షిల్లాంగ్,జూన్ 11:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇండోర్ వ్యాపారవేత్త రాజా రఘు వంశీ హత్యకేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హనీమూన్ కోసం మేఘాలయకు వెళ్లిన భర్తను అతి కిరాతకంగా హత్య చేయించిన కేసులో భార్య సోనమ్ రఘువంశీ తన ప్రమేయాన్ని అంగీకరించిందని మేఘాలయ పోలీసులు బుధవారం వెల్లడించారు. రోజుల తరబడి సాగిన విచారణ అనంతరం ఈ హత్య వెనుక ఉన్న షాకింగ్ కుట్రను సోనమ్ బయటపెట్టినట్లు అధికారులు తెలిపారు. జూన్ 2న ఓ లోయలో రాజా రఘువంశీ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభించింది. ఇండోర్‌కు చెందిన వ్యాపారవేత్త రాజా రఘువంశీ, సోనమ్‌ల వివాహం మే 11న జరిగింది. పెళ్లయిన కొద్ది రోజులకే మే 23న ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల దర్యాప్తు ప్రకారం సోనమ్ తన ప్రియుడు రాజ్ కుష్వాహ్, మరో ముగ్గురు వ్యక్తులు ఆకాశ్ రాజ్‌పుత్, విశాల్ సింగ్ చౌహాన్, ఆనంద్ కుర్మిలతో కలిసి ఈ హత్యకు పక్కా ప్లాన్ వేసింది. రాజ్ కుష్వాహానే ఈ హత్యకు ప్రధాన కుట్రదారుడని పోలీసులు భావిస్తున్నారు. రాజాను వివాహం చేసుకోవడానికి ముందే సోనమ్‌కు రాజ్ కుష్వాహాతో సంబంధం ఉందని, కుటుంబ సభ్యుల ఒత్తిడి కారణంగానే ఆమె రాజాను పెళ్లి చేసుకుందని విచారణలో తేలింది. మే 23న దంపతులిద్దరూ నాంగ్రియాట్‌లోని తమ హోటల్ నుంచి ఉదయాన్నే చెక్‌అవుట్‌చేసి, చిరపుంజిలో ట్రెక్కింగ్‌కు బయలుదేరారు. అయితే, రాజాకు తెలియకుండానే సోనమ్ సహచరులు కూడా సమీపంలోని ఓ హోమ్‌స్టే నుంచి అదే సమయంలో చెక్‌అవుట్ చేసి వారిని అనుసరించారు.

దాదాపు తొమ్మిది గంటల పాటు ఈ హత్యకు సంబంధించిన తతంగం నడిచిందని, చివరకు రాజా మృత దేహాన్ని ఓ లోతైనలోయలోకి విసిరేశారని పోలీ సులు తెలిపారు. ఘటనా స్థలంనుంచి కత్తి, రెయిన్‌కోట్, రక్తపు మరకలతో కూడిన దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. డిజిటల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, సాక్షుల వాంగ్మూలాల సహాయంతో పోలీసులు ఈ కుట్రను ఛేదించగలిగారు. నిందితులందరూ సోనమ్ ఈ నేరానికి సూత్రధారి అని అంగీకరించినట్లు రాజా సోదరుడు వెల్లడించారు.

భారత్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన మేఘాలయలో హనీమూన్ ముసుగులో జరిగిన ఈ దారుణ హత్య వెనుక రహస్య సంబంధం, నమ్మక ద్రోహం వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. పోలీసులు కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## అది ఇష్టంలేని పెళ్లి

### ఒత్తిడితో చేసుకున్నా..పరిస్థితి తీవ్రంగా ఉంటుందన్న సోనమ్

**ఇండోర్, జూన్ 11:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఒక ఘటనలో, హనీమూన్‌కు వెళ్లిన భర్తను అతని భార్యే ప్రియుడితోకలిసి దారుణంగా హత్య చేయించిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. తనకు ఇష్టంలేని వ్యక్తితో వివాహం జరిపిస్తే తీవ్ర పరిణామాలుంటాయని ముందే తన కుటుంబాన్ని హెచ్చరించిన సోనమ్, పెళ్లయిన కొన్నిరోజులకే భర్త రాజా రఘువంశీని మేఘాలయలో హతమార్చినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ కేసులో సోనమ్‌తో పాటు ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహ, మరో ముగ్గురు నిందితులుగా ఉన్నారు. ఇండోర్‌కు చెందిన 24 ఏళ్ల సోనమ్, 29 ఏళ్ల రాజా రఘువంశీకి మే 11న వివాహం జరిగింది. అయితే, సోనమ్ అంతకుముందే తమ కుటుంబ వ్యాపార సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న రాజ్ కుష్వాహాతో ప్రేమలో ఉందని రాజా అన్న విపిన్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో తెలిపారు. సోనమ్ తన తల్లికి రాజ్‌తో ఉన్న సంబంధం గురించి ముందే చెప్పిందని, రాజాను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని కూడా తెలిపిందని విపిన్ అన్నారు. అయితే, సోనమ్ తల్లి వారి సంబంధాన్ని వ్యతిరేకించి, తమ కులానికి చెందిన వ్యక్తినే వివాహం చేసుకోవాలని నచ్చజెప్పిందని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఒత్తిడికి తలొగ్గి రాజాను పెళ్లిచేసుకోవడానికి సోనమ్ అంగీకరించినప్పటికీ, తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించింది. ఆ వ్యక్తిని నేనేం చేస్తానో మీరే చూస్తారు. మీరందరూ పర్యవసానాలు అనుభవించాల్సి వస్తుంది అని ఆమె అన్నట్లు విపిన్ చెప్పారు.



### దిగ్విజయ్ సింగ్ సోదరుడు

## లక్ష్మణ్ సింగ్‌పై బహిష్కరణ వేటు

### పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడంతో చర్య తీసుకొన్న కాంగ్రెస్ అధిష్ఠానం

**న్యూఢిల్లీ, జూన్ 11:** మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సోదరుడు లక్ష్మణ్ సింగ్‌పై కాంగ్రెస్ పార్టీ కఠిన చర్యలు తీసుకుంది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ఆయన చేసిన తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో లక్ష్మణ్ సింగ్‌ను పార్టీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. లక్ష్మణ్ సింగ్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన నేత. ఆయన ఐదు సార్లు పార్లమెంట్ సభ్యుడిగా, మూడు సార్లు శాసన సభ్యుడిగా సేవలందించారు. అయితే,గత కొంత కాలంగా ఆయన పార్టీ నాయకత్వంపై తరచూ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనకు ఇటీవలే షోకాజ్ నోటీసు కూడా జారీ చేశారు. ఆయనపై సస్పెన్షన్ వేటు వేయాలన్న నిర్ణయాన్ని ఎఐసిసి క్రమశిక్షణా సంఘం తీసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ 24న పహల్గామ్ బాధితులకు నివాళులు అర్పించే కార్యక్రమంలో లక్ష్మణ్ సింగ్ మాట్లాడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ, రాబర్ట్ వాద్రాలకు పరిపక్వత లేదు. వారి అపరిపక్వ వైఖరి వల్లే దేశం పర్యవసానాలను ఎదుర్కో వాల్సి వస్తోంది. రాబర్ట్ వాద్రా స్వయంగా రాహుల్ గాంధీ బావమరిది. ఒక వర్గాన్ని రోడ్లపై ప్రార్థనలు చేసుకోనివ్వకపోవడం వల్లే ఈ దాడి జరిగిందని అంటున్నారు. ఇలాంటి పిల్ల చేష్టలను ఎంతకాలం భరించాలి. రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత. ఆయన మాట్లాడే ముందు ఆలోచించుకోవాలి. జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఉగ్రవాదులతో కుమ్మక్కయ్యారని లక్ష్మణ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం కార్యదర్శి తారిక్ అన్వర్ తీవ్రంగా స్పందించారు. లక్ష్మణ్ సింగ్‌కు నోటీసులు జారీ చేస్తూ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పార్టీ సీనియర్ నాయకత్వంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి ఆయన అన్ని హద్దులు దాటారని అందులో స్పష్టంచేసారు.

## అమెరికా అధ్యక్షుడు సహా మంత్రులను కూడా మట్టుబెడతాం!

### అల్‌ఖైదా అరేబియన్ పెనిన్సులా చీఫ్ అల్ అవ్లాకీ విడియో హెచ్చరికలు



**సనా(యెమెన్) ,జూన్ 11:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హతమారుస్తామంటూ అల్ ఖైదా అనుబంధ సంస్థ అరేబియన్ పెనిన్సులా హెచ్చరించింది.

ట్రంప్ తో పాటు ఎలాన్ మస్క్, అమెరికా మంత్రులనూ వదిలిపెట్టబోమని చెప్పింది. ఈ మేరకు అరేబియన్ పెనున్సులా చీఫ్ సాద్ బిన్ అతేఫ్ అల్ అవ్లాకీ ఓ వీడియో విడుదల చేశాడు.

గాజాలో ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ట్రంప్ సహా అతడి మంత్రులను, వైట్ హౌస్ సిబ్బందిని అంతమొందిస్తామని చెప్పాడు. ఈ ప్రతీకారం ప్రపంచంలోని ముస్లింలందరిదీనని అన్నాడు. ఏ దేశానికి చెందిన వారైనా, ఏ వర్గానికి చెందిన వారైనా సరే మహమ్మద్‌ను ప్రవక్తగా నమ్మే వారందరికీ ప్రతీకారం తీర్చుకోవాలంటూ పిలుపునిచ్చాడు.

ఈ సందర్భంగా ఒక్క అమెరికాలోనే 4.5 మిలియన్ల మంది ముస్లింలు ఉన్నారని సాద్ బిన్ గుర్తుచేశాడు. అల్‌ఖైదాలో అరేబియా పెనిన్సులా విభాగమే ప్రస్తుతం అత్యంత చురుగ్గా పనిచేస్తోంది. యెమెన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ ఉగ్రసంస్థ గతంలో ప్రమాదకర దాడులు నిర్వహించింది. బిన్ లాడెన్ మరణం తర్వాత అత్యంత ప్రమాదకర గ్రూపుగా అవతరించింది.

2024 మార్చిలో అరేబియన్ పెనిన్సులా అధిపతిగా సాద్ బిన్ బాధ్యతలు చేపట్టాడు. సాద్ బిన్ తలపై అమెరికా ఇప్పటికే 6 మిలియన్ డాలర్ల రివార్డును ప్రకటించింది. గాజాలో పాలస్తీనా వాసులకు నిలువనీడ లేకుండా చేసినందుకు అమెరికా అధ్యక్షుడు, ఇతర మంత్రులపై భారీ స్థాయిలో ప్రతీకారం తీర్చుకోవాలని సాద్ బిన్ పిలుపునిచ్చాడు. అమెరికాలోని లక్ష్యాలపై దాడులు చేసేందుకు ఎలాంటి హద్దులు లేవని చెప్పాడు.

## ప్రధానిమోడీని కలవాలంటే ఆర్టీపిసిఆర్ పరీక్షలు తప్పనిసరి


### సర్క్యులర్ జారీచేసిన పిఎంఒ అధికారులు

### రోజురోజుకూ పెరుగుతున్న కరోనా కేసులు

### 7121 మందికి నిర్ధారణ, 74 మంది మృతి

**న్యూఢిల్లీ, జూన్ 11:** దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి మరోసారి ఆందోళన కలిగిస్తోంది. పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసే మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు తప్పనిసరిగా ఆర్టీపిసిఆర్ పరీక్ష చేయించుకోవాలని ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. తాజాగా నమోదవుతున్న కేసులతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 7 వేలు దాటింది. బుధవారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా 306 కొత్త కరోనా కేసులు వెలుగుచూశాయి. దీంతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారి సంఖ్య 7,121కి చేరింది. ఇప్పటివరకు దేశంలో కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 74కు పెరిగింది. ఈ పరిస్థితుల దృష్ట్యా, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని ఆరోగ్య శాఖ సూచించింది.

ముఖ్యంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సమావేశమయ్యే కేంద్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ముఖ్యమైన వ్యక్తులు తప్పనిసరిగా ఆర్టీపిసిఆర్ పరీక్ష చేయించుకోవాలని పిఎంఒ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను కూడా పిఎంఒ అధికారులు చేస్తున్నారని సమాచారం.



దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం 7,121 యాక్టివ్ కేసుల్లో కేరళలో అత్యధికంగా 2,223 కేసులు ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో గుజరాత్ 1,223, ఢిల్లీ 757, పశ్చిమ బెంగాల్ 747, మహారాష్ట్ర 615, కర్ణాటక 459 రాష్ట్రాలు నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో 72 యాక్టివ్ కేసులు ఉండగా, తెలంగాణలో 11 కేసులు నమోదయ్యాయి. ఉత్తర ప్రదేశ్‌లో 229, తమిళనాడులో 204, రాజస్థాన్‌లో 138, హర్యానాలో 125, మధ్యప్రదేశ్‌లో 65, ఛత్తీస్‌గఢ్‌లో 48, బీహార్‌లో 47, ఒడిశాలో 41, సిక్కిం, పంజాబ్‌లలో ఒక్కో రాష్ట్రంలో 33 చొప్పున కేసులు ఉన్నాయి. పుదుచ్చేరి, ఝార్ఖండ్‌లలో చెరో 10, జమ్ము కశ్మీర్‌లో 9, అసోం, గోవాలలో 6 చొప్పున, చండీగఢ్, ఉత్తరాఖండ్‌లలో 3 చొప్పున, హిమాచల్ ప్రదేశ్‌లో 2, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్కో కేసు చొప్పున నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

### ఔను.. నిజమే.. నా వ్యాఖ్యలు

## హద్దులు దాటాయి!

### ట్రంప్‌పై తన వ్యాఖ్యలకు మస్క్ పశ్చాత్తాపం

**వాషింగ్టన్, జూన్ 11 :** ప్రముఖ బిలియనీర్, వ్యాపారవేత్త ఎలాన్ మస్క్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తాను చేసిన కొన్ని సోషల్ మీడియా పోస్టుల పట్ల విచారం వ్యక్తం చేశారు. ఇరువురి మధ్య ఆన్‌లైన్‌లో తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగిన కొద్ది రోజులకే మస్క్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. గత వారం ట్రంప్‌పై తాను చేసిన వ్యాఖ్యలు హద్దు మీరాయని మస్క్ అంగీకరించారు. గత వారం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురించి నేను చేసిన కొన్ని పోస్టుల పట్ల విచారిస్తున్నాను. అవి హద్దు మీరాయి" అని మస్క్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. రోజుల తరబడి సాగిన బహిరంగ వాగ్వాదం తర్వాత ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నంగా మస్క్ ప్రకటన ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వివాదం ఓ ప్రధాన ప్రభుత్వ వ్యయ ప్రతిపాదన బిల్లుపై మస్క్ చేసిన విమర్శలతో ప్రారంభమైంది. ఈ విమర్శలు ఆన్‌లైన్‌లో వేగంగా వ్యాపించడంతో ట్రంప్ నుంచి తీవ్ర ప్రతిస్పందన వచ్చింది. దీని తర్వాత మస్క్ వరుస పోస్టులు చేశారు. ముఖ్యంగా ట్రంప్‌ను జెఫ్రీ ఎప్స్టీన్ ఫైల్స్‌తో ముడిపెడుతూ చేసిన ఓ వివాదాస్పద పోస్టును మస్క్ తొలగించారు. ప్రభుత్వ విధానాలు, వ్యయాలపై వీరిద్దరి మధ్య లోతైన విభేదాలు ఉన్నట్లు ఈ సంఘటన ప్రతిబింబి ంచింది. కొత్త బిల్లు ఫెడరల్ లోటును మరింత తీవ్రతరం చేసి, దేశాన్ని రుణ సంక్షోభం వైపు నెట్టగలదని మస్క్ హెచ్చరించారు. అయితే, వాషింగ్టన్‌లో తన కుమారుడి పదవీకాలంలో ఒత్తిడి కారణంగానే ఇలా ప్రవర్తించారని ఆయన తండ్రి ఎరాల్ మస్క్ వ్యాఖ్యానించారు.

## సోషల్‌మీడియాలో ఆర్సీబి అతివల్లే ఈ అనర్థం

### చిన్నస్వామిస్టేడియం తొక్కిసలాటపై హైకోర్టులో సర్కారు వాదన

**బెంగళూరు,జూన్ 11 :** ఐపీఎల్ విజేతగా నిలిచిన ఆర్సీబీ జట్టు విజయోత్సవ ర్యాలీ సందర్భంగా చిన్నస్వామి స్టేడియంవద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా కర్ణాటక ప్రభుత్వం ఆర్సీబీ యాజమాన్యం పైనా, బీసీసీఐ పైనా తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించింది. విజయోత్సవ కార్యక్రమానికి నిర్వాహకులు ఎలాంటి ముందస్తు అనుమతులు పొందలేదని, కేవలం సమాచారం మాత్రమే ఇచ్చారని ప్రభుత్వం కోర్టుకు నివేదించింది. అంతేకాకుండా, ఆర్సీబీ జట్టు తమ సామాజిక మాధ్యమ ఖాతాలద్వారా ఈవెంట్‌కు విపరీతమైన ప్రచారం కల్పించడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుందని ప్రభుత్వం వాదించింది. ఈతొక్కిసలాట ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదుచేసి, ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సోసలేతో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసారని వివరించింది. తమ అరెస్టును సవాలు చేస్తూ వారు కర్ణాటకహైకోర్టులో పిటిషన్లు దాఖలుచేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనం ముందు కర్ణాటక ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శశికిరణ్ శెట్టి తమవాదనలు వినిపించారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహణ కోసం వారు ముందుగా ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. కేవలం ప్రభుత్వానికి సమాచారం మాత్రమే అందించారు. జూన్ 3వ తేదీన ఫైనల్ మ్యాచ్ జరగడానికి కేవలం గంట ముందు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం నుంచి ఒక లేఖ అందింది. అందులో పరేడ్‌కు అనుమతి ఇవ్వాలన్న అభ్యర్థన ఏమీ లేదు. కేవలం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాత్రమే తెలిపారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని అడ్వొకేట్ జనరల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా ఈ విక్టరీ పరేడ్ గురించి ఆర్సీబీ జట్టు అర్ధరాత్రినుంచే సామాజికమాధ్యమాల్లో ప్రచారం చేసింది. టికెట్లు లేదా ప్రవేశానికి సంబంధించిన సరైన సమాచారం ఇవ్వకుండానే అభిమానులందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చింది. దీని ఫలితంగానే సుమారు 3.5 లక్షల నుంచి 4 లక్షల మంది అభిమానులు స్టేడియం గేట్ల వద్దకు పోటెత్తారని ప్రభుత్వ తరపు న్యాయవాది వివరించారు.మైదానం వద్ద భద్రత, గేట్ల నిర్వహణ, టికెట్ల జారీ వంటి అంశాలకు సంబంధించి ఆర్సీబీ మరియు బిసిసిఐమధ్య ఒప్పందం ఉంది. కాబట్టి, ఈ ఘటనకు బీసీసీఐ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈవెంట్ సమయంలో కనీస ఏర్పాట్లు కూడా సరిగా లేవు. సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని కర్ణాటక ప్రభుత్వం కోర్టులో ఆరోపించింది.

## ఏకాదశిరోజున బీర్లు దానంచేసిన ఏడుగురి అరెస్టు!

**జైపూర్,జూన్ 11:** రాజస్థాన్‌లో ఏడుగురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను అరెస్టు చేశారు. వాళ్లు నడి రోడ్డుపై బీర్లు పంపిణీచేశారు. ఇటీవల ఏకాదశి రోజున జైపూర్ నగరంలోబాటసారులకు, బైక్‌పై వెళ్తున్న వాళ్లకు, ఆటోడ్రైవర్లకు బీరు పోసి తాగమన్నారు. హిందువులు పవిత్రంగా భావించే రోజున ఈ ఘటన జరిగింది. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను పట్టుకున్నారు. ఇన్‌ఫ్లుయెన్సర్ లప్పూ సచిన్ అలియాస్ సచిన్ సింగ్.. బీరును గ్లాసులో పోసి పంచాడు. అతనితో పాటు మరో ఆరు మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఇదంతా వీడియో తీశారు. దీంతో పోలీసులు ఏడుగురు ఇన్‌ఫ్లుయెన్సర్లను అరెస్టు చేశారు. వాళ్లు ఇచ్చిన ఆల్కాహాల్ పార్టీపై అనేక మంది విస్మయం వ్యక్తం చేశారు. బీరు దానానికి చెందిన విషయాన్ని ఓ వ్యక్తి జైపూర్ పోలీసులకు తెలియజేశాడు. మతపరమైన మనోభావాలను దెబ్బతీయాలన్న ఉద్దేశంతో వీడియోను తీయలేదని వాళ్లు పేర్కొన్నారు. సోషల్ మీడియా ఫాలోవర్లను పెంచుకునేందుకు ఆ వీడియోను తీసినట్లు చెప్పారు.

## బడ్జెట్‌లో రక్షణరంగ కేటాయింపులు పెంచేసిన పాకిస్థాన్

### ఆపరేషన్ సిందూర్ ఫలితంతో అనుభవం వచ్చిన పాక్

**ఇస్లామాబాద్,జూన్ 11 :** భారత్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్ర స్థాయిలో కొనసాగిస్తూ, అంతర్గతంగా భద్రతా వైఫల్యాలపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం ఏకంగా రక్షణ శాఖ బడ్జెట్‌ను ఒక్కసారిగా పెంచేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రక్షణ బడ్జెట్‌ను ఏకంగా 20 శాతం పెంచుకున్నట్లు జాతీయ అసెంబ్లీలో ప్రకటించింది. ఈ మేరకు పాక్ ఆర్థిక మంత్రి మహమ్మద్ ఔరంగజేబ్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో సైనిక వ్యయానికి పెద్దపీట వేశారు. తాజా బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం, రక్షణ రంగానికి 2.55 లక్షల కోట్ల పాకిస్థానీ రూపాయలు అంటే సుమారు 9 బిలియన్ డాలర్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపులు 2.12 లక్షల కోట్ల రూపాయలు సుమారు7.44 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన విషయం తెలిసిందే. భారత పాలిత కశ్మీర్‌లో 26 మంది హిందూ యాత్రికుల మృతికి కారణమైన ఉగ్రదాడి అనంతరం, రెండు అణ్వస్త్ర దేశాల మధ్య క్షిపణులు, డ్రోన్ల దాడులు చోటుచేసుకున్నాయి. మే ఆరంభంలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం ఇంకా చల్లారలేదు. ఈ నేపథ్యంలో దేశ రక్షణకే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ఆర్థిక మంత్రి మహమ్మద్ ఔరంగజేబ్ స్పష్టం చేశారు. అయితే, మొత్తం ప్రజా వ్యయాన్ని 7 శాతం తగ్గించి 17.57 లక్షల కోట్ల రూపాయలకు సుమారు 62 బిలియన్ డాలర్లకు పరిమితం చేసినప్పటికీ, రక్షణ వ్యయాన్ని గణనీయంగా పెంచడం గమనార్హం. పర్యావరణ మార్పుల వల్ల తీవ్రంగా నష్టపోతున్న పాకిస్థాన్, విద్య, వ్యవసాయం, వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్ట నివారణ చర్యల కంటే రక్షణ రంగానికే అధికనిధులు కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ వ్యయ పెంపునకుగల వ్యూహాత్మక కారణాలను వివరించారు. సాంప్రదాయ యుద్ధంలో భారత్‌ను ఓడించిన తర్వాత, ఇప్పుడు ఆర్థిక రంగంలో కూడా మనం వారిని అధిగమించాలి. కేవలం సైనికంగానే కాకుండా, ఆర్థికంగా కూడా పాకిస్థాన్ ముందుకు సాగాలి అని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవలి సంక్షోభాల సమయంలో, ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ ఘటనలో పాకిస్థాన్ సైనిక దళాల సన్నద్ధత, ప్రతిస్పందన సామర్థ్యంలోని లోపాలు బహిర్గతమయ్యాయని తీవ్ర విమర్శలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో సైనిక సామర్థ్యాన్ని పునరుద్ధరించుకోవడానికి, దేశీయంగా సాయుధ బలగాలపై విశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి ఈ బడ్జెట్ పెంపు ఒక రక్షణ వ్యూహంగా కనిపిస్తోందని విశ్లేషకులు చెపుతున్నారు. అయితే, రక్షణ రంగానికి ఇంత భారీ మొత్తంలో నిధులు కేటాయించడంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే బలహీనంగా ఉన్న ఆర్థిక వ్యవస్థపై ఈ నిర్ణయం మరింత భారం మోపుతుందని, కీలకమైన పౌర రంగాల నుంచి నిధులను పక్కదారి పట్టిస్తుందని వారు ఆరోపిస్తున్నారు.

## అధినేతకు దండవేసి... చెంప పగులగొట్టిన కార్యకర్త!

**జౌన్‌పూర్(యూపి), జూన్ 11 :** ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్ జిల్లాలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. సుహెల్‌దేవ్ స్వాభిమాన్ పార్టీ (ఎస్ఎస్‌పీ) జాతీయ అధ్యక్షుడు మహేంద్ర రాజ్‌భర్‌పై అదే పార్టీకి చెందిన ఓ కార్యకర్త బహిరంగ వేదిక పైనే దాడికి పాల్పడ్డాడు. తొలుత దండ వేసి సత్కరించిన కార్యకర్త కొద్దిసేపు ఆ నాయకుడిని ప్రశంసిస్తూ ప్రసంగించి ఆ మరుక్షణమే మహేంద్ర రాజ్‌భర్ చెంపపై పలుమార్లు కొట్టడం అక్కడున్న వారందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మహారాజా సుహెల్‌దేవ్ విజయ దినోత్సవం సందర్భంగా జలాల్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔశాపుర్ గ్రామంలో ఓ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాజ్‌భర్ వర్గం అధికంగా ఉండే ముజఫరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో సుహెల్‌దేవ్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ చేసేందుకు ఈ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొరుగు జిల్లాకు చెందిన మహేంద్ర రాజ్‌భర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రసంగించేందుకు ఆయన వేదికపైకి రాగానే, బ్రిజేష్ రాజ్‌భర్ అనే పార్టీ కార్యకర్త ముందుగా ఆయనకు దండ వేశాడు. ఆయన్ను పొగుడుతూనే మహేంద్ర రాజ్‌భర్ చెంపలపై కొట్టాడు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ దాడి అనంతరం మహేంద్ర రాజ్‌భర్ వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయి జలాల్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో బ్రిజేష్ రాజ్‌భర్‌పై ఫిర్యాదు చేశారు. దాడి వెనుక ఉత్తరప్రదేశ్ కేబినెట్ మంత్రి సుహెల్‌దేవ్, భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) అధ్యక్షుడు ఓం ప్రకాశ్ రాజ్‌భర్ హస్తం ఉందని ఆయన ఆరోపించారు. బ్రిజేష్ నాలుగు, ఐదు రోజుల క్రితం ఓం ప్రకాశ్ రాజ్‌భర్‌ను కలిశాడు. ఆయన ఆదేశాలతోనే ఈ దాడి జరిగిందని మహేంద్ర రాజ్‌భర్ విలేకరులతో చెప్పారు. బ్రిజేష్ గతంలో తన పార్టీలో కార్యకర్తగా ఉండేవాడని, ప్రస్తుతం అతనికి ఎలాంటి పదవి లేదని, అతడిని ఎవరు కార్యక్రమానికి ఆహ్వానించారో కూడా తనకు తెలియదని తెలిపారు. పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలుగానీ, ఆర్థికపరమైన వివాదాలుగానీ లేవని ఆయన స్పష్టం చేశారు. గతంలో మహేంద్ర రాజ్‌భర్, ఓం ప్రకాశ్ రాజ్‌భర్‌కు చెందిన ఎస్‌బీఎస్‌పీలో జాతీయ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. పార్టీ సిద్ధాంతాల నుంచి ఓం ప్రకాశ్ రాజ్‌భర్ వైదొలిగి, వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తూ 2022 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన సొంతంగా సుహెల్‌దేవ్ స్వాభిమాన్ పార్టీని స్థాపించారు. మహేంద్ర రాజ్‌భర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, వైరల్ అవుతున్న వీడియో ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు జలాల్‌పూర్ ఎస్‌హెచ్‌ఓ త్రివేణి సింగ్ తెలిపారు. ఓం ప్రకాశ్ రాజ్‌భర్ లేదా ఎస్‌బీఎస్‌పీ నుంచి ఈ ఆరోపణలపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా, ఈ దాడి ఘటనపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. ఇది పీడీఏ' అంటే వెనుకబడిన తరగతులు, దళితులు, అల్పసంఖ్యాక్ మైనారిటీలపై జరుగుతున్న దాడులు, అవమానాలకు మరో నిదర్శనమని, దీని వెనుక బీజేపీ హస్తం ఉందని ఆయన ఆరోపించారు.



# ప్రారంభమైన అంగన్‌వాడీ కేంద్రాలు

## పిల్లలకు ఘన స్వాగతం పలికిన సిబ్బంది, లంచ్‌లో ఎగ్‌బిర్యాని వడ్డించిన నిర్వాహకులు

**హైదరాబాద్ జూన్ 14 ప్రభాతవార్త:** వేసవి సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాలు బుధవారం తిరిగి ప్రారంభమయ్యాయి. అమ్మ మాట అంగన్వాడి బాట బ్యానర్లతో ర్యాలీలు నిర్వహించి అంగన్వాడి కేంద్రాల వద్ద చిన్నారులకు అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు స్వాగతం పలికారు. మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రారంభ దినం సందర్భంగా ప్రత్యేకంగా ఎగ్‌బిర్యాని లంచ్‌లో వడ్డించారు. తెలంగాణ చరిత్రలో తొలిసారిగా అంగన్వాడి కేంద్రాల్లో వెరైటీ ఫుడ్‌గా ఎగ్ బిర్యానీ వడ్డించడం గమనార్హం. ప్రతి రోజు ఒకే రకమైన భోజనం కాకుండా చిన్నారుల అభిరుచులకు అనుగుణంగా ఆహారంలో మార్పులు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. వీలైన చోట్ల చిన్నారులకు వెరైటీ ఫుడ్ అందించేందుకు మహిళా శిశుసంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ తరహా పోషకాహారం అందించడం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో అడ్మిషన్లు, హాజరు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. టేస్ట్, న్యూట్రిషన్ రెండింటినీ సమపాళ్లలో అందిస్తూ అంగన్వాడీలపై పిల్లలు, తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతుందన్న విశ్వాసంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్ రెడ్డి, సభ్యులు పదుల సంఖ్యలో అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. అందిస్తున్న ఆహారం, విద్యా సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్వాడీల బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యలను స్వయంగా పరిశీలించిన కమిషన్ హర్షం వ్యక్తం చేసింది. హైదరాబాదులోని సైదాబాద్‌లో గల సింగరేణి కాలనీలో అంగన్వాడి కేంద్రంలో వడ్డించిన ఎగ్ బిర్యానీనీ చిన్నారులు ఎంజాయ్ చేశారు.

చిన్నారుల అభిరుచి మేరకు మంత్రి సీతక్క ఆదేశానుసారం మొదటిరోజు ఎగ్ బిర్యానీ వడ్డించినట్లు అంగన్వాడీ టీచర్ అన్నపూర్ణ తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో అంగన్వాడి కేంద్రాల బలోపేతం కోసం తమ వంతు కృషి చేస్తామని వెల్లడించారు. అయితే ఉత్తరాది రాష్ట్రాల్లో అంగన్వాడి కేంద్రాల్లో కనీసం కోడిగుడ్లను కూడా ఇవ్వటం లేదు. అలాంటిది తెలంగాణలో ఏకంగా అంగన్వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యాని వడ్డించడం విశేషం.

# మహోద్యమంలా వనమహోత్సవం నిర్వహించాలి

## పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ జూన్ 11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టదలిచిన వనమహోత్సవం కార్యక్రమాన్ని ఫారెస్టు డిపార్టుమెంటు అధికారులు మహోద్యమంలా తీసుకొని ముందుకు వెళ్ళాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. వృక్షో రక్షిత రక్షితః నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవం-2025 పోస్టరు బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది తలపెట్టబోయే వనమహోత్సవ కార్యక్రమం 100శాతం విజయవంతమయ్యేలా చూడాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పండ్ల మొక్కలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాల్లో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని సూచించారు. 2024 సంవత్సరం డిపార్టుమెంటువారీగా, డిస్టిక్ వారీగా రాష్ట్రవ్యాప్తంగా20.02కోట్ల మొక్కలు నాటాలని ప్రణాళికలు వేసుకోగా 19.04 కోట్లు నాటినట్టు మంత్రి సురేఖ గుర్తు చేశారు. 95 శాతం మేరకు అంచనాలు అందుకున్నట్లు వెల్లడించారు. ఈ సారి 100 శాతం మనం పెట్టుకున్న టార్గెట్ రీచ్ కావాలన్నారు. ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతీ ఇంటికి మొక్కలు ఇచ్చి నాటేందుకు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రజలు అడిగిన మొక్కలను అందజేయడానికి అధికారులు సిద్దంగా ఉండాలన్నారు. గతం కంటే ఈసారి మాన్ సూన్ ముందే వచ్చిందని. ఈ నేపథ్యంలో అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏ ఏరియాలో ఎటువంటి చెట్లు నాటాలో గుర్తించి ఆ విధంగా ముందుకు వెళ్ళాలని మంత్రి సూచించారు. ఈ దఫా వనమహోత్సవంలో ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలు నాటించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారికి గుర్తించి ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అటవీ ప్రధాన సంరక్షిణాధికారిణి డాక్టర్ సువర్ణ, సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్, సోషల్ ఫారెస్టు రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిలో ఉంటూ బిసిలను మోసగిస్తున్న ఆర్ కృష్ణయ్య

## మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్

**హైదరాబాద్,జూన్11,ప్రభాతవార్త:** లోకల్ బాడీ ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలి, లేదంటే గాంధీ భవన్‌ను ముట్టడి చేస్తాం ధర్నా చేస్తాం అంటున్న ఆర్. కృష్ణయ్య తెలంగాణ ప్రభుత్వం జారీ చేయబోయే జివోను కోర్టు కొట్టేస్తే ఆబిల్లును 9వ షెడ్యూల్‌లో పెట్టించగలడా అని మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆర్ కృష్ణయ్య బిజెపిలోఉండి బిసిలను మోసం చేయాలని చూస్తుండు అందుకే రిజర్వేషన్ పై ప్రత్యేక జివో విడుదల అంటూ కపట వ్యాఖ్యలు చేస్తుండనీ ఆరోపించారు. 40ఏండ్ల నుండి బిసిల రిజర్వేషన్ కోసం పోరాడి ఎందుకు రిజర్వేషన్ సాధించలేదని ప్రశ్నించారు. బిసిలకు దామాషా ప్రకారం హక్కులను కల్పించాలని రాహుల్ గాంధీ కేంద్రప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చిండని తెలిపారు. రాహుల్ గాంధీ ఒత్తిడి వలనే కేంద్రంలో బిజెపి కులగణన చేస్తున్నదని ఆర్ కృష్ణయ్య ఒప్పుకోవాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు పెట్టింది ఆర్ కృష్ణయ్యకు చిత్త శుద్ధి ఉంటే బిజెపి ఎంపీగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి బిల్లును 9వ షెడ్యూల్‌లో పెట్టించాలి, లేదంటే కాంగ్రెస్‌పై విమర్శలు మానుకోవాలి, లేదంటే కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేస్తాం అని హెచ్చరించారు. 1992లో ఇంద్ర సహని వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో 50 శాతం దాటకూడదని ఒక పరిమితి విధించారని గుర్తు చేశారు. 2006లో నాగరాజు కేసులో ప్రమోషన్స్‌కుకూడా 50శాతం మించకూడదని చెప్పారు. ఎన్‌టిఆర్ హాయంలో 32శాతం రిజర్వేషన్ ఉంది. సిఎంరేవంత్ రెడ్డి కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తుండని తెలిపారు.

# కెసిఆర్ వన్ టూ వన్ ఎందుకు మాట్లాడారో కెటిఆర్ సమాధానం చెప్పాలి

## కక్ష సాధింపుకోసం కాదు, కాళేశ్వరం కూలడం వల్లే కమిషన్ ఏర్పాటు: ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి

**హైదరాబాద్,జూన్11,ప్రభాతవార్త:** కాళేశ్వరం వైఫల్యంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ముందు ఇన్‌కెమెరా విచారణలో సమాధానం చెప్తానని కెసిఆర్ ఎందుకు అన్నారనీ వన్‌టూవన్ మాట్లాడాల్సిన అవసరం ఎందుకొచ్చిందో కేటీఆర్ చెప్పాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గాంధీభవన్‌లో విలేఖరుతో మాట్లాడుతూ ఇప్పటి వరకు విచారణకు వచ్చిన అందరూ కమిషన్ ముందు ఓపెన్ కోర్టులో సమాధానాలు చెప్పారని గుర్తుచేశారు. కమిషన్ ముందు కెసిఆర్ హాజరు కావడాన్ని కెటిఆర్ జీర్ణించుకోలేక ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని చామల మండిపడ్డారు. అసలు ప్రభుత్వానికి కుట్ర చేయాల్సిన అవసరం లేదని కిరణ్ వివరించారు. కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తే, కొత్త రాష్ట్రంను కెసిఆర్ కుటుంబం అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. కెసిఆర్ కట్టిన ప్రాజెక్టు చైనాలో కట్టి ఉంటే ఉన్నతమైన అవార్డు వచ్చేదని కెటిఆర్ అనడం హాస్యాస్పదమని చైనాలో ఇలాంటి ప్రాజెక్టు కేసీఆర్ కట్టి ఉంటే ఈరోజు ఆయన్ను ఉరి తీసేవారని వ్యాఖ్యలు చేశారు. రూ. 30 వేల కోట్లు అయ్యే ప్రాజెక్టుకు లక్ష కోట్లు ఖర్చు చేశారన్నారు. కెసిఆర్‌కు ఏ దేశంలో అత్యున్నత అవార్డు ఇస్తారో చెప్పాలన్నారు. ఐకెపి సెంటర్లో గతంలో కంటే ఈసారి వడ్లు ఎక్కువగా కొనుగోలు చేశామన్నారు. కెసిఆర్ హాయాంలో ఎప్పుడు సన్న బియ్యం తినిపించలేదన్నారు. అధికారం కోల్పోయిన బాధ బిఆర్ఎస్ నేతల్లో ఉందన్నారు. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు 'మీ ఇంట్లో మీరు మీరు పంచాయతీలు పెట్టుకున్నట్టు డ్రామా' చేశారని మండిపడ్డారు. ప్రజలను డైవర్షన్ చేసే విధంగా వ్యవహరిస్తున్నారని చామల విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పరిపాలించి కట్టిన ప్రాజెక్టు కూలిపోయిందన్నారు. నిజాం సాగర్, కడియం ప్రాజెక్ట్, లోయర్ మానేరు, సింగూర్ డ్యాం కాంగ్రెస్ హయాంలో కట్టాం ఎక్కడ కూలిపోలేదని చామల తెలిపారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## రాష్ట్ర లీగల్‌సెల్ అథార్టీ కార్యదర్శి పంచాక్షరి

**హైదరాబాద్ జూన్ 11 ప్రభాతవార్త:** జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ స్టేట్ లీగల్ సెల్ అథార్టీ కార్యదర్శి సిహెచ్ పంచాక్షరి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 14న జరిగేజాతీయ లోక్ అదాలత్ తెలంగాణలోని కోర్టుల సముదాయంలో కూడా జరుగుతుందని తెలిపారు. ప్రజలు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెండింగ్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. యాక్సిడెంట్ కేసులు, కొట్టుకుని ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నవి, చీటింగ్, చిట్‌ఫండ్, చిన్న చిన్న దొంగతనాలు, అక్రమరవాణా, పేకాట, డ్రంకన్ డ్రైవ్ తదితర చిన్న చిన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

# గాంధీభవన్‌లో 109 అర్జీల స్వీకరణ

## మంత్రులతో ముఖాముఖిలో పాల్గొన్న కొండా సురేఖ



బుధవారంగాంధీభవన్‌లో ప్రజలనుంచి అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్,జూన్11,ప్రభాతవార్త:** తెలంగాణలో సంక్షేమ ప్రజాప్రభుత్వం పాలిస్తోందని పేద ప్రజలకు గౌరవప్రదమైనజీవనం కల్పించాలనే తపనతోనే రేషన్‌కార్డులు, సన్నబియ్యం వంటి విప్లవాత్మక పథకాలు ప్రవేశపెట్టామని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ పాల్గొన్నారు. టిపిసిసి అధ్యక్షులు ప్రవేశపెట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా పాల్గొనడం జరిగిందని 109కి ప్రజల నుంచి వినతులు స్వీకరించామని ఆమె తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వినతులు అధికంగా వచ్చాయని వివరించారు. ప్రజల సమస్యలను ఆయా శాఖల అధికారులతో చర్చించి వెంటనే కొన్ని సమస్యలను పరిష్కారానికి మంత్రికృషి చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేవంత్ రెడ్డి, మంత్రులపై నమ్మకంతో ప్రజలు పెద్ద ఎత్తున గాంధీ భవన్‌కి తరలివచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ పునర్నిర్మాణం కోసం అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రం గట్టెక్కించడానికి అహర్నిశలు పనిచేస్తున్నారని అన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు కోసం ఎంతగానో శ్రమిస్తున్నారని వివరించారు. తనకు వచ్చిన అన్ని వినతులను పరిశీలించి తగిన పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# సాహిత్యం లేకుండా ఏ చారిత్రక ఉద్యమం లేదు

## తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

### వైభవంగా సారస్వత పరిషత్తు రాష్ట్రస్థాయి ఉత్తమగ్రంథ, వరిష్ఠ పురస్కారాల ప్రదానోత్సవం



పురస్కార గ్రహీతలతో సుఖేందర్‌రెడ్డి, శివారెడ్డి, రామారావు, రామమూర్తి తదితర అతిథులు

**హైదరాబాద్(నాంపల్లి), జూన్ 11 ప్రభాతవార్త :** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, ఆనాడు నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం, నేడు తెలంగాణ రాష్ట్ర సిద్ధించినా వాటి వెనుక కీలకభూమిక పోషించినవి సాహిత్యం, గ్రంథాలయాలు, పాటలు, కళలేనని ఇవిలేకుండా ఏ చరిత్ర, ఉద్యమం, విప్లవం లేదని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అయితే రోజురోజుకు కళా, సాహిత్యరంగాల్లో రాసేవారున్నా నేడు పాఠకులు, ప్రేక్షకులు తక్కువయ్యారని ఆవేదన వ్యక్తపరిచారు. సమాజంలో వచ్చిన ఇలాంటి మార్పులను ముఖ్యంగా రచయిత్రులు సాహిత్యం, విశ్లేషణల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. బుల్లెట్‌కన్నా కలం పోటు చాలా శక్తివంతమై కీలకపాత్ర పోషిస్తుందని, మనిషిలో మార్పుతెచ్చే ప్రభావం చూపిస్తుందని చెప్పారు.

తతగత 82 ఏళ్లుగా ఎంతోమంది సారస్వత పెద్దలు తెలుగుభాషను ఇతోధికంగా పోషించడం వల్లనే నేటికీ తెలుగు బతుకుతూనే ఉందని, కాని నేటి మనపిల్లలకు తెలుగు బలవంతంగా నేర్పించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాద్ ఆధ్వర్యంలో బొగ్గులకుంట సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో పరిషత్తు అధ్యక్షుడు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కార్యక్రమ సమన్వయకర్త, తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవావిభాగం ఇన్‌చార్జి, పరిషత్తు కార్యవర్గ సభ్యుడు రింగు రామమూర్తి, కోశాధికారి మంత్రి రామారావు తదితరులతో కలిసి వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథ రచయితలు డా. కాంచనపల్లి గోవర్ధనరాజు, ఉదారి నారాయణ, డా. రామచంద్రమౌళి, డా. కాలువ మల్లయ్య, డా. సంగిశెట్టి శ్రీనివాస్, డా. సంగనభట్ల నర్సయ్య, డా. అమరవాది నీరజలను ఘనంగా ఉత్తమ గ్రంథ పురస్కారాలు; రంగరాజు పద్మజ, ఎలనాగ (నాగరాజు సురేంద్ర), డా. ఎన్.ఆర్. వెంకటేశం, రూప్‌కు మార్ డబ్బీకార్‌లను ఘనంగా సన్మానించి వరిష్ఠ పురస్కారాలను, పురస్కారంతోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, 20వేల నగదు బహుమతి ప్రదానంచేసి శుభాభి నందనలు తెలిపారు. రింగురామమూర్తి పురస్కార గ్రహీత సంపూర్ణ పరిచయం కావించారు.

# ఎస్ఎల్‌బిసి టన్నెల్ డిఫెన్స్ సహకారంతో పూర్తిచేస్తాం

## నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**హైదరబాద్, జూన్ 11,ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి టన్నెల్ తవ్వకం కోసం డిఫెన్స్ మినిస్ట్రీ సహాయం తీసుకొని వేగవంతంగా పనులు చేపడుతామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం రక్షణశాఖ అధికారులతో సమావేశమైనారు. ఆర్మీ, ఎఐఎఫ్ అధికారులు శ్రీశైలం టన్నెల్ తవ్వకంకు సహాకారం అందించేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. టన్నెల్ పూర్తి అయితే మూడు లక్షల ఎకరాల ఆయకట్టు కొత్తగా వస్తుందని ఆర్మీ అధికారులకు తెలిపారు. శ్రీశైలంలో పులుల సంరక్షణ కేంద్రం ఉండటంతో హెలికాప్టర్ ద్వారా సర్వేచేయాలని డెన్మార్క్ ఎలక్ట్రో మాగ్నటిక్ డివైస్‌లతో టన్నెల్ పరిస్థితి తెలుసుకోవాలని ఆయన సూచించారు. అదే విధంగా టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఆపరేషన్ వేగవంతం చేయడానికి అదనపు సహాయం కోసం మంత్రి ఉత్తమ్ కోరారు.

# కెటిఆర్ భాష విని వీధి రౌడీలు కూడా సిగ్గుపడతారు..

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కౌంటర్

**హైదరబాద్,జూన్11,ప్రభాతవార్త:** కెటిఆర్ రంకెలు వేస్తూ సిఎం రేవంత్‌రెడ్డిని పరుష పదజాలంతో మాట్లాడుతున్నాడు, ఆయన భాష విని వీధి రౌడీలు కూడా సిగ్గుపడతారనీ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కౌంటర్ ఇచ్చారు. బుధవారం సిఎల్పీ మీడియా హాల్లో ఆయన మాట్లాడుతూ అమెరికాలో చదివి, ఉద్యోగం చేసి వచ్చిన కెటీఆర్ భాషవిని తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. కెటిఆర్ భాష వింటే అమెరికాలో బాత్రూంలు కడిగి వచ్చినట్లు ఉందని విమర్శలు చేశారు. కెసిఆర్ తప్పు చేశాడు కాబట్టే కాళేశ్వరం కమిషన్ ఆయనను విచారణకు పిలిచిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నో ప్రాజెక్టులు కట్టినా ఏనాడు ఇలా విచారణ కమిషన్ల ముందుకు వెళ్లలేదన్నారు. కెసిఆర్ విచారణ సమయంలో బిఆర్ఎస్ నాయకులు వీధుల్లో పిచ్చి కుక్కల్లా స్వైర విహారం చేశారని ఆరోపించారు. హడావుడి చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు మేడిగడ్డ బ్యారేజీలో ఎందుకు నెర్రెలు వచ్చాయో సమాధానం చెప్పడం లేదని ఎద్దేవా చేశారు. సుందిళ్లలో సిపేజీ ఎందుకు వచ్చిందో మాట్లాడటం లేదని అన్నారు. డిపిఆర్‌లో చెప్పినట్లు కాకుండా 5 కిలో మీటర్ల దూరంలోఎందుకు బ్యారేజీలు నిర్మించారో సమాధానం చెప్పడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి బయటపడు తుందనే బిఆర్ఎస్ నాయకులు గగ్గోలు పెడుతున్నారని ఆరోపించారు. కక్ష సాధింపులు, రాజకీయ వేధింపులకు ముఖ్యమంత్రి పాల్పడటంలేదు. అవి అమలు చేస్తే రాష్ట్రంలో ఒక్క బిఆర్ఎస్‌నాయకుడు కూడా రోడ్ల పైకిరారని ఆయన వివరించారు. డ్రోన్ కేసులో 14రోజులు రేవంత్ రెడ్డి జైలులో పెట్టింది మీరని గతంను గుర్తు చేసుకున్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత లేకుండా చర్యలు

## సిఎం ఆదేశాలతో ప్రత్యేక మార్గదర్శకాలు

## ఎమ్మార్వో కార్యాలయాల్లో ప్రత్యేక టోకెన్లు

**హైదరాబాద్, జూన్ 11 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొదటి, రెండో దశలకు కలిపి 112 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమని సర్కార్ అంచనా వేస్తోంది. ఈ మేరకు ఒక్కో లబ్ధిదారుడికి 25 క్యూబిక్ మీటర్ల ఇసుకను నాలుగు విడతల్లో అందించనున్నారు. ఎమ్మార్వో కార్యాలయంలో టోకెన్లు పొంది లబ్ధిదారులే ఇసుకను తరలించుకోవాల్సి ఉంటుంది. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని, పక్క జిల్లాల నుంచి ఇసుక సరఫరాకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం అమలవుతోంది. 2వ దశ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరడంతో ప్రభుత్వం నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించింది. సిఎం ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత లేకుండా చూడాలని, అక్రమ సరఫరాను కఠినంగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. రెండో విడతలో ప్రభుత్వం ఇప్పటికే 2.28 లక్షల మంది లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసింది. రెండో విడత పనులు ప్రారంభమైతే గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 44 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తక్షణమే అవసరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇసుక అందుబాటులో లేని జిల్లాలకు పక్క జిల్లాల నుంచి సరఫరా చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు ఇసుక సరఫరా చేసే ప్రాంతాల జాబితాను అధికారులు రూపొందించారు. **ఉమ్మడి ఆదిలాబాద్:** మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల నుంచి, **ఉమ్మడి ఖమ్మం :** భద్రాద్రి కొత్తగూడెం, స్థానిక వాగుల నుంచి, **ఉమ్మడి వరంగల్:** జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, నల్గొండ జిల్లాల నుంచి, **ఉమ్మడి నిజామాబాద్:** రాజన్న సిరిసిల్ల, స్థానిక వాగులు, నిజామాబాద్ జిల్లాల నుంచి, **ఉమ్మడి కరీంనగర్:** రాజన్న సిరిసిల్ల, స్థానిక వాగుల నుంచి, **ఉమ్మడి మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్, స్థానిక వాగుల నుంచి, **ఉమ్మడి మెదక్:** కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి, **ఉమ్మడి నల్గొండ:** నల్గొండ, సూర్యాపేట, స్థానిక వాగుల నుంచి, రంగారెడ్డి: మహబూబ్‌నగర్, నల్గొండ, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి ఇసుకను తరలించనున్నారు.

స్థానికంగా ఇసుక కొరత ఏర్పడితే తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరే షన్ (టిజిఎండిసి) రీచ్‌ల నుంచి ఇసుకను తరలించుకునే వెసులు బాటును కూడా ప్రభుత్వం కల్పించింది. ఈ చర్యలన్నీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నిరాటంకంగా సాగేలా, లబ్ధిదారులకు సకాలంలో ఇళ్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేస్తున్నాయి.

# నాణ్యమైన వరి విత్తులు ఎంపిక చేయాలి

## వరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** అధిక దిగుబడులు ఇచ్చేందుకు రైతులు నాణ్యమైన వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ దామోదర్‌రాజు సూచించారు. రాష్ట్రంలో వరి సాగుకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈసారి వరి రైతులు అధిక దిగుబడుల కోసం నాణ్యమైన దొడ్డు, సన్న, అతిసన్న రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎంపీ 1010కు ప్రత్యామ్నాయంగా కేఎన్ ఎం 118, ఆర్ఎన్ఆర్ 29325, ఆర్ఎన్ఆర్ 28361, డబ్ల్యూజీఎల్ 1355, డ బ్ల్యూజీఎల్ 915, జేజీఎల్ 28639, బీపీటీ సన్న రకాలకు బదులుగా ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733, 44 సిద్ధి, డబ్ల్యూజీఎల్ 962, ఆర్‌డీఆర్ 1200, ఆర్ఎన్ఆర్ 21278, జేజీఎల్ 28545, కేబీఎస్ 6251, కేబీఎస్ 2874, డబ్ల్యూజీఎల్ 1246, జేజీఎల్ 33124, హెచ్ఎంటీ సోనా జైశ్రీరామ్‌కు ప్రత్యామ్నాయంగా 15048 కేఎన్ఎం 733, ఆర్‌డీఆర్ 1162 27356 ఆర్ఎన్ఆర్ 31479 రకాలను వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎంపిక చేసినట్టు వివరించారు. ఈ విత్తనాలు రాజేంద్రనగర్‌లోని ప్రధాన వ్యవసాయ కేంద్రంతో పాటు, రాష్ట్రంలోని ఉప కేంద్రాల్లోనూ అందుబాటులో ఉన్నట్టు చెప్పారు.

# సింగరేణి కార్మికులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా

## పంజాబ్ బ్యాంక్‌తో ఒప్పందం: సంస్థ సిఎండి బలరామ్

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** సింగరేణి కార్మికులకు 1.25 కోట్ల రూపాయల ప్రమాద బీమాను అమలు చేయాలని సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి పంజాబ్ నేషనల్ బ్యాంకుతో బుధవారం సింగరేణి సంస్థ ఒప్పందం చేసుకుంది. దీన్ని పురస్కరించుకుని సింగరేణి సిఎండి ఎన్ బలరామ్ వెల్లడించారు. ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందినప్పుడు కంపెనీ ఇస్తున్న సహాయం కొంత ఉన్నప్పటికీ వారి కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో బ్యాంకులతో మాట్లాడి ఈ తరహా ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అమలవుతున్న పథకాల వల్ల కార్మికుల కుటుంబాలకు గట్టి ఆర్థిక భరోసా లభించిందని అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కూడా మిగిలిన బ్యాంకుల అన్నిటికన్నా ఎక్కువగా కోటి 25 లక్షల రూపాయల బీమా పథకాన్ని అమలు చేయడానికి ముందుకు రావడం, అలాగే సాధారణ మరణం సంభవించిన వారికి 10 లక్షల రూపాయల టర్మ్ ఇన్సూరెన్స్ ను కూడా అమలు చేయనుందని వివరించారు. ఇదే బ్యాంకు ద్వారా సింగరేణి పొరుగు సేవల ఉద్యోగుల కోసం 40 లక్షల రూపాయల ప్రమాద బీమా ఒప్పందాన్ని కూడా అమలు చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలను పెద్ద ఎత్తున చేపడుతోందని సోలార్ విద్యుత్తు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎలక్ట్రిసిటీ తదితర రంగాలలోకి ప్రవేశిస్తుందనీ, ఈ నేపథ్యంలో బ్యాంకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ముందుకు పోతుందని పేర్కొన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈవో అశోక్ చంద్ర మాట్లాడుతూ సింగరేణి సంస్థతో తాము కుదుర్చుకున్న ఈ ఒప్పందం ఇతరులకు కూడా ఆదర్శప్రాయమని అన్నారు.

ఈ పథకం నేటి నుండి సింగరేణి ఉద్యోగులకు అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ తరహా ఒప్పందాలను ఇతర శాఖలకు కూడా విస్తరించనున్నమని తెలియజేశారు. సింగరేణి వ్యాపార విస్తరణ ప్రాజెక్ట్ లకు తమ తరఫున పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి సూర్యనారాయణ, ఇడి ఎస్.డి.ఎం.సుభాని, పంజాబ్ నేషనల్ బ్యాంక్ హైదరాబాద్ రీజినల్ చీఫ్ జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ చుగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# లక్ష్యానికన్నా తక్కువ ఎరువులు, నకిలీ, కల్తీ విత్తనాలపై 46 కేసులు

## వ్యవసాయ మంత్రి తుమ్మల



**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** లక్ష్యాల కన్నా, తక్కువ ఎరువులను సరఫరా చేసిన కంపెనీల వైఖరిపై వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్కువగా సరఫరా చేసిన ఎరువులను జులై లోగా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. అలాగే ఇప్పటి వరకూ రాష్ట్రంలో నకిలీ, కల్తీ విత్తనాలకు సంబంధించి 46 కేసులు పెట్టినట్లు చెప్పారు. హైదరాబాద్ సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడతూ ఏప్రిల్‌లో 1.70 లక్షల టన్నుల ఎరువులకు 1.22 లక్షల టన్నులు, మేలో 1.60 లక్షల టన్నులకు 87 వేల టన్నులు మాత్రమే సరఫరా చేయడంపై కంపెనీ ప్రతినిధులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెలకు కేటాయించిన 1.70 లక్షల టన్నులతో పాటు, ఇప్పటివరకు తక్కువగా సరఫరా చేసిన 1.21 లక్షల టన్నుల ఎరువులను జూలై నెలలోగా సరఫరా చేయాలని తేల్చిచెప్పారు. అప్పటి కూడా ఎరువులను సరఫరా చేయని పక్షంలో అటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి జిల్లాలోను కేవలం ఈ నెలకు సరిపడ ఎరువులనే కాకుండా, వచ్చే నెలకు సరిపడ ఎరువులను కూడా ముందస్తుగానే జిల్లా కేంద్రంలో నిల్వఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోజువారి కొనుగోళ్లను కూడా నిరంతరం పర్యవేక్షించాలని వెల్లడించారు. ఒకవేళ డీలర్లు ద్వారా అమ్మకాలు జరపకపోతే వారికి ఎరువులు సరఫరా చేసే కంపెనీలపై వెంటనే చర్యలు తీసుకోవల్సిందిగా ఆదేశించారు. కాగా ల్తీ విత్తనాలకు సంబంధించి ఇప్పటికే 13 జిల్లాలలో 46 కేసులు పెట్టి 111 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. వారి నుండి 323.2 క్వింటాళ్ల కల్తీ విత్తనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. కల్తీ విత్తనాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా సీడ్ ఉత్పత్తి చేసే కంపెనీలను కూడా విత్తన చట్టం పరిధిలోకి తెచ్చి రైతులు నష్టపోయిన సందర్భాలలో ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోపు సీడ్ యాక్ట్ ముసా యిదా సిద్ధం చేయాల్సిందిగా సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘు నందన్‌రావు, డైరెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఎసిబి సోదాలు

## నీటిపారుదల శాఖ ఇంజినీర్ నూనె శ్రీధర్ ఇళ్లలో తనిఖీలు



**కరీంనగర్ క్రైమ్,ప్రభాతవార్త:** నీటిపారుదల శాఖ ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) నూనె శ్రీధర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు భారీ స్థాయిలో సోదాలు నిర్వహించారు. బుధవారం ఏకకాలంలో 12 చోట్ల శ్రీధర్‌కు సంబంధించిన నివాసాలు, బంధువుల ఇళ్లపై దాడులు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్ లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాలు హైదరాబాద్, కరీంనగర్, సిద్దిపేట ప్రాంతాల్లో కొనసాగాయి. శ్రీధర్ ప్రస్తుతం ఎస్ఆర్ఎస్‌పి (శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్) పరిధిలో డివిజన్8లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బుధవారం కరీంనగర్ లోని భాగ్యనగర్ లోని సాయిబాబా టెంపుల్ సమీపంలో, ఆర్టీసీ వర్క్‌షాప్ ఎదురుగా ఉన్న వీధిలోని శ్రీధర్ నివాసంలోనూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఏసీబీ సోదాలు కొనసాగుతుండగా, పూర్తి సమాచారం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్న విద్యార్థులు!

## ప్రవేశ పరీక్షల మూలంగా భయం, ఒత్తిడికి గురి
## పరీక్షల్లో ఫెయిలవుతామనే భయంతో కొందరు, పరీక్షలకు ముందే మరికొందరు ఆత్మహత్యలు

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** ప్రవేశ పరీక్షలు, వార్షిక పరీక్షల మూలంగా విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా పోటీ పరీక్షల్లో తాము నెగ్గుకురాలేమనే భయంతో పరీక్షలకు ముందుగానే కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండగా.. మరికొందరు పరీక్షలు పూర్తయిన తరువాత ఆత్మహత్య చేసుకుంటున్నారు. పోటీ పరీక్షల భయంతోనే కాకుండా సాధారణంగా టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 10వ తరగతిలో పాస్ కాకపోతే ఇంట్లో తల్లిదండ్రులు తిడతారనే భయంతోపాటు.. తోటి మిత్రుల దగ్గర అబాసుపాలవుతామనే భయంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇంటర్మీడియట్ చదివే విద్యార్థుల్లో ఇటువంటి ఆత్మహత్యల సంఖ్య కొంత ఎక్కువగానే ఉంటుంది. ఇంటర్ వార్షిక పరీక్షల కంటే ముందే ఒకరిద్దరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పరీక్షల తరువాత ఫెయిలవుతామని భయంతో కొందరు.. ఫలితాలు వెలువడిన తరువాత ఫెయిలైనందుకు బాధతో మరికొందరు బలవంతంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అయితే ఈ మధ్య కాలంలో గత రెండు, మూడు సంవత్సరాలుగా తెలంగాణలో ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరై ఫలితాలు వెలువడక ముందే తాము ఫెయిలవుతామనే భయంతో చనిపోయిన వారిలో కొందరు విద్యార్థులు పాసైన సందర్భాలున్నాయి. విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడానికి ఒత్తిడితోపాటు తల్లిదండ్రులు తిడతారనే భయం కూడా ఉంటుంది. మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్ సీటు కోసం నిర్వహించే నీట్, ఐఐటీల్లో సీటు కోసం నిర్వహించే జెఇఇ పోటీ పరీక్షల్లోనూ నెగ్గలేమని భయంతోపాటు తీవ్ర మానసిక ఒత్తిడితో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా నీట్, జెఇఇలో సీట్ల కోసం ఏడాదిపాటు లాంగ్‌టర్మ్ పేరుతో రెసిడెన్షియల్ కోచింగ్ తీసుకుంటున్నారు విద్యార్థులు. ఇలా తీసుకునే వారిలో రెండు రకాల వారుంటున్నారు. ఒకటి విద్యార్థులు తామే నిర్ణయించుకుని లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకునే వారు కొందరైతే.. విద్యార్థుల తల్లిదండ్రుల బలవంతం మీద కోచింగ్ తీసుకునే వారు కొందరుంటున్నారు. ఇలా విద్యార్థుల తల్లిదండ్రుల బలవంతం మీద కోచింగ్ తీసుకునే వారిలోనే ఎక్కువ మంది బలవన్మరణానికి పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ప్రధానంగా రాజస్థాన్‌లోని కోటా నగరంలో నీట్‌కి కోచింగ్ ఇచ్చే సెంటర్లు ఎక్కువగా ఉన్నాయి. వాటిల్లో వేల సంఖ్యలో విద్యార్థులు కోచింగ్ తీసుకుంటున్నారు. ఇక్కడ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థుల్లో ఏడాదికి కనీసం 15 నుంచి 20 మంది వరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఇక్కడ జరిగిన ఆత్మహత్యలపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అలా కేసులు నమోదు చేస్తున్నవే సుమారు 20 వరకు ఉంటున్నాయి. 2024 మే నుంచి 2025 మే వరకు సుమారు 24 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. వీరిలో 90 శాతం మంది విద్యార్థులు పోటీ పరీక్షలను తట్టుకోలేక తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలే ఉన్నాయి. ప్రస్తుత విద్యా వ్యవస్థ కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి సమస్యను పరిష్కరించాలంటే... వారికి పాఠశాల స్థాయిలోనే కెరీర్ గైడెన్స్, నైపుణ్యాలపై కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు, మానసిక నిపుణులు చెబుతున్నారు. పోటీ వాతావరణం, పరీక్షల్లో మార్కులనే ప్రతిభకు కొలమానంగా భావించడం, ఇతరులతో పోల్చుకోవడం వంటి పలు కారణాలతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని వారు చెబుతున్నారు. దానిమూలంగా విద్యార్థుల మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటోందని, ఈ కారణంగానే ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారని అంటున్నారు. ఈ సమస్యలకు పాఠశాల స్థాయి నుంచే పరిష్కారం చూపాలని చెబుతున్నారు.

విద్యార్థుల మానసిక ఒత్తిడికి పలు కారణాలున్నాయంటున్నారు. విద్యార్థుల్లో నెలకొంటున్న మానసిక ఒత్తిడి సమస్యలు చివరికి వారు ఆత్మహత్యలకు పాల్పడే స్థాయికి చేరుకుంటున్నాయి. 2012లో 6,654గా ఉన్న విద్యార్థుల ఆత్మహత్యలు, 2022 నాటికి 13,044కు చేరాయి. అదికాస్త 2025 నాటికి 14వేలకు చేరుకుంది.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కావడానికి అకడమిక్స్‌తో పాటు మరెన్నో అంశాలు కారకాలుగా నిలుస్తున్నాయి. ఆర్థిక అస్థిరత, వ్యక్తిగత ఆహార్యం, సహచరులు బంధువుల ఒత్తిడి, వైఫల్యం అంటే విపరీతమైన భయం వంటివి వీటిలో ముఖ్యమైనవిగా మానసిక నిపుణులు చెబుతున్నారు. సంపూర్ణ వికాసం కల్పించడం కంటే అత్యున్నత గ్రేడ్లకే విలువనిచ్చే విద్యావ్యవస్థ ఇందుకు మరో ముఖ్యమైన కారణంగా చెబుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు చిన్నతనం నుంచే పిల్లలను వారి సహచరులతో పోల్చడం వల్ల తమ సామర్థ్యంపై అపనమ్మకం ఏర్పడి దీర్ఘకాలిక ఒత్తిడికి గురవుతున్నారని.. దాన్ని గుర్తించకపోవడం వల్ల ఎన్నో ప్రతికూల పరిణామాలు చూడాల్సి వస్తోందంటున్నారు. పలు దేశాలు ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఫిన్‌లాండ్, కెనడా, నెదర్లాండ్స్ తదితర పాశ్చాత్య దేశాల్లో పరీక్షల్లో మార్కుల కంటే .. సామర్థ్య ఆధారిత అభ్యసనానికి ప్రాధాన్యం ఇస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. కౌన్సెలింగ్, మెంటార్ ప్రయోగాలతో కూడిన అభ్యసనం వంటి మార్గాల ద్వారా కెరీర్‌పై విస్తృత అవగాహన కల్పించవచ్చని అంటున్నారు. సక్సెస్ అంటే కేవలం మార్కులే అనే రీతిలో వ్యవహరిస్తుండటంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడి, మానసిక సమస్యల విషయంలో కౌన్సెలింగ్ సత్ఫలితాలను ఇస్తుందంటున్నారు. ప్రధానంగా విద్యార్థులను సవాళ్లను ఎదుర్కొనేలా సంసిద్ధుల్ని చేయాలంటున్నారు. పాఠశాలలు విద్యార్థులకు కేవలం అకడమిక్ అభ్యసన కేంద్రాలుగానే ఉంటున్నాయని.. విద్యార్థుల భావోద్వేగాలను, సామాజిక, మానసిక సమస్యలను తీర్చే ప్రాంగణాలుగా పాఠశాలలను రూపొందించాల్సిన ఆవశ్యకత ఉందంటున్నారు. విద్యార్థులు తరగతి గదిలో, బాహ్య ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా సంసిద్ధులను చేసేందుకు చర్యలు తీసుకోవాలని మానసిక నిపుణులతోపాటు విద్యావేత్తలు చెబుతున్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడి విషయంలో తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని.. పిల్లలు తమ సమస్యలను, ఆలోచనలను తమతో పంచుకునే వాతావరణాన్ని కల్పించాలని సూచిస్తున్నారు. సక్సెస్ అంటే ఒక ప్రతిష్టాత్మక కాలేజీలో చేరడం మాత్రమే కాదని.. వారి పిల్లల బలాలు, ఆకాంక్షలను నెరవేర్చుకునేలావ్యవహరించడంఅని గుర్తించాలంటున్నారు.


# స్పేస్‌ఎక్స్ మిషన్ మళ్లీ వాయిదా..



**న్యూఢిల్లీ,జూన్ 11:** బారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసి యాత్ర మరోసారి వాయిదాపడింది. యాక్జియం-4 మిషన్‌కింద మరో ముగ్గురు వ్యోమగాములతోకలిసి ఆయన నింగిలోకి బుధవారమే వెళ్లాల్సి ఉంది. అయితే సాంకేతిక సమస్యతో యాత్రను వాయిదా వేస్తున్నామని స్పేస్ ఎక్స్ ప్రకటించింది. రాకెట్‌లో లిక్విడ్ ఆక్సిజన్ లీక్ కారణంగా ప్రయోగం వాయిదాపడిందని ఎక్స్‌లో వెల్లడించింది. మరమ్మతులకు సమయం పడుతుందని త్వరలోనే కొత్త లాంచ్‌తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. స్పేస్‌ఎక్స్ వాయిదా అంశాన్ని భారత రోదసి పరిశోధన సంస్థ ఇస్రో కూడా వెల్లడిచేసింది. ప్రయోగానికి ముందు బస్టర్‌టెస్టును చేస్తుండగా సమస్యలను గుర్తించారని, తొలుత లీక్ సమస్యను పరిష్కరించి పరీక్షించిన తర్వాత ప్రయోగం నిర్వహించాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు. తొలుత మంగళవారం జరగాల్సి ఉంది. అంతరిక్ష ప్రయోగకేంద్రం ఉన్న ఫ్లోరిడాలో వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో బుధవారానికి వాయిదా వేసారు. ఇపుడు సాంకేతికసమస్య కారణంగా మళ్లీ వాయిదాపడింది. భూమినుంచి బయలు దేరిన 28 గంటల తర్వాత ఈవ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానం అవుతుంది. శుభాంసు శుక్లా బృందం అక్కడే 14 రోజులపాటు పరిశోధనలు చేస్తుంది. అమెరికా వాణిజ్య అంతరిక్ష సంస్థ యాక్జియం స్పేస్ ఈ మిషన్ నిర్వహిస్తోంది. ఇస్రో, నాసా, ఐరోపా అంతరిక్ష సంస్థలు భాగస్వామ్యంతో ఉంది. ఈ స్పేస్ క్యాప్సూల్‌ను ఫాల్కన్9 రాకెట్ నింగిలోకి మోసుకెళుతోంది. ఇందులోనే శుభాంశు మిషన్ పైలట్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# జర్నలిస్టు కృష్ణంరాజు అరెస్టు

## అమరావతి రాజధాని మహిళలపై అభ్యంతర వ్యాఖ్యల కేసు



**విజయవాడ,జూన్11, ప్రభాతవార్త ప్రతినిధి:** రాజ ధాని మహిళలపై తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజును పోలీసులు అరెస్ట్ చేశారు.గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న అతన్ని భీమిలి గోస్తనీనది సమీపంలో సెల్‌టవర్ లోకేషన్ ఆధారంగా పట్టుకున్నారు. కృష్ణంరాజు వెంట ఉన్న మరో ఇద్దరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురినీ విశాఖ నుంచి విజయవాడ తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. ఖిఅమరావతి దేవతల రాజధాని కాదు వేశ్యల రాజధాన్ని అంటూ కృష్ణంరాజు మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న అతడిని ముందస్తు సమాచారాన్ని అనుసరించి గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ని తుళ్లూరు పోలీసులు మంగళగిరి తీసుకు వస్తున్నారు. మరోవైపు ఇదే వ్యవహారంలో సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఆయనకు మంగళగిరి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించారు.ఓ న్యూస్ ఛానల్‌లో కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహించిన చర్చ కార్యక్రమంలో జర్నలిస్ట్ కృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ కృష్ణంరాజు మాట్లాడుతూ రాజ ధాని అమరావతి వేశ్యల రాజధాని అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తం ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఆ క్రమంలో కొమ్మినేని శ్రీనివాసరావు, జర్నలిస్ట్ కృష్ణంరాజుతోపాటు సాక్షి యాజమాన్యం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఏపీ ప్రజలు ఆందోళనలు చేపట్టారు. రాజధాని ప్రాంత ప్రజలు అయితే ఈ వ్యాఖ్యలకు నిరసనగా తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లి ఫిర్యాదు చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో వీరిపై కేసులు నమోదు చేశారు. ఈ వ్యాఖ్యలపై సర్వత్ర నిరసనలు వ్యక్తమవుతు న్నాయి. ఈ వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ సైతం స్పందించింది.

ఈ వ్యాఖ్యలపై జాతీయ మానవ హక్కుల సంఘానికి టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయులు ఫిర్యాదు చేశారు.

# రూటు మార్చిన కిడ్నీ రాకెట్ కేటుగాళ్లు

## సిఐడి విచారణలో విస్తుపోయే వాస్తవాలు

## చిన్న ఆసుపత్రులను ఎంచుకుని రహస్యంగా ఆపరేషన్లు

**హైదరాబాద్, జూన్ 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన సరూర్‌నగర్ కిడ్నీ రాకెట్ వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ గోల్‌మాల్‌కు సూత్రధారులుగా వున్న పలువురు నేరగాళ్లు కొత్త పద్ధతిలో కిడ్నీ ఆపరేషన్లు చేస్తుండడం ఈ కేసును విచారిస్తున్న సిఐడి అధికారులను షాక్‌కు గురి చేసింది. దేశంలో ఇప్పటి వరకు వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ కేసులన్నీ స్టార్ ఆసుపత్రుల్లో జరిగినవి కావడం గమనార్హం. కానీ దీనికి భిన్నంగా సరూర్‌నగర్‌లో జరిగిన ఆపరేషన్లు అలకనంద అనే ఓ చిన్న ఆసుపత్రిలో జరగడం విశేషం. చిన్న ఆసుపత్రిలో ఎలాంటి అనుమతి లేకుండా కిడ్నీ ఆపరేషన్లు జరగడం దేశంలో ఇదే తొలిసారి కాగా ఇలాంటి అనేక చిన్నాచితక ఆసుపత్రుల్లో అక్రమ కిడ్నీ మార్పిడిలు జరిగినట్లు సిఐడి విచారణలో తేలింది. ఈ రాకెట్‌కు సూత్రధారులుగా వున్న శ్రీలంకకు చెందిన పవన్ అలియాస్ లియోన్, తమిళనాడుకు చెందిన శంకరన్, రమ్యతో పాటు పలువురు వైద్యుల పాత్రపై విచారణ చేస్తున్న కొద్దీ కొత్త విష యాలు వెలుగులోకి వస్తున్నాయి.అక్రమ కిడ్నీ ఆపరేషన్ల వ్యవహారం కొత్త దారులకు మారింది. ఇప్పటి వరకు పేరున్న ఆసుపత్రుల్లో నైపుణ్యం, అనుభవం వున్న వైద్యులే ఈ ఆపరేషన్లు చేయ డం, ఆ తరువాత కొంతకాలానికి వైద్యుల మధ్య లేదా ఆసుపత్రుల యాజమాన్యాల మధ్య వివాదాల కారణంగా బయటపడడం తెలిసిందే. కొన్నిసార్లు విదేశాల్లోనూ అక్రమ కిడ్నీ ఆపరేషన్లు జరిగినా దానికి ఇక్కడి నేరగాళ్లే కీలకంగా వుండడం మరో విశేషం. గతంలో శ్రీలంకతో పాటు ఇరాన్ దేశాలలో అక్రమ కిడ్నీ ఆపరే షన్లు జరగగా కిడ్నీ ధాతలు భారతీయులే కావడం గమనార్హం. ఇందులో రెండు సందర్భాలలో ధాతలు మరణించడంతో ఈ గోల్‌మాల్ రట్టయ్యింది. అయితే చాలా ఉదంతాలలో డబ్బుల పేచీయే బండారాలను రట్టుచేసిందని చెప్పాలి. ఇందులో ముఖ్యంగా ధాతలే స్వయంగా తాము మోసపోయామని, కిడ్నీ ఇచ్చినందు కు తమకు ఇస్తామన్న డబ్బులు ఇవ్వకుండా మోసానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసిన దాఖలాలున్నాయి. ఈ తరహా కేసు లు తెలుగు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో వున్నాయి. ఇటువంటి సందర్భాలలో పోలీసులు కిడ్నీ ఆపరేషన్లు చేసిన వైద్యులు, ధాతలు, మధ్య వర్తులు, కిడ్నీ గ్రహీతలపైనా కేసులు నమోదు చేశారు. ఇటువంటి కేసులు అనేకం కోర్టుల్లో నడుస్తున్నాయి. అయితే ఈ ఆపరేషన్లన్నీ బడా ఆసుపత్రులు, ప్రభుత్వం నుంచి కిడ్నీ ఆ పరేషన్లకు అనుమతి వున్న ఆసుపత్రుల్లోనే జరిగాయి. ఈ ఘటనల తరువాత బడా ఆసుపత్రులపై సర్కారు కొరడా ఝుళిపించింది. రాయితీలను నిలిపి వేయడం తో పాటు వైద్యులపై వేటు వేసింది. దీంతో అక్రమ కిడ్నీ ఆపరేషన్లు చేసే వైద్యులు రూటు మార్చారు. బడా ఆసుపత్రుల్లో కిడ్నీ ఆపరేషన్లు కష్టమవడంతో చిన్నా చితక ఆసుపత్రులను ఎంచుకున్నారు. ఆర్థికంగా నష్టాల్లో వున్న వాటిని, వ్యసనాలకు బానిసలుగా మారిన కొందరు వైద్యులను ఎంచుకుని వారిని తమకు అనుకూలంగా మార్చుకుని అక్రమ కిడ్నీ ఆపరేషన్లకు తెరలేపారు.

ఇలాంటి ఘటనలకు సరూర్‌నగర్‌లోని అలకంద ఆసునత్రి వేదిక అయ్యింది. వాస్తవానికి ఈ ఆసుప త్రి అధిపతి డాక్టర్ సుమన్ ఉజ్మెకిస్తాన్‌లో ఎంబిబిఎస్ చదివి అలనంద పేరిట ఓ ఆసుపత్రిని స్థాపించాడు. నెఫ్రాలజికి (కిడ్నీ ఆపరేషన్ల నిర్వహణ) సంబంధించి ఈ ఆసుపత్రి అనుమతి లేదు. కేవలం తొమ్మిది బెడ్ల ఈ ఆసుపత్రికి నిబంధనలకు విరుద్ధంగా మల్టీ స్పెష్పాలిటీగా బోర్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ కిడ్నీ ఆపరేష న్లు చేస్తే ఎవరికి అనుమానం రాదని భావించిన సూత్రధారులు పక్కాగా వ్యవహరించారు. అంతకు ముందు సైదాబాద్‌లో మరో ఆసుపత్రిలోనూ ఇలాగే అక్రమం గా ఆపరేషన్లు నిర్వహించారు. అయితే అలకనంద ఆసుపత్రిలో జరిగిన గోల్‌మాల్ ఆనరేషన్ల సమయంలో అక్కడ పనిచేసిన కొందరు పారా మెడికల్ సిబ్బందికి అందాల్సిన డబ్బుల విషయంలో తగాదా రావడంతో రట్టయ్యింది. దీంతో ఐదారుగురు మినహా 15 మంది అరెస్టయ్యారు. ఇందులో పేరున్న వైద్యులు కూడా వున్నారు. కాగా అలకనంద ఆసుపత్రిలో అక్రమ కిడ్నీ ఆపరేషన్లు చేసిన వైద్యులు దేశ వ్యాప్తంగా అనేకచోట్ల అమాంబాపతు ఆసుపత్రుల్లో ఇదే తరహాలో ఆపరే షన్లు నిర్వహించినట్లు సిఐడి విచారణలో తేలింది. అయితే ఎన్ని ఆసుపత్రుల్లో వీరు ఇటువంటి ఆపరేషన్లు చేశారు...? ఎంత మందికి చేశారు...? ఈ సందర్భం గా ఎన్ని కోట్ల రూపాయలు చేతులు మారాయనే దానిపై సిఐడి అధికారులు ఆరా తీస్తున్నారు. అక్రమ కిడ్నీ ఆపరేషన్లలో ధాతలకు నాలుగు నుంచి ఐదు లక్షల రూపాయలు ఇస్తుండగా గ్రహీతల నుంచి 60 లేదా 70 లక్షల రూపాయలు తీసుకుంటున్నారు.

ఇందులో ఆపరేషన్లు చేసే వైద్యులకు ఐదు నుంచి పది లక్షల రూపాయలు, పారా మెడికల్ సిబ్బందికి లక్ష రూపాయల వరకు ఇస్తుండగా మధ్యవర్తులకు పది లక్షల రూపాయలు అందుతున్నాయి. మిగతా సొమ్మును సూత్రధారులు కాజేస్తున్నారు. ఈ కేసుల్లో మరిన్ని సంచలన విషయాలు వెలుగుచూసే వీలుంది.

# హనీమూన్ మర్డర్ నిందితులకు 8 రోజుల పోలీస్ కస్టడీ!



**షిల్లాంగ్,జూన్ 11:** మేఘాలయ హనీమూన్ మర్డర్ కేసులో సోనమ్ తోపాటు నలుగురు నిందితులకు షిల్లాంగ్‌కోర్టు8 రోజులపోలీసు కస్టడీకి అనుమతించింది. సోనమ్‌ను ముందురోజు రాత్రే పోలీసులు రిమాండ్‌లోకి తీసుకోగా మిగిలిననిందితులను బుధవారం ట్రాన్సిట్ రిమాండ్‌పై తీసుకువచ్చినట్లు సీనియర్ అధికారి తెలిపారు. నిందితులందరికీ 10 రోజుల రిమాండ్ విధించాలని పోలీసులు కోరారు. కానీ కోర్టు 8 రోజులకస్టడీకి అనుమతించిందని తూర్పు ఖాసీహిల్స్ ఎస్పీ వివేక్ సయూమ్ చెప్పారు. నిందితులను సోహ్రాలోని నేరం జరిగిన ప్రాంతానికి తీసుకెళ్లి వారితో క్రైమ్‌సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయడానికి ప్రత్యేకబృందం కసరత్తులుచేస్తోంది. అందుకే వారిని పోలీస్ కస్టడీ ఇవ్వమని కోరామని ఇండోర్‌లో అరెస్టుచేసిన నిందితులకు ఆరురోజుల రిమాండ్, ఘాజీపూర్‌లో అరెస్టుచేసిన నిందితురాలికి మూడు రోజుల రిమాండ్‌కు సిట్ ఆదేశించిందని ఒకఅధికారి తెలిపారు.

# పరిశ్రమలు రాకుండా బిఆర్ఎస్ కుతంత్రాలు: మంత్రి శ్రీధర్ బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్11:** తెలంగాణాలో పరిశ్రమలు ఏర్పాటు కాకుండా బీఆరెస్ పార్టీ కుట్రలు చేస్తోందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆరోపించారు. యువతకు ఉపాధి దొరకకుండా చేయాలన్నదే వారి దుర్మార్గపు ఆలోచనగా కనిపిస్తోందని బుధవారం నాడు ఆయన ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోకి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ప్రైవేటు సెక్టారులో లక్షన్నర ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. పరోక్షంగా మరో లక్ష మంది ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు.

పెట్టుబడులన్నీ కార్యరూపం దాలిస్తే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని గులాబీ పార్టీ కలవర పడుతోందని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆటంకాలు సృష్టిస్తూ రైతులను రెచ్చగొడుతుందని శ్రీధర్ బాబు అన్నారు. అరాచకం సృష్టించాలని చూస్తే ప్రభుత్వ యంత్రాంగాలు చూస్తూ ఊరుకోవని ఆయన హెచ్చరించారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యం స్థానంగా మార్చిందని ఆయన తెలిపారు. గతంలో నైపుణ్యం ఉన్న కార్మికుల కొరత వల్ల పరిశ్రమలు రావడానికి వెనకాడేవి. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో చదువులకు, ఇండస్ట్రీకి మధ్య ఉన్న నైపుణ్యాలకు సంబంధించిన గ్యాపును పూరిస్తున్నామని శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రతి నిరుద్యోగి ఏదో ఒక స్కిల్ లో శిక్షణ పొందేలా ప్రభుత్వం జిల్లాల స్థాయిలో నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని తెలిపారు."మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏనాడూ పరిశ్రమలను, అభివృద్ధి కార్యక్రమాలను వ్యతిరేకించలేదు. రాష్ట్రాభివృద్ధి జరగాలని కోరుకున్నాం.

అప్పటి ఒప్పందాలకు అభ్యంతరాలు చెప్పకుండా పెద్ద మనసుతో కొనసాగిస్తున్నాం. రోజు రోజుకు ఉనికి కోల్పోతున్న బీఆరెస్ ప్రజల దృష్టిని మళ్లించేందుకు రైతులను రెచ్చగొడుతుందని దుయ్యబట్టారు. 2025-26 నాటికి పెట్రోలులో 20 శాతం ఇథనాల్ కలపాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

అందులో భాగంగానే దేశవ్యాప్తంగా ఇథనాల్ పరిశ్రమల అనుమతులకు సంబంధించి విధివిధానాలు జారీ చేసిందన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ కూడా కేంద్ర నిర్ణయం మేరకు ఏర్పాటవుతోంది. దానికి అనుమతులు కూడా కేంద్రం ఇచ్చినవేనని చెప్పారు. భూములు పరిశ్రమ వారే సొంతంగా కొనుక్కున్నారు. నిర్మాణం పూర్తయి ఉత్పత్తి ప్రారంభమైతే స్థానిక యువతకు ఉద్యోగాలు దొరికి ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

పారిశ్రామిక ప్రగతికి ఆటంకాలు కల్పించుకుంటూ పోతే బిఆర్ఎస్ పార్టీని ప్రజలు ఎప్పటికీ క్షమించరు. విధ్వంస కార్యక్రమాలతో ఏపార్టీ మనుగడ సాగించలేదు. గత ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుని రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తే తప్ప ప్రజా మద్ధతు దొరకదన్నారు.

# 2 వేల మందితో 'కృష్ణా యోగా'

## ప్రపంచ రికార్డు సృష్టించిన విజయవాడ

## వివిధ రకాల పడవలపై రెండువేలమంది యోగాసనాలు

**విజయవాడ,జూన్11,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని బెరం పార్క్ వద్ద కృష్ణా నదిలో నిర్వహించిన యోగా కార్యక్రమం వరల్డ్ రికార్డ్ సృష్టించింది. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా కృష్ణా నదిలో 2000 మంది వివిధ రకాల పడవలపై యోగాసనాలు వేసి వరల్డ్ రికార్డు నెలకొల్పారు.యోగాను ప్రతి ఇంటికి పరిచయం చేసేందుకు ఎన్టీఆర్ జిల్లా అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే అన్నీ ప్రముఖమైన ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరినీ ఇందులో భాగస్వామ్యంచేయాలనే ప్రభుత్వ ఉద్దేశాన్ని తూచాతప్పకుండా అధికార యంత్రాంగం పాటిస్తోంది. యోగా ఆన్ వాటర్ క్రాఫ్ట్ పేరిట కార్యక్రమం జరిగింది. బుధవారం తొలి జాము నుంచి చిరు జల్లుల సవ్వడి చేస్తూ కృష్ణా తీరం ఆహ్లాదకర వాతావరణం సంతరించుకుంది. నగరంలోని బెరం పార్కు వద్ద కృష్ణమ్మ తీరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నేతృత్వంలో నిర్వహించిన వాటర్ క్రాఫ్ట్ ఫ్లోటింగ్ యోగా మెగా ఈవెంట్‌లో పాల్గొనేందుకు యోగా ప్రియులు విశేషంగా తరలిరావడంతో పులకించింది. ఉదయాన్నే బెరం పార్కుకు చేరుకున్న పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, జిఎడి పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రలకు యోగా ప్రియులు హర్షధ్వానాలతో స్వాగతంపలికారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన యోగా ఔత్సాహికులు పంట్లు, బోట్లు, స్పీడ్ బోట్లు, కయాక్స్ బోట్లు, శాండ్ బోట్లు, జెట్ స్కీ, లైఫ్ బోట్లు వంటి 201 వాటర్ క్రాఫ్టులతో పాటు నదీ తీర ప్రాంతంలో ఏర్పాటుచేసిన పచ్చని తివాచీలపై 2000 మంది యోగాసనాలు ఆచరించడంతో కృష్ణమ్మ ఒడి పులకించింది. ప్రపంచ రికార్డు సాధించాలన్న జిల్లా యంత్రాంగం ఆశయం నెరవేరింది. యోగాసనాలను ఆద్యంతం నిశితంగా పరిశీలించిన వరల్డ్ రికార్డ్స్ యూనియన్ (డబ్ల్యూఆర్‌యూ) న్యాయనిర్ణేత షరీఫ్ హానిఫ్.. యోగా కార్యక్రమాన్ని నిర్వహించిన తీరు, యోగాసనాలను ఆచరించిన విధానం, తరలివచ్చిన ఔత్సాహికులను క్షుణ్నంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రపంచ రికార్డు సాధించినట్లు వేలాది మంది హర్షధ్వానాల మధ్య రికార్డు సాధించినట్లు ప్రకటించారు. ఓ నదిలో అత్యధిక మందితో వివిధ రకాల అత్యధిక బోట్లపై యోగాసనాలు చేసి ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నట్లు ధ్రువీకరిస్తూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, జిఎడి పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రవాచ్ ఎంలకు సర్టిఫికెట్ అందించారు.




బుధవారం విజయవాడలో కృష్ణానది పడవలపై యోగాసనాలు చేస్తున్న అభ్యాసకులు

**కలెక్టర్ అపూర్వ లీడర్‌షిప్ ఫలితం ఈ ప్రపంచ రికార్డు:** న్యాయనిర్ణేత షరీఫ్ హానిఫ్ ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నేతృత్వం, ఆయన బృందం అపూర్వ కృషికి ఫలితం ప్రపంచ రికార్డు అని వరల్డ్ రికార్డ్స్ యూనియన్ (డబ్ల్యూఆర్‌యూ) న్యాయనిర్ణేత షరీఫ్ హానిఫ్ పేర్కొన్నారు. క్రమశిక్షణ, సమష్టి కృషి, నిబద్ధత ఫలితంగా పవిత్ర కృష్ణా నదీ తీరం సరికొత్త ప్రపంచ రికార్డుకు వేదికయిందన్నారు. ఇన్నొవేషన్, హెల్త్, ఫిట్‌నెస్‌తో పాటు పర్యావరణ పరిరక్షణపట్ల జిల్లా అధికార యంత్రాంగం, ప్రజల చిత్తశుద్ధికి ఇది గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. ఐక్యత, శ్రేయస్సు, సంస్కృతీ సంప్రదాయాల పట్ల నిబద్ధతను చాటిచెప్పేలా ఈ రికార్డుతో విజయవాడ ప్రజలు గొప్ప సందేశాన్ని ఇచ్చారని.. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ వరల్డ్ రికార్డ్స్ యూనియన్ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు షరీఫ్ హానిఫ్ తెలిపారు.విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర ప్రజలు ఎంతో చైతన్యవంతులన్నారు.అందరికీ ఆదర్శంగా నిలవాలనే తపన వారిలో కనిపిస్తుందని.. ఆ నిబద్ధత ఫలితమే నేటి ప్రపంచ రికార్డు అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, విఎంసి, ప్రజల సమష్టి కృషితో రికార్డు సొంతమైందని.. బెరం పార్కు, పున్నమి ఘాట్ వద్ద నదీతీరం గతంలోనూ వివిధ ప్రపంచ రికార్డులకు వేదికగా నిలిచిందని.. గౌరవ ముఖ్యమంత్రి ఆశయానికి అనుగుణంగా 5000 డ్రోన్లతో మెగా డ్రోన్ షోతో ప్రపంచ రికార్డులు సాధించినట్లు తెలిపారు. గౌరవ ప్రధాని సమక్షంలో ఈ నెల 21న విశాఖలోనూ అయిదు లక్షల మందితో యోగాసనాలు ఆచరించి ప్రపంచ రికార్డు సాధించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

**ఐక్యతకు, సమష్టి కృషికి ప్రతీక**

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆహ్లాదకర వాతావరణంలో ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన మెగా యోగా ఈవెంట్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని.. యోగాంధ్ర2025లో ప్రపంచ రికార్డు సాధిం చినందుకు ఆనందంగా ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా దాదాపు రెండు కోట్ల మంది యోగాలో పాల్గొంటున్నారన్నారు. ఆంధ్రాను యోగాంధ్రగా మార్చడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అజయ్ జైన్ పిలుపునిచ్చారు.




యోగాలో కృష్ణానదిలో వరల్డ్ రికార్డు సాధించిన సందర్భంలో సంబంధిత ధృవీకరణ పత్రాన్ని అందుకుంటున్న ఎంపీ శివనాథ్,ఐఎఎస్ అధికారులు అజెయ్‌జైన్,ముకేష్‌కుమార్‌మీనా,లక్ష్మీశ

# టెట్ హాల్‌టికెట్లు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్11:** తెలంగాణలో టెట్‌కు హాల్‌టికెట్లు విడుదల అయ్యాయి. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న టెట్ పరీక్షల హాల్‌టికెట్లను పాఠశాల విద్యాశాఖ అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు జర్నల్ నంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నిర్ణీత తేదీల్లో ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు సెషన్ 1, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయి.ఈ నెల 18, 19, 24 (మొదటి షిఫ్టు), ఈ నెల 28, 29, 30 తేదీల్లో పేపర్ 2 పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 20, 23, 24 (రెండో షిఫ్టు), 27 తేదీల్లో పేపర్ 1 పరీక్షలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 15 నుంచి 30 తేదీ వరకు టెట్‌కు దరఖాస్తులు ఆహ్వానించారు. టెట్‌కు 1.83లక్షల దరఖాస్తులు వచ్చాయి. పేపర్ 1కు 63,261మంది, పేపర్2కు 1,20,392మంది దరఖాస్తు చేసుకున్నారు. 2 పేపర్లకు దరఖాస్తు చేసినవారు 15,000 మంది వరకు ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో సంవత్సరంలో రెండు సార్లు (జూన్, డిసెంబర్) టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని గత సంవత్సరం జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గత సంవత్సరం డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం జనవరి నెలలో పరీక్షలు నిర్వహించింది.జనవరిలో జరిగిన టెట్ పరీక్షకు 2.75 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్‌లో పవన్ కల్యాణ్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, డైరెక్టర్ హరీష్ శంకర్, మైత్రి మూవీ మేకర్స్ సెన్సేషనల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైంది. బుధవారం పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో అఫీషియల్‌గా షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీతో సెట్స్‌లో జోష్ నెలకొంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. పవన్ కళ్యాణ్‌తో పాటు, సినిమాలోని ప్రముఖ తారాగణం కూడా షూటింగ్‌లో పాల్గొంటోంది. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఆయనంక బోస్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, ఉజ్వల్ కులకర్ణి ఎడిటర్. రామ్‌లక్ష్మణ్ ద్వయం యాక్షన్ సీక్వెన్స్‌లను కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఆనంద్ సాయి ప్రొడక్షన్ డిజైనర్. స్క్రీన్ ప్లే కె. దశరథ్ రాశారు, అడిషినల్ రైటింగ్ సి చంద్ర మోహన్. తారాగణం: పవన్‌కళ్యాణ్, శ్రీలీల, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: హరీష్ శంకర్. ఎస్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, స్క్రీన్ ప్లే: కె దశరథ్, రచన సహకారం: సి చంద్ర మోహన్, సినిమాటోగ్రఫీ: ఆయనంక బోస్, ఎడిటింగ్: ఉజ్వల్ కులకర్ణి, ప్రొడక్షన్ డిజైనర్: ఆనంద్ సాయి, సిఇఒ: చెర్రీ, ఫైట్స్: రామ్ లక్ష్మణ్, మార్కెటింగ్: ఫస్ట్ షో, పీఆర్వో: వంశీ శేఖర్.

# 'కుబేర' నుంచి సాంగ్ రిలీజ్

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మికమందన్న, హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియా మూవీ శేఖర్ కమ్ముల కుబేర. అద్భుతమైన తారాగణంతో కుబేర ఇండియన్ సినిమాలో గేమ్‌ఛేంజర్‌గా నిలవబోతోంది. ఇప్పటికే విడుదలైన కుబేర ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. పోయిరా మామ, ట్రాన్స్ ఆఫ్ కుబేర చార్ట్ బస్టర్ రెస్పాన్స్‌తో మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్‌లో వున్నాయి. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. కుబేర తెలుగు, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని పీ పీ డుమ్ డుమ్ పాటని ముంబయిలో గ్రాండ్‌గా లాంచ్ చేశారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో ధనుష్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. కుబేర చాలా స్పెషల్ ఫిలిం. చాలా డిఫరెంట్ ఫిలిం. నా మనసుకు చాలా దగ్గరైన సినిమా. ఈ సినిమా షూటింగ్ ఫెంటాస్టిక్ ఎక్స్పీరియన్స్. నాగార్జునతో కలసి వర్క్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. చాలా పాజిటివ్ టీంతో కలిసి పని చేసాం. ఈ సినిమాలో బెగ్గర్ క్యారెక్టర్‌ని ప్లే చేశాను. ఈ పాత్ర కోసం ఎంతో రీసెర్చ్, హోమ్ వర్క్ చేశ్తా అని చెప్పను (నవ్వుతూ). మా డైరెక్టర్ గారిని ఫాలో అయ్యాను. శేఖర్ బ్రిలియంట్ డైరెక్టర్. ఇలాంటి క్యారెక్టర్‌ని నేను ఇప్పటివరకు చేయలేదు. డైరెక్టర్ శేఖర్ వెరీ ప్యూర్ పర్సన్. ఆయన కారణంగానే ఈ సినిమా చేశాను. ఆయన 20 నిమిషాలు ఈ కథ చెప్పారు. ఆయన ఎనర్జీ నాకు చాలా నచ్చింది. వెంటనే ఒకే చేశాను. చాలా హానెస్ట్‌గా తీసిన సినిమా ఇది. ఈ సినిమా నా బాల్యాన్ని గుర్తుకు తెచ్చింది. ఓ డంప్ యార్డ్‌లో దాదాపు 7 గంటలపాటు నేను, రష్మిక షూటింగ్‌లో పాల్గొన్నాం. అక్కడ అంతసేపు ఉన్నా ఆమె బాగానే ఉంది. నాకేం వాసన రావట్లేదు అని చెప్పింది. మరి ఆమెకు ఏమైందో నాకు తెలియదు (నవ్వుతూ). ఇలా ఎన్నో మంచి జ్ఞాపకాలు పంచిందీ కుబేర. జూన్ 20న ఈ సినిమాని చూడండి. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది అన్నారు. హీరో కింగ్ నాగార్జున మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మీరందరూ చూపించే ప్రేమకి కృతజ్ఞతలు. శివ, క్రిమినల్..ఇలా నా కెరీర్ బిగినింగ్ నుంచి నా చిత్రాలకి ఇక్కడ ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. నా డబ్బింగ్ చిత్రాలు కూడా ఇక్కడ చాలా అద్భుతంగా యాక్సెప్ట్ చేశారు. కుబేర నాకు చాలా స్పెషల్ ఫిలిం. ఏదైనా డిఫరెంట్‌గా చేయాలి అనుకున్నప్పుడు శేఖర్ వచ్చారు. ఆయనతో గత 15 ఏళ్లుగా పని చేయాలని అనుకుంటున్నాను. ఆయన ఈ సినిమా గురించి చెప్పినప్పుడు మరో ఆలోచన లేకుండా ఒకే చేశాను. శేఖర్ బ్రిలియంట్ ఫిలిం మేకర్. తన సెన్సిబిలిటీస్ అద్భుతంగా ఉంటాయి. తన మనసు చాలా స్వచ్ఛంగా ఉంటుంది. అది స్క్రీన్ మీద కనిపిస్తుంది. జిమ్ సర్బ్‌తో కలిసి పనిచేయడం మంచి ఎక్స్పీరియన్స్. తెలుగు చాలా చక్కగా మాట్లాడారు. రష్మిక పవర్ హౌస్ ఆఫ్ టాలెంట్. తన సినిమాలన్నీ బ్లాక్ బస్టర్స్ అవుతున్నాయి. తను ఈ సినిమాలో అద్భుతంగా నటించింది. డబ్బింగ్ చూసిన తర్వాత తనకు ఫోన్ చేసి అభినందించాను.



## దర్శకుడు రవికుమార్ చౌదరి కన్నుమూత

మన టాలీవుడ్‌లో చాలా వరకు సూపర్ హిట్ సినిమాలు ఆడియెన్స్‌కి బాగా తెలిసినవి కూడా ఉంటాయి కానీ అలాంటి బ్యాంగర్ హిట్స్‌ని అందించిన దర్శకులు ఒకింత అండర్ రేటెడ్‌గానే ఉంటారు. మరి అలా మన తెలుగు ఆడియెన్స్ మర్చిపోలేని కొన్ని మాస్ హిట్ చిత్రాల్లో గోపీచంద్ యజ్ఞం కూడా ఒకటి. ఒక్క యజ్ఞం మాత్రమేకాకుండా బాలయ్యతో వీరభద్ర, నితిన్‌తో ఆటాడిస్తా అలాగే మెగా సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్‌కి భారీ హిట్ పిల్లా నువ్వు లేని జీవితం లాంటి సినిమాలు దర్శకత్వం వహించిన ప్రముఖ



దర్శకుడు రవికుమార్ చౌదరి ఇక లేరు అనే విషాద వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో బయటకి వచ్చింది. అయితే తాను ఆకస్మిక గుండెపోటు వచ్చిన కారణంగా తుది శ్వాస విడిచారట. కాగా తన నుంచి చివరి సినిమాగా జోవియల్ స్టార్ రాజ్ తరుణ్‌తో తిరగబడరా సామీ వచ్చింది. ఇక ఈ దర్శకుని మరణ వార్తతో సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. మరి వారి పవిత్ర ఆత్మకి శాంతి చేకూరాలని ఆశిస్తున్నాం. ఓం శాంతి.




## 'పా పా' ట్రైలర్ లాంచ్

కవిన్, అపర్ణా దాస్ జంటగా నటించిన తమిళ బ్లాక్ బస్టర్ మూవీ డాడా తెలుగు ప్రేక్షకుల ముందుకు పా పా పేరుతో వస్తోంది. ఈ చిత్రానికి గణేష్ కె బాబు దర్శకత్వం వహించారు. పా పా చిత్రాన్ని జేకే ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత నీరజ కోట తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నెల 13న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. మంగళవారం నటసింహం బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా పా పా చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ దర్శకులు ఎ. కోదండరామిరెడ్డి, బి.గోపాల్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ఎ.కోదండరామిరెడ్డి మాట్లాడుతూ, ఇప్పుడే పా పా మూవీ ట్రైలర్ చూశాను. చాలా బాగుంది. ఈ చిత్రంలో హీరో హీరోయిన్స్‌తో పాటు వారి బాబు పాత్రకు చాలా ఇంపార్టెన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. మంచి ఎమోషనల్ ఫ్యామిలీ మూవీగా ప్రేక్షకుల్ని ఈ సినిమా ఆకట్టుకోవాలి. కొత్త ప్రొడ్యూసర్ నీరజ కోట గారికి పా పా చిత్రంతో ఘన విజయం దక్కాలి. సురేష్ కొండేటి ఏ సినిమా సక్సెస్‌అవుతుందో బాగా గెస్ చేయగలడు. దర్శకుడు బి.గోపాల్ మాట్లాడుతూ, మా సురేష్ కొండేటి ఎన్నో తమిళ మూవీస్‌ను తెలుగులోకి తీసుకొచ్చారు. బడ్జెట్‌లో చేసిన తమిళ చిత్రాలు కూడా తెలుగులో మంచి వసూళ్లు చేసిన సందర్భాలు ఉన్నాయి. డా డా సినిమా తమిళంలో 42 కోట్ల రూపాయలు వసూలు చేసింది. అలాగే తెలుగులో పా పా పేరుతో ఈ సినిమా రిలీజ్ అవుతోంది. సాంగ్స్ బాగున్నాయి, ట్రైలర్‌ఆకట్టుకుంది. ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామా బాగున్నాయి. ఈ సినిమా మంచి విజయం సాధించి నిర్మాత నీరజ కోటకి పేరు, డబ్బు తీసుకురావాలని కోరుకుంటున్నా అన్నారు. ప్రొడ్యూసర్ నీరజ కోట మాట్లాడుతూ, మా జేకేఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ మీద చేస్తున్న ఫస్ట్ మూవీ పా పా. ఈ చిత్రం తమిళంలో డా డా పేరుతో రిలీజై ఘన విజయాన్ని సాధించింది.

## 'నభా నటేష్' గ్లామర్‌కు ఫ్యాన్స్ ఫిదా

అందమైన ఇస్మార్ట్ బ్యూటీకి అభిమానులు పెద్ద ఎత్తున ఉన్నారు. అందుకే ఈమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోటోలు షేర్ చేసిన వెంటనే లక్షల మంది లైక్ చేయడం మాత్రమే కాకుండా ఫోటోను షేర్ చేస్తూ, వావ్, సూపర్ అంటూ కామెంట్స్ చేస్తూ ఉంటారు. బ్లాక్ ఔట్ ఫిట్‌లోనూ మెరిసిపోతున్న ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్‌ను ఎంత పొగిడినా తక్కువే అంటూ అభిమానులు సైతం నెట్టింట కామెంట్ చేస్తున్నారు. ఇలాంటి



ముద్దుగుమ్మ ఏడాదికి మూడు నాలుగు సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఆ జ్ఞాపకాల్లోనే ఇంకా కీర్తి సురేష్ కర్ణాటకలోని శృంగేరిలోని పాఠశాలకు వెళ్లిన ఈమె ఉడిపిలోని ఇంజనీరింగ్ కాలేజ్‌లో చదివింది. జాతీయ అవార్డ్ గ్రహీత ప్రకాష్ బెలవాడి ఆధ్వర్యంలో నాటకాల్లో నటించడం ద్వారా గుర్తింపు దక్కించుకుంది. చిన్నప్పటి నుంచే భరతనాట్యం నేర్చుకున్న ఈమె అనేక పోటీల్లో పాల్గొని విజయాలను సొంతం చేసుకుంది. కెరీర్ ఆరంభం నుంచే నటనపై శ్రద్ధ పెడుతూ వచ్చిన ఈమె పలు సినిమాల్లో మెప్పించింది. కానీ లక్ కలిసి రాలేదు. ఈమెకు ముందు ముందు అయినా సినిమాల్లో మంచి విజయాలు దక్కాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇండస్ట్రీలో ఈమె ముందు ముందు హీరోయిన్‌గా బిజీ అవ్వాలని కోరుకుంటున్నారు. ఇంతటి అందగత్తకు ఇంతకు మించి అన్నట్లుగా రావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.




# 'సూర్య46' షూటింగ్ షురూ

వైవిధ్యమైన పాత్రలు, చిత్రాలతో వివిధ భాషల ప్రేక్షకులకు చేరువైన తమిళ అగ్ర కథానాయకుడు సూర్య, తన తదుపరి చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో చేస్తున్నారు. సూర్య 46వ చిత్రంగా రూపొందుతోన్న ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రతిష్ఠాత్మక ద్విభాషా చిత్ర షూటింగ్‌ను ప్రారంభించారు. ప్రతిభావంతులు సూర్య, వెంకీ అట్లూరి మొదటిసారి చేతులు కలపడంతో.. కేవలం ప్రకటనతోనే తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలలో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అందరూ ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. అందరి ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా వేడుక, భావోద్వేగం మరియు వినోదం వైపు తొలి అడుగు అంటూ సూర్య ముందుకి అడుగు వేస్తున్న అద్భుతమైన పోస్టర్ ను చిత్ర బృందం పంచుకుంది. తమిళ కథానాయకుడు అయినప్పటికీ పలు సంవత్సరాల నుంచి తెలుగు ప్రేక్షకుల ప్రేమను కూడా పొందుతున్న సూర్య.. ఇప్పుడు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడక్షన్ నెం.33 తో తమిళ మరియు తెలుగు అభిమానులను మరింతగా అలరించడానికి సిద్ధమవుతున్నారు. మొదటి నుంచి పాత్రల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ, ఎప్పటికప్పుడు సృజనాత్మక సరిహద్దులను చెరిపేస్తున్న సూర్య.. ఇప్పుడు సూర్య 46తో మరో వైవిధ్యభరితమైన చిత్రాన్ని అందించబోతున్నారు. లోతైన భావోద్వేగాలను, వాణిజ్య అంశాలను మిళితం చేస్తూ ప్రస్తుత తరంలో గొప్ప కథకులతో ఒకరిగా పేరు పొందారు దర్శకుడు వెంకీ అట్లూరి. గత రెండు చిత్రాలు సార్(వాతి), లక్కీ భాస్కర్ ఘన విజయాలను సాధించి.. దర్శకుడిగా వెంకీ అట్లూరి స్థాయిని మరింత పెంచాయి. సార్, లక్కీ భాస్కర్ తరహాలోనే మరో గొప్ప కథను అందించబోతున్నారు వెంకీ అట్లూరి. సూర్య 46పై రోజురోజుకి అంచనాలు పెరిగిపోతున్నాయి. ప్రేమలుతో ఆకట్టుకున్న యువ సంచలనం మమిత బైజు కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రంతో రవీనా టాండన్ తెలుగు సినీ పరిశ్రమకు తిరిగి వస్తున్నారు. రాధిక శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సార్(వాతి), లక్కీ భాస్కర్ చిత్రాలతో తన సంగీతంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన జి.వి.ప్రకాష్ కుమార్.. మరోసారి వెంకీ అట్లూరితో చేతులు కలిపి, తన సంగీతంతో మాయ చేయబోతున్నారు. ఈ చిత్ర కోసం ప్రతిభగల సాంకేతిక బృందం పని చేస్తోంది. ఛాయాగ్రాహకుడిగా నిమిష్ రవి, కళా దర్శకుడిగా బంగ్లాన్ వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అద్భుతమైన చిత్రాలను అందిస్తూ, వరుస ఘన విజయాలను ఖాతాలో వేసుకుంటున్న నిబద్ధత గల నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాని 2026 వేసవిలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వర్కింగ్ టైటిల్: సూర్య46 - ప్రొడక్షన్ నెం. 33, తారాగణం: సూర్య, మమిత బైజు, రవీనా టాండన్, రాదిక శరత్ కుమార్, సాంకేతికబృందం: రచన, దర్శకత్వం: వెంకీఅట్లూరి, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, సంగీతం: జి.వి. ప్రకాష్ కుమార్, ఛాయాగ్రహణం: నిమిష్ రవి, కూర్పు: నవీన్ నూలి, కళ: బంగ్లాన్, ఫైట్ మాస్టర్: వి.వెంకట్, కొరియోగ్రాఫర్: విజయ్‌బిన్నీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: యలమంచిలి గోపాలకృష్ణ, లైన్ ప్రొడ్యూసర్: ఉమామహేశ్వరరావు, బ్యానర్స్: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్ట్యూన్ ఫోర్ సినిమాస్, సమర్పణ: శ్రీకర స్టూడియోస్, పీఆర్ఓ: లక్ష్మీ వేణు గోపాల్.




# బాలీవుడ్‌లో హైప్ పెంచిన అనన్య పాండే 'కంట్రోల్'

బాలీవుడ్ హీరోయిన్ అనన్య పాండే లైగర్ సినిమాతో టాలీవుడ్ సినీ పరిశ్రమ కు ఎంట్రీ ఇచ్చింది. విజయ్ దేవరకొండ సరసన నటించి.. ఈ బ్యూటీ మంచి మార్కులే కొట్టేసింది. కానీ ఈ మూవీ ప్రేక్షకల్ని అంతగా ఆకట్టుకోలేక పోయింది. తర్వాత ఈ బ్యూటీ రాకీ ఔర్ రాణి స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ పతి పత్నీ ఔర్ వో, ఖాలీ పీలీ, గెహ్రాయాన్, డ్రీమ్ గర్ల్ 2, ఖో గయే హమ్ కహాన్బాద్ న్యూజ్ ఖేల్ ఖేల్ మే సీటీఆర్ఎల్ వంటి తెలుగు, హిందీ చిత్రాల్లో నటించి జనాల మెప్పు పొందింది. అనన్య పాండే బాలీవుడ్లో నటించిన కంట్రోల్ అనే సైబర్ థ్రిల్లర్ సినిమా తెలుగులో కూడా స్ట్రీమింగ్ అయిన విషయం తెలిసిందే. సైబర్ త్రిల్లర్గా డిఫరెంట్ పాయింట్తో తెరకెక్కించిన ఈ మూవీ ఏకంగా సినిమా నాలుగు భాషల్లో విడుదల చేశారు. నేరుగా ఓటీటీలోనే రిలీజ్ చేశారు మేకర్స్. మొదటి ట్రైలరే ఈ మూవీపై జనాల్లో భారీ హైప్ పెంచిందని చెప్పుకోవచ్చు. ఫ్యూచర్లో ఏఐ టెక్నాలజీ.. సోషల్ మీడియా.. మనుషుల్ని ఏ లెవల్లో ప్రభావితం చేస్తుందో.. దీన్ని ఎలా కంట్రోల్ పెట్టాలనే స్టోరీనే దర్శకుడు విక్రమాదిత్య ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇందులో అనన్య పాండేతో పాటుగా విమాన్ స్రామాట్ కీలక పాత్రలో నటించాడు. ఇదంతా పక్కనపెడితే.. అనన్య పాండే ఓ వైపు సినిమాల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోమాత్రం తరచూ యాక్టివ్ గానే కనిపిస్తుంటుంది. తరచూ నెట్టింట ఏదో ఒక పోస్ట్ పెడుతూ అభిమానుల్ని అలరిస్తుంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఓ పోస్ట్ పంచుకుంది. ఇందులో పలు ఫొటోలు ఫ్యాన్స్‌తో షేర్ చేసుకుంది. ఈ పిక్స్ వీక్షించిన నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తు న్నారు. ముఖ్యంగా ఆరో పిక్ మాత్రం ఊహించనిది అంటూ క్రేజీ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# ఆర్థిక ఇబ్బందులు లేకుండా !



డబ్బు సంపాదించడమే కాదు.. డబ్బు నిర్వహణ గురించి కూడా మహిళలకు తెలిసుండాలంటున్నారు ఆర్థిక రంగ నిపుణులు. అప్పుడే ఎలాంటి పరిస్థితుల్లో అయినా ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండొచ్చు.

**ప్రతి రూపాయీ లెక్కే!**

నోట్‌ప్యాడ్ 3. పెళ్లయ్యాక అందరు మహిళలు ఉద్యోగం చేయలేదు. ఒక్కోసారి కుటుంబ బాధ్యతలు, ఇతర కారణాల రీత్యా వివాహం తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి గృహిణిగా కొనసాగాల్సి ఉంటుంది. అలాంటప్పుడు కూడా ఇంట్లో ఉన్నా డబ్బు నిర్వహణపై దృష్టి పెట్టి ప్రతి రూపాయి వృథా కాకుండా బడ్జెట్ వేసుకోవడం ఎంతో ముఖ్యమంటున్నారు. ఈ నెలనెలా ఇంటి అవసరాలు, ఖర్చులకు సంబంధించి భార్యా భర్తలిద్దరూ చర్చించుకొని కొంత బడ్జెట్‌ను నిర్ణయించుకోవాలి. అందులో అత్యవసరమైన వాటికే ఖర్చు పెట్టి మిగిలిన నిపుణుల సలహాతో పెట్టుబడి పెడితే దీర్ఘకాలంలో ఉపయోగించుకోవచ్చు.

**వాళ్ల అవసరాలే ముఖ్యం!**

అనుకోకుండా భర్తను కోల్పోవడం లేదంటే భర్త నుంచి విడిపోవడం.. ఈ రెండు సందర్భాల్లో సింగిల్ మదర్ గానే మహిళలు తమ పిల్లల బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇలాంటప్పు పిల్లల చదువు, పెళ్లి.. వంటి దీర్ఘకాలిక లక్ష్యాల పైనే ఎక్కువ దృష్టి పెట్టాలని నిపుణుడైతే ప్రస్తుతం వీటికి సంబంధించిన పొదుపు, పెట్టుబడి పథకాల్లో డబ్బు జమ చేయాలంటే.. అలాగే టర్మ్‌సూరెన్స్ పాలసీని తీసుకోవడం అవసరం... దీనివల్ల పిల్లల భవిష్యత్తు అవసరాలను తీర్చవచ్చు. దీనితో పా కనీసం ఆరు నెలలకు సరిపడా అత్యవసర నిధిని జమ చేసుకోవడమూ ముఖ్యమేనంటున్నారు అలాగే మీ పెట్టుబడులు, వాటిలోని లాభనష్టాల గురించి కూడా ఏ నెలకానెల చెక్ చేసుకోవద్దు.

**రిటైర్మెంట్ తర్వాతా..!** సాధారణంగా చాలామంది విషయంలో.. రిటైర్మెంట్ వయసు వచ్చే నాటికే పిల్లల చదువులు, పెంటి రుణం.. వంటి పెద్ద లక్ష్యాలన్నీ తీరిపోతాయి. ఈ మిగిలిన సొమ్ములో సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్, పోస్టాఫీస్ మంత్లీ ఇన్కమ్ స్కీమ్, ఎఫ్‌ఈ, మ్యూచువల్ ఫండ్స్.. వంటి రిస్క్ తక్కువగా ఉండే వారి సలహాతో పెట్టుబడి పెట్టచ్చు. ఇలా పొదుపు చేసిన డబ్బును మీ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు.

# అడవుల పరిరక్షణ కోసం కృషి..

**ఈసారి యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో అమ్మాయిలే టానర్లు, దాన్ని కొనసాగిస్తూ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)లోనూ అన్మాయే విజయఢంకా మోగించింది. పేరు కనికా అవాబ్ రెండు వైఫల్యాల తరవాత అందుకున్న విజయమిది.**

తాజా సివిల్స్ ఫలితాల తరవాత కనిక నిరాశకు గురైంది. సివిల్స్ విజేతల్లో ఆమె పేరు లేకపోవడమే మూడేళ్ల కష్టం మది! వృథా అయితే బాధ సహజమే. అలాగని అందులోనే ఉండి పోలేదామె. ఈసారి మరింత బలంగా కృషిచేయనుంది.



కట్ చేస్తే... యూపీఎస్సీ ఐఎఫ్ఎస్ ఫలితాలు విడుదలయ్యాయి. ఆ ఫలితాలను చూశాక ఆమె నమ్మలేకపోయింది దానిలో తన పేరు లేదు. ఏకంగా అఖిల భారత స్థాయిలో తొలి ర్యాంకు సాధించిందామె. ఇక తన ఆనందం పట్టడం ఎవరి తరమూ కాలేదు. కనికది రాంచీ చదువులో మొదటినుంచీ ముందే. నాన్న అభయ్ కుమార్ సిన్హా జడ్జిగా పదవీ విరమణ చేశారు. అమ్మ అనితా సిన్హా, ఒక్కతే అమ్మాయి. అందుకే కనిక ఏం చేస్తానన్నా పూర్తి స్వేచ్ఛనిచ్చారామె తల్లిదండ్రులు, బీఈసీ సీ జువాలజీ చేసిన తరవాత కనిక... ఢిల్లీలోని జేఎన్ యూలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో పీజీ చేసింది. అక్కడే ఆమె సివిల్స్ లక్ష్యం పెట్టు కుంది. అయితే అందరిలా కోచింగ్ సంస్థలో చేరాలనుకోలేదు. సొంతంగా ప్రయత్నించాల నుకున్నా. 2021లో సన్నద్ధత ప్రారంభించా. లైబ్రరీలు, రీడింగ్ రూమ్‌లో చదువుకునేదాన్ని. తరవాత ఇంటికొచ్చి ఇక్కడే సిద్ధమవడం ప్రారంభించా, యూట్యూబ్, ఆన్‌లైన్‌లో సమాచారాన్ని సేకరించుకునేదాన్ని. ఇంటర్వ్యూకు మాత్రం సాయం తీసుకున్నా. కొన్ని పాఠ్యాంశాల కోసం ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యా'ననే కనిక తొలిసారి విఫలమైనా పట్టించుకోలేదు. రెండోసారి దేశం అభివృద్ధి చెందడ మంటే టెక్నాలజీ దిశగా ముందుకు వెళ్తే సరిపోదు. అడవులనూ సంరక్షించుకోవాలని గ్రహించింది. అందుకే ఐఎఫ్ఎస్‌పైనా దృష్టి పెట్టింది. రెండూ ఒకేసారి రాసి సివిల్స్ విఫలమైనా ఐఎఫ్ఎస్‌లో ర్యాంకు సాధించింది. వైఫల్యాలు వచ్చినప్పుడు కుంగిపోవడం మామూలే. అలాంటప్పుడు ఇంట్లోవాళ్ల అండా అవసరం. అది నాకు దొరికింది. రోజుకు ఏడు గంటలు చదివేదాన్ని. సోషల్ మీడి దూరంగా ఉన్నా. యూపీఎస్సీ పరీక్షలేమీ రాకెట్ సైన్స్ కాదు. బోలెడంత డబ్బులు తీసుకుంటేనే సాధిస్తామనీ లేదు. సొంతంగానూ ప్రయత్నించొచ్చు. కాకపోతే ఆత్మవిశ్వాసం కోల్పో కూడదు అన్న సలహానిస్తోన్న కనిక ఒడిశా కదర్ని ఎంచుకుంది. అక్కడి బయో పర్యావరణం, అడవులు ఆమెను ఆకర్షించాయి. వాటి పరిరక్షణకు కృషి చేస్తానంటోంది కనిక పీహెచ్‌ఏ చేస్తోంది.

**లక్ష్యం కోసం. ఒట్టుతీసి గట్టుమీద పెట్టా!**

**ఒపక్క రవాణాశాఖ అధికారిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే తన లక్ష్యమైన 'ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్'కు కీలక సిద్ధమయ్యారు. ఐశ్వర్యారెడ్డి.** తాజాగా యూపీఎస్సీ విడుదల చేసిన ఐఎఫ్ఎస్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 13వ ర్యాంకు సాధించారు ఐశ్వర్య. లక్ష్యం కోసం కష్టపడి పనిచేయడం అమ్మ నుంచే నేర్చుకున్నా. అమ్మ పద్మావతి, స్పెషల్ క్లాస్ గుత్తేదారు. నేటికీ పురుషాధిక్యమే రాజ్యమేలుతున్న నిర్మాణరంగంలోకి 40 ఏళ్ల కిందటే అడుగు పెట్టిందామె. ఇంటి బాధ్యతలను సమర్థంగా, ప్రణాళికా బద్ధంగా నెరవేరుస్తూనే గుత్తేదారుగానూ రూ.కోట్ల విలువైన పనులు చేయించింది. ఆచార్యుడిగా నాన్న మంచి వృత్తిలో తనకంటూ గుర్తింపు ఉండాలన్న ఉద్దేశంతో ఎంతో శ్రమించేది. కొన్నిసార్లు తెల్ల వారుజామునే వెళ్లి రాత్రి ఎప్పుడో తిరిగి వచ్చేది. తాను చేయించుకున్న నిర్మాణ పనుల పరిశీలన దగ్గరుండి. అమ్మలోని ఆ కష్టపడేతత్వమే నాకు స్ఫూర్తినీ, ప్రేరణనూ కలిగించాయి. నాన్న వై.రామచంద్రారెడ్డి. ఎస్.వి. విశ్వవిద్యాలయంలో చరిత్ర ఆచార్యుడిగా చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత కళాశాలలో చేరి లా కోర్సు పూర్తిచేయడంతోపాటు న్యాయ వాదిగా కొత్త కెరియర్‌కు సిద్ధమవుతున్నారు. ఈ వయసులోనూ వాళ్ళు పడుతున్న తపన చూసి నా లక్ష్యం విషయంలో రాజీపడకూడదను కున్నా. మా సొంత కడప, నాలుగో తరగతి నుంచే ఓ పాఠశాలలో చేర్చారు. అమ్మ వచ్చి ఎంత ఉన్నా పరీక్షల సమయంలో రోజూ మాకు ధైర్యం చెప్పేది. ఆమె మాపై చూపే ప్రేమ, మా చదువులపైన శ్రద్ధ, పెట్టుకున్న ఆశలు నాలో పట్టుదలను రగిల్చేవి. దీనితో ఒక్కక్షణం కూడా వృథా చేయకుండా చదివేదాన్ని. ఐఐటీమద్రాస్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ చేశా,

**కార్పొరేట్ ఉద్యోగం వదిలి....**

ఇంజినీరింగ్ కాగానే అత్యుత్తమ వేతనంతో పేటీఎం సంస్థలో ఉద్యోగం వచ్చింది. ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటేనే ప్రజాసేవ చేయగలను అనిపించింది. దాంతో ఉద్యోగానికి రాజీనామా చేసి. యూపీఎస్సీకి సిద్ధమయ్యాను. నాకు పర్యావరణం అంటే మక్కువ. అందుకే ఐ.ఎఫ్.ఎస్. సర్వర్ పై ఎక్కువగా దృష్టిసారించా. 2018లో రాసిన ఏపీపీఎస్సీ గ్రూప్1 ఫలితాలు 2022లో విడుదలయ్యాయి. 18వ ర్యాంకు వచ్చింది.





రవాణాశాఖలో ఆర్.టి.ఒ.గా ఎంపికయ్యా. జిల్లా రవాణాశాఖ అధికారిణిగా పదోన్నతి రావడంతో నంద్యాల వచ్చాను. ఉద్యోగం చేస్తూనే చదువుకున్నా... ఓ పక్క విధులు నిర్వర్తిస్తూనే నా అంతిమ లక్ష్యమైన ఐఎఫ్ఎస్ కోసం నిరంతరాయంగా శ్రమించాను. చిన్నప్పట్నుంచీ గంటలకొద్దీ కూర్చొని చదువుకోవడం, పనిచేయడం అలవాటు, దాంతో నాకు ఉద్యోగ బాధ్యతలు ఏమాత్రం భారంగా అనిపించలేదు. ఉద్యోగం, చదువు కోసం రోజుకు 15 గంటలు శ్రమించేదాన్ని, అధికార బాధ్యతలవల్ల కొన్నిసార్లు చదవడానికి సమయం దొరికేది కాదు. దాంతో నాకు వెంటనే ర్యాంకు రాలేదు. ఒకింత నిరాశ ఆవరించినా ఆ ఓటమి పట్టుదలను మరింత పెంచి, కష్టపడి చదివేలా చేసింది.

# ఆడంబరానికి పోల్కీ నగలు









పోల్కీ నగలు.. రాచరికపు హుందాతనానికీ, ఆడంబరానికీ అద్దం పట్టేలా ఉంటాయి. పోల్కీలంటే పాలిష్ చేయకుండా, కత్తిరించకుండా సహజంగా ఉపయోగించే వజ్రాలే. వీటిని నేలపొరల నుంచి సేకరించి, శుభ్రపరిచి నేరుగా నగల్లో పొదుగుతారు. అందుకే ఇవి రకరకాల ఆకృతుల్లో ఉంటాయి. సహజ మెరుపుతో ధగధగలాడే మొగలుల కాలంనాటి ఈ జ్యూయెలరీకి ఉత్తరాదిన బోలెడంత పాపులారిటీ. ముఖ్యంగా రాజస్థాన్, గుజరాత్ ప్రాంతాల్లో వీటిని ప్రత్యేకంగా తయారుచేస్తారు. ఈ పోల్కీలు.. కుందన్, మీనాకారీ, జాడౌ పనితనంతో నగల్లో ఒదిగిపోయి చూపరులను కట్టిపడేస్తుంటాయి. ముఖ్యంగా ధనికవర్గాలు, బాలీవుడ్ తారలు ఎక్కువగా ఇష్టపడే ఇవి ఇప్పుడు సామాన్యులకోసం కొత్తదనాన్ని చుట్టుకుని వచ్చేశాయి. ముఖ్యంగా సెమీప్రెషియస్ రకాల్లో అన్నివర్గాలనూ ఆకట్టుకునేలా తయారుచేస్తున్నారు. అయితే, మొన్నమొన్నటివరకూ చిన్న చిన్న పోల్కీలు కుందన్ స్టైల్‌లో కనువిందు చేసి హారాలు.. ఇప్పుడు పెద్ద పెద్ద పోల్కీలతో జిగేల్‌మనిపిస్తున్నాయి. మరి వాటినోసారి మనమూ చూద్దామా!















# జీన్స్ ఎక్కువకాలం మన్నాలంటే !

ఈ రోజుల్లో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా మహిళల క్యాజువల్ వేర్‌గా జీన్స్ మారి పోయింది. అయితే, వీటినీ సరిగా ఉంచుకోకపోతే అవి ఎక్కువకాలం నాణ్యంగా, మన్నికగా ఉండవు. ఈ పరిస్థితి తలెత్తకుండా జాగ్రత్తలిలా తీసుకోవాలి.

★ మొదటి సారి జీన్స్ నానబెట్టే సర్ఫ్ నీళ్లలో కాస్త రాళ్ల ఉప్పు కూడా వేయండి. ఇలా చేస్తే రంగు పోకుండా ఉంటుంది. మురికీ, మరకలూ త్వరగా వదులుతాయి. కొత్తదనమూ పోదు. ★. ముదురు రంగు జీన్స్‌లు మెరుపు తగ్గుతున్నాయా? అయితే వాటిని ఉతికిన తరవాత చివరిలో అరబకెట్ నీటిలో కప్పు బేకింగ్ సోడా కలిపి ముంచితీసి ఆరేయండి చాలు. మరకలు పడితే రెండు చెంచాల వంటసోడాలో కాస్త వినెగర్ కలిపి పేస్టులా చేసి మరక మీద రాయాలి. పావుగంటయ్యాక బ్రష్‌తో రుద్దితే త్వరగా వదిలిపోతుంది. ★. జీన్స్ కాస్త మందంగా ఉంటుంది కదా అని.. వేణ్నీళ్లలో నానబెట్టడం, బండకేసి బాదడం చేయొద్దు. దీనివల్ల దాని ఫైనింగ్‌తో పాటు మన్నికా తగ్గుతుంది. వీలైనంతవరకూ వీటిని చన్నీళ్లతోనే ఉతకాలి. అలానే జీన్స్‌ని వేసుకున్న ప్రతిసారీ ఉతికేయొద్దు. గాలికి ఆరనిచ్చి రెండు మూడుసార్లు వేసుకుంటే మంచిది.

**చెలి చిట్కా**

మధుమేహానికి నాగముషిణి చెక్క గంధాన్ని శనగగింజ ప్రమాణం సేవిస్తూంటే రక్తంలో మూత్రంలో చక్కెరవ్యాధి కనిపించదు.

# వ్యథ: నిద్ర ఆహారంపై శ్రద్ధ చూపండి



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న:** నా వయస్సు 27 ఏళ్ళు. నిరోద్యోగిని ఇంకా పెళ్ళి కాలేదు. బాల్యం నుంచి నేను చదువులో చాలా చురుగ్గా ఉన్నాను. డిఎస్సీలో మూడు కేటగిరీలకు దరఖాస్తు చేశాను. తొలి కేటగిరీ పరీక్షలో తెలిసి కూడ ఆరు ప్రశ్నలకు తప్పు జవాబులు పెట్టాను. ఇక రెండు పరీక్షలు రాయాల్సి ఉంది. ఇప్పుడు రెండవ పరీక్ష కోసం సన్నద్ధం అవుతున్నాను అయితే మొదటి పరీక్షల్లో చేసిన తప్పులు పదే పదే గుర్తుకు వస్తున్నాయి. దీనితో ఆత్మవిశ్వాసం దెబ్బతిని మనసు కల్లోలం అవుతోంది. పుస్తకం తీసి చదువు దామంటే ఏకాగ్రత కుదరడం లేదు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన నాకు ఈ ఉద్యోగం చాలా అవసరం. నా జీవితం పెళ్ళి ఇతర అంశాలు ఉద్యోగంతో ముడిపడి ఉన్నాయి. తెలివి తేటలు ఉండి పరీక్షల సమయంలో తప్పు ఎందుకు చేశానో అర్థం కావడం లేదు. ఇప్పుడు గడిచి పోయిన విషయాన్ని మరచి పోలేకపోవడం విచిత్రంగా ఉంది. చదివిన విషయాలు మరచిపోతున్న నేను అనవసర విషయాలను మరచిపోలేక పోవడం వల్ల ఇబ్బంది పడుతున్నాను. నేను ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న పట్టుదలలో చదువుతున్నాను. ప్రణాళికాబద్ధంగా రోజుకు 16 గంటలు చదువుతున్నాను. ఇతర పనులకు రెండు గంటలు పోగా 6 గంటలు నిద్రపోతున్నాను. కడుపు నిండా తింటే కంటికి కునుకు వస్తుందని సగం తింటున్నాను. రోజు15 నిమిషాలు ధ్యానం కూడ చేస్తున్నాను. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికి నాలో జ్ఞాపకశక్తి ఏకాగ్రత ఎందుకు దెబ్బతింటున్నదో అర్థం కావడంలేదు. నేను 160 సెంటీమీటర్ల ఎత్తు 40 కిలోల బరువు ఉన్నాను. రుతుక్రమం రెండు మూడు నెలలకు ఒకసారి అవుతుంది. ఒక్కోసారి నాపై నాకే జాలివేసి దుఃఖం వస్తోంది. మా అమ్మ ఏదైనా సలహా చెపితే కసురుకుంటున్నాను. ఇలాంటి సమయాలలో గుండె వేగంగా కొట్టుకుంటోంది. అరి చేతుల్లో చెమట పడుతోంది. పెదాలు తడారి పోతున్నాయి. ఈ ప్రతికూల పరిస్థితుల నుంచి బయట పడి డిఎస్సీ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునే మార్గం చెప్పండి. **- ఒక సోదరి, తిరుపతి**



**జవాబు :** అమ్మా మీరు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అలాగే హార్మోన్ల అసమతుల్యత కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం ఆహార లేమి, నిద్రలేమి బరువు తక్కువగా ఉండటం అని చెప్పవచ్చు. దీనితో మీలో ఆత్మ విశ్వాసం దెబ్బతిని, ప్రతికూల ఆలోచనలు ఎక్కువుతున్నాయి. దీనివల్ల పరీక్షల్లో తప్పు చేశారు. కాబట్టి మొదట మీరు లోపాలను సరిద్దుకుని ఒత్తిళ్లను నియంత్రించుకోవడానికి ప్రయత్నం చేయండి. మీరు వయస్సు, ఎత్తుకు తగిన బరువు లేరు. దీనికి ప్రధాన కారణం సరిగా తినకపోవడం దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. అంటే ఈటింగ్ డిజార్డర్, ఒసిడి, సన్నగా ఉండాలన్న తపన, జీర్ణవ్యవస్థ లోపం లాంటివి. కాబట్టి ఒక సారి డాక్టరును సంప్రదించండి. ఈ సమస్య వారం పదిరోజుల్లో తీరేది కాదు. ఇంకో వారం లో జరిగే పరీక్షల కోసం ఒత్తిళ్ళ నిర్వహణ, ఉపశమన మార్గాలు ఆచరించండి. తేలికగా జీర్ణం అయ్యే ఆహారం తగినంత తీసుకోండి అలాగే ఇంకో రెండుగంటలు ఎక్కువగా నిద్రపోవడానికి ప్రయత్నం చేయండి. మెదడు చురుగ్గా పని చేయడానికి ఆహారం, నిద్ర చాల అవసరం అని గుర్తించండి. అనవసర ఆలోచనలు మాని ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నం చేయండి. డాక్టరును సంప్రదించి శక్తి సమకూర్చుకోవడానికి విటమిన్ టాబ్లెట్లు, సిరఫ్ లాంటివి తీసుకోండి. అనవసరం అయితే సైకాలజిస్టును సంప్రదించండి.

# కాకరతో రక్తహీనత దూరం !

**చేదుగా** ఉన్నట్లు కొందరు కాకరను దూరం పెట్టేస్తారు. నిజానికి అది చేసే మేలును వెలకట్టలేం. కాకరలో ఎ, బి1, బి2, బి3, బి5, బి6, బి9, సి విటమిన్లు, పీచు, పొటాషియం, సోడియం, భాస్వరం, మాంగనీస్, మెగ్నీషియం, క్యాల్షియం, రైబోఫ్లావిన్, రాగి, జింక్, ఐరన్లు ఉన్నాయి.




కాకర తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలో చేరిన సూక్ష్మక్రిములు నశిస్తాయి. గాయాలు త్వగా తగ్గుతాయి. కురులు దృఢంగా ఉంటాయి. కంటిచూపు మెరుగవుతుంది. చర్మానికి మెరుపు వస్తుంది. ఎముకలు, దంతాలు పటిష్టంగా ఉంటాయి. కాకర కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. గుండె జబ్బులను నిరోధిస్తుంది. ఊబకాయం రానివ్వదు. రక్తాన్ని, కాలేయాన్ని శుద్ధి చేస్తుంది. ఉబ్బసం లాంటి శ్వాస ఇబ్బందులను అరికడుతుంది. రక్తహీనత రాకుండా కాపాడుతుంది. కొన్ని రకాల క్యాన్సర్లను సైతం నివారిస్తుంది. రోజూ అర చెంచా చొప్పున కాకర రసం తాగుతుంటే మధుమేహం నియంత్రణలో ఉంటుంది. అల్లం, వెల్లుల్లి, నువ్వులు, పల్లీలు, కొబ్బరి లాంటివి జోడిస్తే కాకరకాయలతో అద్భుతాలే చేయొచ్చు. కూర, పచ్చడి, పులుసు, ఇగురే కాదు.. వీటితో కారం, చిప్స్ సైతం చేయొచ్చు. ఇవెంతో బాగుంటాయి కూడా. ఇన్ని సుగుణాలు ఉన్నప్పటికీ కాకరను అతిగా లేదా బలవంతంగా తినడం మాత్రం మంచిది కాదు. అలా చేస్తే వాంతులు, విరేచనాలు లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

# దాహం తీర్చిన సాయి

**ఆధ్యాత్మికం**

ఒకసారి **నానా సాహెబ్** చందోర్కర్ ఆఫీసు పనిమీద ఒక గ్రామానికి వెళుతూ దారిలో ఉన్న హరిశ్చంద్ర గుట్టను దాటవలసి వచ్చింది. కార్యాలయ సిబ్బందితో గుట్ట ఎక్కుతున్నాడు నాన. సగం దూరం ఎక్కేసరికి మధ్యాహ్నమైంది. అది మండు వేసవి (కనుక ఈ సంఘటన మే నెలలో జరిగి ఉంటుంది) నడి నెత్తిన సూర్యుడున్నాడు. నానకు గొంతుక పిడచకట్టుకుపోయింది. ఆయన అనుచరులంతా దగ్గరలో నీరు ఏమైనా లభ్యమవుతుందేమోనని చూచారు. కానీ, ఫలితం లేదు. నానా తీవ్ర దాహంతో ఉన్నాడు ఏమి చేయటానికి దిక్కుతోచలేదు. నానకు తన ఆరాధ్య దైవమైన సాయి గుర్తుకు వచ్చాడు. వెంటనే సాయిని మనసారా ప్రార్థించాడు. భక్తులందరకు తమ ఇష్ట దైవాలు సమయానికి సహాయం చేస్తాయి. ఈ సంగతి నానాకు తెలుసు. నర్సీ మెహతా హుండీని భగవానుడు గౌరవించాడు. ఏకనాథుని కోసం వంటలవాని రూపాన్ని దాల్చాడు రంగనాథుడు. దామాజీని కాపాడటం కోసం, విఠూ మహర్‌గా అవతరించాడు పాండురంగడు.

నానా సాయిబాబా ఇక్కడ ఉంటే బాగుండును అన్నాడు. ఆయన అనుచరులలో కొందరికి రుచించలేదు, ఆ మాట. అదే సమయానికి షిరిడీలో తన ప్రక్కన కూర్చున్న శ్యామాతో సాయి నానా ఆపదలో ఉన్నాడు అన్నాడు. సరిగ్గా అదే సమయానికి కట్టెల మోపు నెత్తిన



పెట్టుకున్న భిల్లుని. 'నీవు కూర్చున్న బండ క్రింద' అని జవాబిచ్చాడు ఆ భిల్లుడు. ఆ బండను తొలగించగానే స్వచ్ఛమైన నీరు ఎగజిమ్మింది. నీటిని తృప్తిగా త్రాగి నడకసాగించాడు నానా తన పరివారంతో. కొంత కాలానికి షిరిడీకి వెళ్లాడు నానా. ఫలాన రోజున, ఫలానా సమయంలో ఏదైనా ఆపదలో ఉన్నారా? అని ప్రశ్నించాడు నానాను శ్యామా. వివరాలు చెప్పాడు నానా. నీటి జాడ చెప్పిన భిల్లుడు సాయే అని అప్పుడు తెలిసింది నానకు. సాయి నానాకు భౌతిక దాహాన్ని తీర్చాడు నీటి జాడను చూపి, ఆధ్యాత్మిక దాహాన్ని కూడా తీర్చాడు గీతార్థాన్ని తెలిపాడు.

**- యం.పి.సాయినాథ్**

# మహిళల ఐసిసి ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన రెండోప్లేస్!



**దుబాయి, జూన్ 11:** ఐసిసి మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్‌స్మృతి మంధాన రెండోస్థానంలో ఉన్నారు. ఇంగ్లండ్ వికెట్ కీపర్, బ్యాటర్ అమీజోన్స్ తాజాగా ఐసిసి మహిళల ర్యాంకింగ్స్‌లో సత్తాచూపించింది. వెస్టిండీస్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో మొదటి వన్డేలో ఆమె సంచలన సెంచరీచేసారు. ఈ ప్రదర్శన తర్వాత జోన్స్ మూడు ప్లేస్‌లు ఎగబాకి ఐసిసి మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానానికి చేరారు. అంతటితో ఆగిపోలేదు. రెండో వన్డేలో కూడా 98 బంతుల్లో 129 పరుగులుచేసారు. ఈ మంచి ప్రదర్శనతో ఆమె ప్రస్తుతం 689 రేటింగ్ పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నారు. 738 పాయింట్లతో లారా వోల్వార్డ్ ఫస్ట్‌ప్లేస్‌లోను, 727 పాయింట్లతోస మృతి మంధాన రెండో ర్యాంక్‌లోను, 719 పాయింట్లతో నటాలీ స్కీవర్‌బ్రంట్ మూడోప్లేస్‌లో ఉన్నారు. ఇపుడు మంచి దూకుడు మీద ఉన్న జోన్స్ ర్యాంకింగ్‌లో మరింత దూసుకుపోతుందన్న అంచనాలున్నాయి. భారత్‌లోజరిగే పర్యటనతో ఆమె ర్యాంకింగ్స్‌లో తన స్థానం మరింత మెరుగుపరుచుకుంటుందని అంచనా.

# నేనేమీ పిచ్చోడిని కాదు.. నాకెందుకు ఆర్సీబీ?

## ఫ్రాంచైజీ కొనుగోలుపై కర్ణాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్



**బెంగళూరు,జూన్ 11:** ఆర్సీబీని కొనుగోలు చేస్తున్నారనే వార్తలను కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పూర్తిగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ నేను పిచ్చోడిని కాదు. నేను చాలా కాలంగా కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌తో మాత్రమే అనుబంధం కలిగి ఉన్నాను. అంతే, అంతకు మించి ఏమీ లేదు. నాకు సమయం లేదు. అయితే మేనేజ్మెంట్‌లో భాగం కావాలని నాకు ఆఫర్ వచ్చింది. నాకు ఆర్సీబీతో ఏం పని? నేను కనీసం రాయల్ ఛాలెంజ్ కూడా తాగను అని డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. ఆర్సీబీని విక్రయిస్తున్నారనే పుకార్లను జట్టు యజమానులు కూడా పూర్తిగా ఖండించారు. అయితే ఈ వార్తలను ఆర్సీబీ మేనేజ్‌మెంట్ డియాజియో కంపెనీ ఖండించింది. ఆర్సీబీ ఫ్రాంచైజీని విక్రయిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని స్పష్టం చేసింది. ఆ వార్తలన్నీ ఊహాజనితాలేనని వెల్లడించింది. ఆర్సీబీ అమ్మకానికి చర్చలు కూడా జరగలేదని పేర్కొంది. ఇండియాలో ఆల్కహాల్, పొగాకు బ్రాండ్ల ప్రమోషన్‌పై నిషేధం ఉన్నా మా ఉత్పత్తులను ఇతర మార్గాల ద్వారా ప్రచారం చేసుకుంటామని.. దానికి, ఆర్సీబీ అమ్మకానికి ఎలాంటి సంబంధం లేదని కంపెనీ అధికారికంగా ప్రకటనను విడుదల చేసి ప్రచారానికి తెరదించింది. వారు బీఎస్ఈ పర్యవేక్షణ విభాగానికి రాసిన లేఖలో ఈ వార్తలన్నీ కేవలం పుకార్లేనని స్పష్టం చేశారు.

## ఎంఐ న్యూయార్క్ కెప్టెన్‌గా

# నికోలస్ పూరన్



**న్యూఢిల్లీ,జూన్ 11:** వెస్టిండీస్ పాకెట్ డైనమైట్ నికోలస్ పూరన్‌ను లక్ వెంటాడింది. ఇంటర్నేషనల్ క్రికెట్‌కు గుడ్ బై చెప్పిన తర్వాత రోజే ఎంఐ ఫ్రాంచైజీగా కెప్టెన్‌గా అవకాశం దక్కింది. యూఎస్ఏ వేదికగా జరగనున్న మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ)లోని ఎంఐ న్యూయార్క్ జట్టు కెప్టెన్‌గా పూరన్‌ని ఫ్రాంచైజీ ప్రక టించింది. మా పాకెట్ డైనమైట్ హీరో అంటూ ఎంఐ ఫ్రాంఛైజీ పూరన్‌ని ఆకాశానికి ఎత్తింది. మేజర్ లీగ్ క్రికెట్ 2025 ఇంకో రెండు రోజుల్లో ప్రారంభం కానుంది. గతేడాది ఎంఎల్‌సీలోనే అత్యధిక పరుగులు చేసిన నికోలస్ పూరన్‌ను ఎంఐ న్యూయార్క్ తమ జట్టు కెప్టెన్‌గా బుధవారం ప్రకటించింది.

గతేడాది లీగ్‌లో పూరన్ 388 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.ప్రస్తుత టీ20 క్రికెట్‌లో నికోలస్ పూరన్ ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఏ టీ20 లీగ్‌లో అయినా తన మార్క్ బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు భయం పుట్టిస్తున్నాడు. ఐపీఎల్ 2025లోనూ తనదైన బ్యాటింగ్‌తో సిక్సర్ల మోత మోగించాడు. మేజర్ లీగ్ క్రికెట్ 2023లో ఎంఐ న్యూయార్క్‌ని ఛాంపియన్‌గా నిలపడంలో పూరన్ పాత్ర కీలకం. 2023 సీజన్ ఫైనల్‌లో 55 బంతుల్లో 10 ఫోర్లు, 13 సిక్సర్లతో 137 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ఎంఐని ఛాంపియన్‌గా నిలబెట్టాడు. మా హీరో, మా కెప్టెన్ నికోలస్ పూరన్. 29 ఏళ్ల పాకెట్ డైనమైట్, మినీ సూపర్ స్టార్‌ను మేజర్ లీగ్ క్రికెట్ 2025 సీజన్ ముందు ఎంఐ న్యూయార్క్ కెప్టెన్‌గా ప్రకటిస్తున్నాంప్రపంచంలోనే భ యం పుట్టించే బ్యాటర్లలో ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ ఒకడు. ఇప్పుడు ఇతను అత్యున్నత స్థానంలో ఉన్నాడు. నాయ కత్వం స్వీకరించడానికి ఇదే సరైన సమయమనిఎంఐ ఫ్రాంఛైజీ అధికారికంగా వెల్లడించింది. 2016లో విండీస్ జట్టులో అడుగుపెట్టిన పూరన్ 2024లో తన చివరి మ్యాచ్ ఆడాడు. వెస్టిండీస్ తరఫున వన్డే, టీ20 మ్యాచ్‌లలో కలిపి నాలుగు వేలకు పైగా పరుగులు సాధించాడు విండీస్ తరఫున టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా పూరన్ నిలిచాడు.

# మూడోప్లేస్‌లో ఉన్న టీమిండియాకు ప్రైజ్‌మనీ ఎక్కువే!

**ముంబై, జూన్ 11:** వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ షురూ అయింది. దక్షిణాఫ్రియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య లార్డ్స్‌లో టైటిల్ సమరం జరుగుతున్నది. డబ్ల్యూటీసీ విజేతలకు చెందిన ప్రైజ్‌మనీని గతంలోనే ఐసీసీ ప్రకటించింది. అయితే విజేత, రన్నరప్ జట్లతో పాటు మూడో స్థానంలో నిలిచిన టీమిండియా జట్టుకు ఎంత ప్రైజ్‌మనీ దక్కుతుందో కూడా వెల్లడించారు. టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లోకి ఇండియా ప్రవేశించలేదు. కానీ ఆ జట్టుకు ప్రైజ్‌మనీలో భాగంగా 12.33 కోట్లు ఇవ్వనున్నారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య జరిగే మ్యాచ్‌లో విజేతకు 3.6 మిలియన్ల డాలర్లు ఇస్తారు. ఇక రన్నరప్ జట్టుకు 2.1 మిలియన్ల డాలర్ల ప్రైజ్‌మనీ ఇస్తారు. రెండేండ్లపాటు 9 జట్ల మధ్య హోరాహోరీగా సాగిన డబ్ల్యూటీసీ సైకిల్‌లో 69.44 శాతంతో అగ్రస్థానం దక్కించుకున్న దక్షిణాఫ్రికా. 19 టెస్టులాడి 13 విజయాలు, 67.54 శాతంతో రెండో స్థానంలో నిలిచిన ఆస్ట్రేలియా.. టైటిల్ కోసం నేటి నుంచి అమీతుమీ తేల్చుకోనున్నాయి. ప్యాట్ కమ్మిన్స్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా జట్టు టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు ప్రయత్నించనున్నది. 2023 జూన్‌లో జరిగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో ఇండియాను ఓడించి ఆస్ట్రేలియా టైటిల్ నెగ్గిన విషయం తెలిసిందే. ఇక తొలిసారి డబ్ల్యూటీసీ టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలని టెంబ బవుమా నేతృత్వంలోని దక్షిణాఫ్రికా ప్రయత్నిస్తోంది.

# తిలక్‌వర్మకు లిఫ్ట్

## సూర్యకుమార్‌కు నిరాశే!



### ఐసిసి ర్యాంకింగ్స్ విడుదల

**ముంబయి, జూన్ 11:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) బుధవారం విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. ఐపీఎల్ 2025 సీజన్ కారణంగా అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు తక్కువగా జరగడంతో, ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు కనిపించలేదు. అయితే, కొందరు ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌లో స్వల్ప మార్పులు సంభవించాయి. బ్యాటింగ్‌లో ట్రావిస్ హెడ్ ఆధిపత్యంతో నిలిచాడు. తిలక్ వర్మకుకొంత లాభమే..పురుషుల టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ తన నంబర్ వన్ స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ట్రావిస్ హెడ్ 856 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. భారత యువ సంచలనం అభిషేక్ శర్మ 829 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి తన స్థానాన్ని నిలుపుకున్నాడు. ఈ తాజా ర్యాంకింగ్స్‌లో భారత యువ బ్యాటర్ తిలక్ వర్మకు ఒక స్థానం మెరుగుపడింది. 804 పాయింట్లతో తిలక్ వర్మ నాలుగో స్థానం నుంచి మూడో స్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్ నుంచి ఇంగ్లాండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్ తన పేరును ఉపసంహరించుకోవడంతో అతని ర్యాంకు పడిపోయి తిలక్ వర్మకు లాభం చేకూరింది. సాల్ట్ ఒక స్థానం దిగజారి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌కు టీ20 ర్యాంకింగ్స్‌లో నిరాశ ఎదురైంది. 739 పాయింట్లతో సూర్య కుమార్ యాదవ్ ఒక స్థానం దిగజారి ఐదో స్థానం నుంచి ఆరో స్థానానికి చేరుకున్నాడు. 772 పాయింట్లతో సూర్య స్థానాన్ని ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ ఆక్రమించాడు. జోస్ బట్లర్ ఒక స్థానాన్ని మెరుగుపరచుకుని ఐదో స్థానానికి చేరుకున్నాడు. టెస్ట్ ర్యాంకింగ్‌లో మార్పులు జరిగే అవకాశం ఉన్నట్లు అంచనా. కాగా వచ్చే వారం కొత్త ఐసీసీ ర్యాంకింగ్‌లో కూడా మార్పులు జరిగే అవకాశం ఉంది. ఎందుకంటే జూన్ 11 నుండి లండన్‌లోని లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ 2025లో తలపడుతున్నాయి. ఈ కారణంగా కొత్త టెస్ట్ ర్యాంకింగ్‌లో మార్పులు జరగనున్నాయి.

# అయ్యర్‌ను తీసుకోకపోవడం సెలెక్టర్ల తప్పే: గంగూలీ



**ముంబయి,జూన్ 11:** శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో టీమిండియా ఇంగ్లాండ్‌తో 5మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కోసం సన్నాహాలు చేస్తోంది. యువ ఆటగాళ్లతో నిండిన ఈ జట్టుకు ఇంగ్లాండ్‌లో గెలవడం కష్టమే కానీ అసాధ్యం కాదు. ఇటువంటి సమయంలో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులో చేర్చకపోవడంపై సెలెక్టర్లపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జూన్ 20 నుంచి భారత జట్టు తొలి టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. దీని కోసం జూన్ 7 నుంచి ఆటగాళ్లు ఇంగ్లాండ్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. జస్‌ప్రీత్ బుమ్రా, రిషబ్ పంత్, కరుణ్ నాయర్ వంటి ఆటగాళ్ల అనుభవం ఈ పర్యటనలో తప్పకుండా ఉపయోగపడుతుంది. అయితే చాలా మంది యువ ఆటగాళ్లకు ఇంగ్లాండ్ పరిస్థితులు సవాలుగా మారనున్నాయి. ఓ ఇంటర్వ్యూలో సౌరవ్ గంగూలీ మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో మన యువ జట్టు అద్భుతంగా రాణించింది. అప్పుడు రోహిత్,విరాట్ లేరు. శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, అభిమన్యు, యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్ తిరిగి వచ్చారు. నా దృష్టిలో ఇది వీరందరికీ ఒక అవకాశం.. ఎలాంటి ఒత్తిడి లేదు. ఈ పరిస్థితులు మీకు సవాలు విసురుతాయి కానీ మిమ్మల్ని తీర్చిదిద్దుతాయి కూడా. అని అన్నారు. ఐపీఎల్ తర్వాత మరో జట్టును ఫైనల్ చేర్చిన శ్రేయస్ అయ్యర్ లేకపోవడంపై సౌరవ్ గంగూలీ మాట్లాడుతూ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులో చేర్చకపోవడంపై సెలెక్టర్లపై సెలక్టర్లదే తప్పన్నారు.అయ్యర్ ఒకసంవత్సరంగా తన అత్యుత్తమ ప్రదర్శన ఇస్తున్నాడు. శ్రేయస్ అయ్యర్ జట్టులో ఉండాల్సింది. శ్రేయస్ అయ్యర్ జట్టు నుంచి బయట ఉండాల్సిన ఆటగాడుకాదు.అయ్యర్ ఇప్పుడు ఒత్తిడిలో కూడా మంచి ఇన్నింగ్స్ లు ఆడుతున్నాడు. బాధ్యతలను అర్థం చేసుకుంటున్నాడు. షార్ట్ బంతులను కూడా ఆడుతున్నాడు. టెస్ట్ క్రికెట్ భిన్నంగా ఉన్నప్పటికీ శ్రేయస్ అయ్యర్ ఈ సిరీస్‌లో చేరితే అతని సామర్థ్యాన్ని చూడాలని కోరుకుంటున్నా అని గంగూలీ పేర్కొన్నారు. శ్రేయస్ అయ్యర్ టెస్ట్ కెరీర్‌ను పరిశీలిస్తే 14 మ్యాచ్‌లలో 24 ఇన్నింగ్స్‌లలో 36.86 సగటుతో 811 పరుగులు చేశాడు. అందులో ఒక సెంచరీ, 5అర్ధ సెంచరీలు ఉన్నాయి. అయ్యర్ తన చివరి టెస్ట్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 2024లో ఇంగ్లాండ్ జట్టుతో ఆడాడు.

## వాణిజ్యం

# స్వల్ప లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై, జూన్ 11:** ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాల నడుమ ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. చివరకు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లలో లాభాల స్వీకరణ కనిపించింది. సెన్సెక్స్ ఉదయం 82,473.02 పాయింట్ల (క్రితం ముగింపు 82,391.72) వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,308.91 82,783.51 మధ్య కదలాడింది. చివరకు 123 పాయింట్ల లాభంతో 82,515.14 వద్ద ముగిసింది. నిఫ్టీ 37 పాయింట్ల లాభంతో 25141 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.52గా ఉంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్‌ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, టాటా స్టీల్, సన్‌ఫార్మా షేర్లు లాభపడ్డాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, నెస్లే ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67.69డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,354 డాలర్ల వద్ద కొనసాగింది.

# యువతకు సత్య నాదెళ్ల గైడెన్స్

**వాషింగ్టన్, జూన్ 11:** కృత్రిమ మేధకు ఆదరణ పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు, ఔత్సాహిక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు బేసిక్స్‌పై పట్టు సాధించాలని మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల సూచించారు. టెక్ యూట్యూబర్ సజ్జాద్ ఖాడేతో జరిగిన ఇంటర్వ్యూ సందర్భంగా సత్య నాదెళ్ల మాట్లాడుతూ, ఎఐ కోడింగ్, ఇతర సంక్లిష్టమైన పనులను ఆటోమేట్ చేస్తున్నప్పటికీ టెక్ డెవలప్‌మెంట్‌కు మానవ నైపుణ్యాలు అవసరం అవుతాయని చెప్పారు. బలమైన కంప్యూటేషనల్ థింకింగ్, సిస్టమ్ డిజైన్ నైపుణ్యాలపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ప్రాథమికాంశాలపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యమని ఈ సందర్భంగా సతనయ నాదెళ్ల స్పష్టం చేశారు. సమస్యలను తార్కికంగా పరిష్కరించాలని, నిర్మాణాత్మక సొల్యూషన్స్ సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్‌గా ఎదిగేందుకు ఎఐ మానవుల ప్రయాణాన్ని వేగవంతం చేస్తోందని సత్య పేర్కొన్నారు. లెక్స్ ఫ్రిడ్‌మన్‌తో గతంలో



జరిగిన పాడ్‌కాస్ట్‌లో గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ మాట్లాడుతూ, కంప్యూటర్ కోడింగ్ రాసేందుకు 30శాతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయపడుతుందని చెప్పారు. మరింత సృజనాత్మక పనుల కోసం మానవ ప్రతిభ తప్పకుండా అవసరం అవుతుందన్నారు. ఎఐ తమ ఇంజినీరింగ్ వేగాన్ని 10శాతం పెంచిందని చెప్పారు.

# ఐపిఒకు 'మీషో' !

**ముంబై, జూన్ 11:** ఇ-కామర్స్ రంగంలో వేగంగా ఎదుగుతున్న సంస్థ మీషో త్వరలో స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ దిశగా ఒక కీలక ముందు అడుగు వేస్తూ కంపెనీ దాని పేరును 'మీషో లిమిటెడ్'గా మార్చుకుంది. గతంలో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా ఉన్న మీషో, ఇప్పుడు పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారింది. ఐపిఒ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్) తీసుకురావడానికి ముందు ఇది ఒక కీలకమైన చట్టపరమైన ప్రక్రియ, దీంతో కంపెనీ స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ వైపు వేగంగా కదులుతోందని సూచిస్తుంది. మీషో ఇంకా ఐపిఒ కోసం డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రోస్పెక్టస్ ఫైల్ చేయనప్పటికీ కంపెనీ ఫైలింగ్‌లో వృద్ధికి వివిధ మార్గాలను అన్వేషిస్తున్నట్లు స్పష్టంగా పేర్కొంది, ఇందులో తగిన సమయంలో ఐపిఒను ప్రారంభించడం ఇంకా భారతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేయటం వంటివి ఉన్నాయి. బ్రోకరేజ్ సంస్థ సిఎల్ఎస్ఎ నివేదిక ప్రకారం, 2024లో భారతదేశం మొత్తం ఇ-కామర్స్ ఆర్డర్‌లలో మీషోకి మాత్రమే 37శాతం వాటా ఉంది. డిసెంబర్ 2024 నాటికి కంపెనీ ప్లాట్‌ఫామ్‌లో ఏటా 187 మిలియన్ల కస్టమర్లు కొనుగోళ్లు చేశారు, ఇది దాని విస్తృత పరిధి ఇంకా వేగంగా పెరుగుతున్న ప్రజాదరణను చూపిస్తుంది. కంపెనీ ఆర్థిక పరిస్థితి అలాగే లాభాల దిశగా అడుగులు: మీషో ఆర్థిక పరిస్థితి ఇప్పుడు మరింత బలోపేతం అవుతోంది. 2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం 33శాతం పెరిగి రూ.7,615 కోట్లకు చేరుకుంది. ప్రత్యేకత ఏమిటంటే కంపెనీ నష్టం దాదాపు పూర్తిగా తగ్గింది. 2024లో నష్టం కేవలం రూ.53 కోట్లు మాత్రమే, ఇది గత సంవత్సరాల కంటే 97శాతం తక్కువ. దీని అర్థం కంపెనీ ఇప్పుడు లాభాల వైపు దృఢమైన అడుగులు వేస్తోంది. ఐపిఒ ప్రక్రియకు బ్యాంకింగ్ దిగ్గజాలు: మీషో ఐపిఒను సక్సెస్ చేయడానికి కోటక్ మహీంద్రా కేపిటల్, సిటీ గ్రూప్, జెపి మోర్గాన్ అండ్ మోర్గాన్ స్టాన్లీ వంటి ప్రపంచ పెట్టుబడి బ్యాంకులను సలహాదారులుగా నియమించుకుంది. ఈ కంపెనీ 10 బిలియన్ల డాలర్లు అంటే సుమారు రూ.83,000 కోట్లు విలువతో స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కావాలని యోచిస్తోంది. అయితే మీషో ఐపిఒ స్టాక్ మార్కెట్‌లో ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందో చూడాలి.





# భారత్ ఎఐ మార్కెట్ ట్రిపుల్ జంప్



**ముంబై, జూన్ 11:** ఇతర దేశాలతో పోలిస్తే భారత మార్కెట్లో కృత్రిమ మేధ (ఎఐ) వినియోగం అత్యంత వేగంగా పెరుగుతోంది. దీనికి ప్రధానంగా ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీలో పెట్టుబడులు ఊందవుకోవడం, అభివృద్ధి చెందుతున్న డిజిటల్ వాడకం, నైపుణ్యం ఉన్న ఉద్యోగులు ఎక్కువగా అందుబాటులో ఉండడం వంటి కారణాలతో ఎఐ మార్కెట్ పుంజుకుంటోందని ఒక నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం, 2027 నాటికి భారత ఎఐ మార్కెట్ 17 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఇది ప్రస్తుతం ఉన్న పరిమాణం కంటే మూడు రెట్లు అధికం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎఐ టాలెంట్‌లో భారత్ 16శాతం వాటా కలిగి ఉంది. దేశంలో ఉన్న అధిక జనాభా, పటిష్టమైన స్టెమ్ విద్యా వ్యవస్థ ద్వారా ఈ ప్రయోజనం లభించింది. భారత్ తర్వాత ఎక్కువ ఎఐ ప్రతిభ ఉన్న జనాభా అమెరికాలో ఉంది. భారత్ 6 లక్షల కంటే ఎక్కువ ఎఐ స్కిల్స్ ఉన్న వ్యక్తులు, 70 కోట్ల కంటే ఎక్కువ ఇంటర్నెట్ యూజర్లు, గతమూడేళ్లలో 2వేల కంటే ఎక్కువ ఎఐ స్టార్టప్‌లతో ఎఐ ఎకో సిస్టమ్‌ను కలిగి ఉంది. ఈ క్రమంఒల 2027 నాటికిరూ.1.45 లక్షల కోట్లకు చేరడంసులభం. తద్వారా ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగవంతమైన ఎఐ ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా మనదేశం ఉండనుంది.

# యుపిఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు!


## అవన్నీ నిరాధారమైన కల్పిత వార్తలే!: కేంద్ర ఆర్థికశాఖ

**న్యూఢిల్లీ, జూన్ 11:** యుపిఐ లావాదేవీలపై ఛార్జిలు విధిస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని కేంద్రం కొట్టిపారేసింది. బ్యాంకులకు లావాదేవీల నిర్వహణలో ఛార్జిలభారం తడిసిమోపడవుతోందని అందువల్ల రూ.3 వేలు దాటిన యుపిఐ లావాదేవీలన్నింటిపైనా ఛార్జీలువేయాలని కేంద్రం యోచిస్తున్నట్లు వస్తున్నప్రచారంలో వాస్తవం లేదని కేంద్ర ఆర్థికశాఖ కొట్టివేసింది. యుపిఆర్ లావాదేవీలపై ఎండిఆర్ వసూలుచేస్తారంటూ వచ్చిన వార్తలు పూర్తిగా నిరాధారమని ఆర్థికశాఖ తెలిపింది. ప్రచారం తప్పుదారిపట్టిస్తోందని, నిరాధారమైన, సంచలనం సృష్టించేఊహాగానాలు పౌరుల్లో అనవసర భయాందోళనలకు కారణమవుతాయంటూ ఎక్స్‌లో వెల్లడించింది. యుపిఐ ద్వారా డిజిటల్ చెల్లింపులకు ప్రోత్సహించడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపింది. ఎండిఆర్ ఛార్జిలు విధిస్తే యూజర్లపై ఎలాంటి ప్రభావం ఉండదని, ఈ లావాదేవీలకోసం యూజర్లనుంచి ఎలాంటి ఛార్జిలు వసూలుచేయరని, మూడేళ్లముందువరకూ యుపిఐ ఆధారిత చెల్లింపులను ప్రాసెస్‌చేసేందుకు వ్యాపారులు కొంత ఛార్జిలు వసూలుచేసి బ్యాంకులకు కట్టాల్సివచ్చేదని, అదికూడా ఒకశాతం లోపే ఉంటుందని తేల్చారు. అయితేయుపిఐ చెల్లింపులపై ఎండిఆర్‌ఛార్జీలను 2022లోనే కేంద్రం తొలగించింది. తర్వాత ఈప్రాసెసింగ్‌ఖర్చులను భర్తీచేసేందుకు బ్యాంకులు ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తోంది.



# ఉద్యోగులను తైవాన్ పంపుతున్న టాటా గ్రూప్..

**ముంబై, జూన్ 11:** దేశంలో సెమీకండక్టర్ల తయారీలో ముందడుగు వేసేందుకు టాటా ఎలక్ట్రానిక్స్ వేగంగా దూసుకుపోతోంది. సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్, అసెంబ్లింగ్ అండ్ టెస్ట్ సదుపాయం కోసం కంపెనీ ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ విభాగంలో ఉద్యోగులకు అవసరమైన నైపుణ్యాల కోసం తైవాన్‌కు శిక్షణ నిమిత్తం పంపుతున్నట్లు ఈ పరిణామాలపై అవగాహన ఉన్న వ్యక్తులు తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్ గుజరాత్‌లోని ధోలేరాలో సమీకండక్టర్లకు సంబంధించిన ఫ్యాబ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయనుంది. దీన్ని నిర్వహించడానికి అవసరమైన ప్రత్యేక నైపుణ్యాల్లో శిక్షణ కోసం తన టెక్నాలజీ భాగస్వామిగా ఉన్న తైవాన్‌కు చెందిన పవర్చిప్ సెమీ కండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ (పిఎస్ఎంసి)కు 200 మంది ఉద్యోగులను పంపింది. పిఎస్ఎంసిలో ఒకేసారి శిక్షణ ఇచ్చేవారి సంఖ్య పరిమితం కావడంతో కంపెనీ నిర్మాణాత్మక ప్రణాళికను అనుసరిస్తోంది. ఇకపై ప్రతిసారి 50 నుంచి 75 మందిని శిక్షణకు పంపించాలని నిర్ణయించింది. ధోలేరాలో టాటా ఎలక్ట్రానిక్స్ రూ.91వేల కోట్ల విలువైన ఫ్యాబ్ ద్వారా 20వేల మందికిపైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలను కల్పించాలని యోచిస్తోంది. అసోంలో రూ.27వేల కోట్ల ఓశాట్ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 27వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తోంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.